

నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



'ఇడి' నేషనల్ హెరాల్డ్ అభియోగం.. నిజంగా ఒక వింత కేసు
హిమాచల్‌లో 'జల ప్రళయం'
గాజాపై ఆగని దాడులు
'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలపై ఆర్‌ఎస్‌ఎస్ అక్కసు
లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 16 | శనివారం | 05-07-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00






## హైదరాబాద్‌కు మోదీ ఏంచేశారు?

మాజీప్రధానుల హయాంలో తెలంగాణకు 50 కేంద్ర సంస్థలు వచ్చాయ్

● గత పదేళ్లలో బిజెపి సర్కార్ రాష్ట్రానికి చేసింది శూన్యం ● ఇంకెంతకాలం ప్రజలను మోసం చేస్తారు? ● రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించడం ఎవరితరమూ కాదు ● దేశ ఆర్థిక పరిస్థితిని మోదీ ఛిన్నాభిన్నం చేశారు ● 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభ'లో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజం

ప్రజాపక్షం / హైదరాబాద్

సెక్యులర్, సోషలిస్టు పదాలను రాజ్యాంగం నుంచి తొలగించడం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా సహా ఎవరి తరం కాదని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించేంత ధైర్యం వారికి లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్‌లో గల అంశాలను ఆయన చదవి వినిపించారు. 11 ఏళ్ల అధికారంలో ఉన్న ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారని, దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ ఛిన్నాభిన్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మోదీజీ... ముందు మన దేశ ప్రజల బాధలు వినండి. ఆ తర్వాత విదేశాల సంగతి చూడొచ్చు' అని ఖర్గే అన్నారు. హైదరాబాద్‌కు ప్రధాని మోదీ చేసింది శూన్యమని విమర్శించారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, నెహ్రూ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బిహెచ్ఇఎల్, బిఇఎల్ తదితర సుమారు 50 కేంద్ర సంస్థలను తీసుకువచ్చిందని,

తరువాయి 2లో

### వచ్చే ఎన్నికల్లో... వంద స్థానాలు గెలుస్తాం

● రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం ● 15 మంది ఎంపీలను ఢిల్లీకి పంపుతాం ● కాంగ్రెస్ అధిష్టానానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ● వందలో ఒక్కస్థానం తగ్గినా ప్రశ్నించాలని వెల్లడి



02

### అమెరికాతో వాణిజ్య ఒప్పందం
## భారత రైతులకు మరణశాసనం

● తక్షణమే చర్చలు ఆపాలి ● బీహార్‌లో ఎస్ఐఆర్ ఉపసంహరించాలి ● 9న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి ● వర్షాలతో నష్టపోయిన హిమాచల్ రైతులను ఆదుకోవాలి ● సిపిఐ జాతీయ సమితి తీర్మానాలు



**న్యూఢిల్లీ:** అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందానికి జరుగుతున్న కసరత్తును సిపిఐ ఖండించింది. 'కాంపాక్ట్' వాణిజ్య ఒప్పందం భారతదేశ రైతులకు మరణ శాసనమే అవుతుందని హెచ్చరించింది. అంతేకాకుండా ఆర్థిక వ్యవస్థ గాడి తప్పుతుందని, దేశ యువత దోపిడీకి గురవుతారని, భారత్ సార్వభౌమత్వం కోల్పోతుందని పేర్కొంది. తక్షణమే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా జరిపే చర్చలను ఆపాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈనెల 1,2,3 తేదీల్లో న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో జరిగిన సిపిఐ జాతీయ సమితి తీర్మానించింది. మరికొన్ని తీర్మానాలను కూడా ఏకగ్రీవంగా ఆమోదించింది. వ్యవసాయం, డెయిరీ రంగాల్లో అమెరికాకు మార్కెట్ కల్పించడం అంటే మన రైతులకు మరణ శాసనం జారీ చేయడమే అవుతుందని సిపిఐ ఆందోళన వ్యక్తంచేసింది. ఇప్పటికే నూనె గింజలు, సోయా ఉత్పత్తుల దిగుమతుల కారణంగా ధరలు పడిపోవడంతో సోయాబీన్, పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తీర్మానంలో పేర్కొంది. ఈనెల 9న కార్మికరైతు సంఘాల సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. కార్మిక సంఘాల డిమాండ్లకు మద్దతు ఇవ్వడమే కాకుండా తమ డిమాండ్ల సాధన కోసం గ్రామీణ భారతాన్ని చైతన్యవంతం చేయాలన్న నిర్ణయంతో సార్వత్రిక సమ్మెకు రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయని పేర్కొంది. కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల

తరువాయి 2లో

### అటవీ సంపదను కొల్లగొట్టేందుకే
## నక్సలైట్లపై మారణకాండ

● కమ్యూనిస్టులు ఏకమై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆగడాలను అరికట్టాలి ● దేశంలో బిజెపి రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసింది ● దొడ్డి కొమరయ్య వర్ధంతి సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపాటు



ప్రజాపక్షం-/జనగామ ప్రతినిధి

దేశంలో టెర్రరిస్టులకు అమిత్‌షా అనుకూలమా..! అందుకే వారిని వదిలి ప్రజల కోసం, అటవీ సంపదను కాపాడడం కోసం తుపాకులు పట్టిన నక్సలైట్లను ఆపరేషన్ కగార్ పేరుతో కాల్చి చంపుతూ టెర్రరిస్టులను మాత్రం నిర్మూలించలేకపోతున్నారా అని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రశ్నించారు. ఎంతో చరిత్ర కలిగిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని తుదముట్టించాలనుకున్న అనేక మంది అమిత్‌షా లాంటి వారు కాలగర్భంలో కలిసిపోయారని, అలాంటి వారికి బుద్ధిచెప్పాలంటే ఇప్పటికైనా కమ్యూనిస్టులు ఏకమై బిజెపి, ఆర్‌ఎస్ఎస్‌ను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సభ శుక్రవారం దేవరుప్పుల మండలం

తరువాయి 2లో

### ఫైనాన్స్ కంపెనీల ఉచ్చు...
## అప్పుల ఊబిలో పేదలు

● ప్రభుత్వరంగ బ్యాంకులను, ఇన్సూరెన్స్ సంస్థలను కాపాడుకుందాం ● యునైటెడ్ ఫోరం ఆఫ్ పబ్లిక్ సెక్టార్, యూనియన్స్(యుఎఫ్‌పియు) పిలుపు ● దేశవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొననున్న బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులు




ప్రజాపక్షం/హైదరాబాద్

నూతన ఆర్థిక విధానాల పేరుతో కేంద్ర ప్రభుత్వం తిరోగమన పోకడలను అనుసరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంక్‌లు, ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు ఈ రంగాలను నిర్వీర్యం చేస్తోందని ఎఐబిఇఎ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో పాటు 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులుపెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె సన్నద్ధంలో భాగంగా హైదరాబాద్‌లోని ఎఐబిఇఎ రాష్ట్ర కార్యాలయంలో గురువారం యునైటెడ్ ఫోరం ఆఫ్ పబ్లిక్ సెక్టార్, యూనియన్స్ (యుఎఫ్‌పియు) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేటర్ వివిఎస్.బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐబిఇఎ సెక్రటరీ రాంబాబు, యుఎఫ్‌పియు కన్వీనర్ ఎన్‌వి. రమణ, ఎఐపిఆర్‌డిఎ స్టేట్ సెక్రటరీ ఎండి. జలాల్లుద్దీన్, ఆర్‌ఎస్ తెలంగాణ జిఐజిఎఐఎ ఎం.శివశంకర్, తెలంగాణ పోస్టల్ బి. నర్సింహులు, డిజిఎస్,

తరువాయి 12లో

### పెచ్చులూడిపడిన పాఠశాల పైకప్పు

● విద్యార్థులకు తప్పిన ప్రమాదం ● రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో ఘటన



ప్రజాపక్షం/కొందుర్గు

పాఠశాల పైకప్పు పెచ్చులూడిపడడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పిన సంఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి కథనం మేరకు... మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో మొత్తం ఏడు తరగతుల్లో 68 మంది విద్యార్థులుండగా, 5 మంది ఉపాధ్యాయులున్నారు. ఏడు తరగతుల విద్యార్థులకు పాఠశాలలో కార్యాలయం గది కలుపుకొని కేవలం 5 గదులే ఉండడంతో గదుల కొరత ఉంది. 1వ తరగతి, 2వ తరగతి విద్యార్థులను ఒక గదిలో, 3, 4 తరగతుల విద్యార్థులను మరో గదిలో, 5వ తరగతి విద్యార్థులను ఒక గదిలో, 6వ తరగతి విద్యార్థులను ఒక గదిలో, 7వ తరగతి విద్యార్థులను పాఠశాల కార్యాలయం గదిలో కూర్చోబెట్టుకొని విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలోని మూడు గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అవే గదుల్లో విద్యార్థులకు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. దీనికి తోడు పాఠశాలకు కంపౌండ్ వాల్ లేకపోవడంతో, విద్యార్థులకు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన

తరువాయి 12లో

### జూరాలకు జల కళ

14 గేట్లు ఎత్తివేత
ప్రాజెక్టులోకి 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో
కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి

ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది పరీవాహక ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి మట్టం 129.72 టిఎంసిలకు 90.01 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుండి

తరువాయి 12లో






### 13 రాజకీయ పార్టీలకు
## ఇసి షోకాజ్ నోటీసులు

● గత ఆరేళ్లుగా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకపోవడమే కారణం ● ఈ నెల 10 లోపు నివేధిక ఇవ్వాలని అధికారులకు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పలు రాజకీయ పార్టీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక చర్యలు చేపట్టింది. గత ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా, కేవలం రిజిస్టర్డ్ పార్టీలుగా మాత్రమే కొనసాగుతున్న 13 పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఆదేశించింది. రాష్ట్రంలో ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉండి ఆరేళ్లకు పైగా ఏ ఎన్నికల బరిలోనూ నిలవని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఇసి నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే 13 పార్టీలను గుర్తించి

తరువాయి 12లో

### మాజీ సిఎం రోశయ్య ప్రసంగాలు
## నేటి యువతకు స్ఫూర్తి

వర్ధంతి సభలో వక్తల ఆకాంక్ష
కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ప్రసంగాలను నేటి యువతరం నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభ జరిగింది. ఈ సభలో గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,

తరువాయి 12లో



సిగాచి పేలుడుపై న్యాయ విచారణ జరిపించాలి

03



ఎసిబి వలలో డిప్యూటీ తహసీల్దార్

12



# ప్రపంచం
WORLD NEWS

## పడవ ప్రమాదంలో గల్లంతైన వారికోసం ముమ్మర గాలింపు



**ఇండోనేషియా:** పడవ ప్రమాదంలో గల్లంతైన 30 కోసం ఇండోనేషియా అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తూర్పు జావాలోని కెటాపాంగ్ పోర్ట్ నుంచి బుధవారం బాలీలోని గిలిమానుక్ పోర్ట్‌కు బయలుదేరిన 'కెఎంపి టును ప్రతమ జయా ఫెర్రీ' నీటిలో మునిగిపోయిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఆరుగురు మృతి చెందగా, 29 మందిని రెస్క్యూ బృందాలు రక్షించినట్టు అధికారులు ప్రకటించారు. మిగతా వారి ఆచూకీ కోసం మూడు హెలికాప్టర్లు, 20 పడవలు గాలిస్తున్నాయి. గజ ఈతగాళ్లు ఆ ప్రాంతాన్ని జల్లెడపడుతున్నారు. భారీ అలలు ఎగిసిపడతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకాలు ఎదురవుతాయన్న అనుమానాలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# గట్టెక్కిన ట్రంప్

## 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'కు అమెరికా కాంగ్రెస్ ఆమోదం



**వాషింగ్టన్:** సొంత పార్టీ సభ్యుల నుంచి కూడా విమర్శలు ఎదుర్కొన్న 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'కు అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బిల్లుగా అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టెక్కారు. పన్ను తగ్గింపులు, రక్షణ, సరిహద్దు భద్రతపై భారీ నిధులు కేటాయించే ఈ బిల్లు అమెరికా రాజకీయాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. కాగా ఈ పరిణామాన్ని ట్రంప్ సాధించిన అతిపెద్ద విజయంగా రిపబ్లికన్ పార్టీ నాయకులు, ప్రత్యేకించి ట్రంప్ మద్దతుదారులు పేర్కొంటున్నారు. ఈ బిల్లులో 'మెడికెయిడ్' ఖర్చుల్లో కోతలు, వలస నియంత్రణ, గ్రీన్ ఎనర్జీ పథకాల్లో మార్పులు వంటి పలు కీలక అంశాలు ఉన్నాయి. పలు ప్రభుత్వ విభాగాలు, ప్రత్యేకించి వైద్య రంగంలో కొన్ని శాఖలు మూతపడే ప్రమాదం ఉందని, ప్రజలను కొల్లగొట్టి, కొంత మంది కోటీశ్వరులకు మేలు చేయడమే బిల్లు లక్ష్యమని పేర్కొంటూ, రిపబ్లికన్లు ఈ బిల్లును వ్యతిరేకించారు. అమెరికన్ పార్లమెంటు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా మారథాన్ ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. బిల్లును వ్యతిరేకిస్తున్న కొంత మంది సొంత పార్టీ సభ్యులకు నచ్చచెప్పి, వారితో అనుకూలంగా ఓటు వేయించేందుకు ట్రంప్ మద్దతుదారులు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. చివరికి బిల్లు హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్‌లో 218–214 ఓట్ల తేడాతోఏ ఆమోదం పొందింది. అనంతరం బిల్లును ట్రంప్ సంతకం కోసం పంపారు. అంతకు ముందు సెనెట్‌లో జులై రెండున ఈ బిల్లు 51–50 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది. వాస్తవానికి సెనెట్‌లో బిల్లుకు అనుకూలంగా 50, వ్యతిరేకంగా కూడా 50 ఓట్లు పడడంతో, టై ఏర్పడింది. దీనితో ఉపాధ్యక్షుడి హోదాలో జేమ్స్ డేవిడ్ వాన్స్ కాస్టింగ్ ఓటు వేశారు. దీనితో అక్కడ ఆమోదం లభించింది. కాంగ్రెస్‌లోనూ బిల్లుకు ఆమోదముద్ర పడడంపై ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యులు, నాయకులతోపాటు, దేశ ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లుపై ట్రంప్ జులై ఐదో తేదీ సాయంత్రం సంతకం చేస్తారని, అదొక వేడుకగా సాగుతుందని రిపబ్లికన్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**పేదలపై దాడి: డెమోక్రాట్ల విమర్శ**

ట్రంప్ తీసుకొచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను డెమోక్రాట్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనిని పేదలపై దాడిగా పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌లో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ధనికులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చిన బిల్లు వల్ల ఎవరికి ప్రయోజనమని వారు ప్రశ్నిస్తున్నారు. బిల్లులోని వివాదాస్పద అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి డెమోక్రాటిక్ పార్టీ సన్నాహాలు చేస్తున్నది.

### బిల్లులో ఏముంది?

ట్రంప్ ఎంతో గొప్పగా అభివర్ణిస్తుండగా, ప్రత్యర్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'లో కీలక అంశాలు ఏవి అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. నిజానికి ఈ బిల్లు మూలాలు ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత, 2017లోఅమలు చేసిన పన్ను తగ్గింపు నిర్ణయాలతో ముడిపడి ఉన్నాయి. అప్పటి తీర్మానాలను ఇప్పుడు, రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత శాశ్వతంగా అమలు చేయడానికే బిల్లును తీసుకొచ్చారు. సర్వశక్తులు ఒడ్డి, ఆమోదింప చేసుకున్నారు. దీని ద్వారా, ఓవర్‌టైం వేతనాలు, టిప్ ద్వారా ఆదాయం పొందే కార్మికులకు ప్రత్యేక పన్ను మినహాయింపులు లభిస్తాయిర. అదే విధంగా అమెరికా రాజ్య, స్థానిక పన్ను (ఎఎస్ఎఎల్‌టి/ సాల్ట్) మినహాయింపు పరిమితి 10,000 డాలర్ల నుంచి 40,000 డాలర్లకు పెరుగుతుంది. ఈ కొత్త మినహాయింపుల కారణంగా, తదుపరి 10 సంవత్సరాల్లో ఫెడరల్ బడ్జెట్ లోటు 3.4 ట్రిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంటున్నారు. ఫుడ్ స్టాంప్ పథకంలో కూడా మార్పులు చేశారు. కొత్త బిల్లు ద్వారా రాష్ట్రాలు కూడా ఈ పథకానికి సంబంధించిన వ్యయాన్ని పంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పని చేయగల వయసును 54 నుంచి 64 సంవత్సరాలకు, అంటే పది సంవత్సరాలు పెంచారు. అదే సమయంలో, తక్కువ ఆదాయ వర్గాల కోసం ఉన్న మెడికెయిడ్ ఆరోగ్య పథకానికి పెద్ద దెబ్బ తగిలింది. ఈ బీమాకు ట్రంప్ భారీ కోతలు విధించారు. నూతనంగా విధించిన పని నిబంధనలతో, సుమారు 1.2 కోట్ల మంది తమ వైద్య బీమా కోల్పోయే ప్రమాదంలో చిక్కుకున్నారు. కొన్ని రాష్ట్రాల్లో అక్రమ వలసదారులకు మెడికెయిడ్ సేవలు నిలిచిపోయాయి. అలాగే, లింగ మార్పు చికిత్సలకు నిధులు పూర్తిగా స్తంభిస్తాయి. అదే సమయంలో, పట్టణ ప్రాంతాల్లోని ఆసుపత్రుల పరిరక్షణకు 50 బిలియన్ డాలర్ల కేటాయింపు ఉంటుంది. వలసల నియంత్రణపై ఈ బిల్లులో దృష్టి కేంద్రీకరించినట్టు అందులోని అంశాలు స్పష్టం చేస్తున్నాయి. మెక్సికో, కెనడా వంటి దేశాలతో ఉన్న సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి ఏకంగా 46 బిలియన్ డాలర్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనం. వలసదారులను నిర్బంధించి, తరలించడానికి ఏర్పాటైన కేంద్రాలను విస్తరించడమేగాక, సంఖ్యను కూడా పెంచడానికి 45 బిలియన్ డాలర్లు, సిబ్బంది నియామకం, శిక్షణకు మరో 30 బిలియన్ డాలర్లు కేటాయించారు. ఇంత భారీ బడ్జెట్‌ను బట్టి, అక్రమ వలసదారులను దేశం నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ పంపించివేయాలన్న ట్రంప్ పట్టుదలతో ఉన్నట్టు స్పష్టమవుతున్నది. అమెలరికాలో ఆశ్రయం కోరే వ్యక్తుల సాయం కోసం ముందుగా ప్రతిపాదించిన 1,000 డాలర్ల ఫీజును 100 డాలర్లకు తగ్గించారు. దీనితో ఎక్కువ మంది అభ్యర్థనలు చేసుకునే అవకాశం ఉంటుంది. జో బైడెన్ ప్రభుత్వ హయంలో ప్రవేశపెట్టిన గ్రీన్ ఎనర్జీ పథకాలు కూడా కొత్త బిల్లుపై ట్రంప్ సంతకం చేసిన వెంటనే నిలిచిపోతాయి.

# గాజాపై ఆగని దాడులు

## ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 15 మంది.. సైన్యం కాల్పుల్లో 20 మంది మృతి!



**డెర్ అల్ బలా (గాజా స్ట్రిప్):** ఒకవైపు శాంతి చర్చలు, కాల్పుల విరమణకు ఆమోదం తెలుపుతున్నట్టు నటిస్తున్న ఇజ్రాయెల్, మరోవైపు గాజా స్ట్రిప్‌పై దాడులు కొనసాగిస్తున్నది. శుక్రవారం తెల్లవారు జామున ఇజ్రాయెలీ వైమానిక దళం జరిపిన దాడుల్లో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాల్లో ఇజ్రాయెలీ సైనికులు జరిపిన కాల్పుల్లో కనీసం 20 మంది మృతి చెందారు. 60 రోజుల కాల్పుల విరమణకు హమాస్, ఇజ్రాయెల్ అంగీకరించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ట్రంప్ ప్రకటన వెలువడిన తర్వాత కూడా ఇజ్రాయెల్ దాడులు ఆపలేదు. హమాస్ ఉగ్రవాద స్థావరాలుగా అనుమానిస్తున్న ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామని వాదిస్తున్న ఇజ్రాయెల్, ఆహారం, మందులు వంటి కనీస అవసరాల కోసం ఎదురుచూస్తున్న కేంద్రాల వద్ద సైనికులు కాల్పులకు తెగబడడాన్ని ఏ విధంగా సమర్థించుకుంటుంది అనేది ప్రశ్న. ఇలావుంటే, గాజాలోకి మానవతా సాయాన్ని కూడా అడ్డుకుంటూ, ఇజ్రాయెల్ మారహోమాన్ని కొనసాగిస్తున్నదని ప్రపంచ వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సైతం ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. తాజా నివేదికలో, మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్న వారిపైనా ఇజ్రాయెలీ సైనికులు జరిపిన దాడుల్లో 613 మంది మృతి చెందారని పేర్కొంది. అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన నిరాటంకంగా కొనసాగుతున్నదనడానికి ఇది నిదర్శనం.

**ఈజిప్టు, కతార్ మధ్యవర్తిత్వం**

హమాస్–ఇజ్రాయెల్ మధ్య రెండు నెలల కాల్పుల ఒప్పందం కోసం ఈజిప్టు, కతార్ మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. ఈ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, హమాస్ నుంచి కూడా సానుకూల స్పందన వచ్చిందని ట్రంప్ ఇప్పటికే ప్రకటించగా, ఇంత వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు. ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతునే ఉండగా, ఈ ఏడాది మార్చిలో, ఆ తర్వాత మేలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాలు ఎక్కువకాలం సాగలేదు. దీనితో ఇజ్రాయెల్ ఎంత వరకూ మాటపై నిలబడుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ మీడియా వార్తల ప్రకారం, కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ స్వాగతించింది. తమ వద్ద బందీలుగా ఉన్న వారిలో 10 మందిని తొలివిడతలో విడుదల చేస్తామని, అదే సమయంలో మృతి చెందిన 18 మంది భౌతికకాయాలను కూడా అప్పగిస్తామని హమాస్ తెలిపింది. కాల్పుల విరమణ దీర్ఘకాలం కొనసాగితే, తమ వద్ద ఉన్న మిగతా 22 మంది బందీలను కూడా విడుదల చేయడానికి హమాస్ సిద్ధంగా ఉంది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనను మినహాయిస్తే, ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు సానుకూలంగా ఉందని అనుకోవడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. గాజా స్ట్రిప్‌లో కొనసాగుతున్న దాడులే ఇందుకు నిదర్శనం.

# టిబెట్‌పై ఆచితూచి వ్యవహరించండి

## భారత్‌కు చైనా హితవు

**బీజింగ్:** టిబెట్‌కు సంబంధించిన అంశాలపై ఆచితూచి వ్యవహరించాలని భారత్‌కు చైనా హితవు పలికింది. టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపిక ఆయన ఇష్టానుసారం జరగాలని భారత మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై చైనా శుక్రవారం అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్–చైనా దేశాల మధ్య ఇటీవల కాలంలో మెరుగుపడుతున్న ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావాన్ని నివారించడానికి టిబెట్ సంబంధిత సమస్యలపై జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది.14వ దలైలామా అనుసరిస్తున్న చైనా వ్యతిరేక వేర్పాటువాద స్వభావం గురించి భారత్‌కు స్పష్టత ఉండాలని, జిజాంగ్ (చైనా భాషలో టిబెట్) సంబంధిత సమస్యలపై తమ నిబద్ధతను గౌరవించాలి, అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ శుక్రవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. రిజిజు వ్యాఖ్యలపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, జిజాంగ్ గురించి లేదా దలైలామా గురించి మాట్లాడేటప్పుడు లేదా ఏవైనా నిర్ణయాలు తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. రిజిజు తన వ్యాఖ్యలను సొంతానికే పరిమితం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. తన వారసుడిని దలైలామా స్వయంగా ఎంపిక చేసుకుంటాడని లేదా ఇందుకు కోసం 2015లో ఏర్పడిన గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్ ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటుందని, ఇతరులు ఎవరికీ ఇందులో ప్రమేయం ఉండదని రిజిజు చేసిన వ్యాఖ్యలపై మావో అసంతృప్తి వ్యక్తం చేశారు. దలైలామా వారసుడి ఎంపిక చైనా ఆమోదంతో మాత్రమే జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. జిజాంగ్ తమ దేశ అంతర్భాగమని, తమ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మంచిదికాదని భారత్‌కు స్పష్టం చేశారు. నోబెల్ శాంతి గ్రహీత దలైలామా వారసత్వ ప్రణాళికను చైనా ఇది వరకే తిరస్కరించింది. వారసుడి ఎంపిక చైనా ఆమోదంతోనే జరుగుతుందని వార్తలు వచ్చిన నేపథ్యంలో రిజిజు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇలావుంటే, ఈనెల 6న ధర్మశాలలో జరిగే దలైలామా 90వ పుట్టినరోజు వేడుకల్లో బౌద్ధ మతస్థుడైన రిజిజు, కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పుట్టినరోజు కార్యక్రమం మతపరమైన కార్యక్రమం అని, దీనికి రాజకీయాలతో సంబంధం లేదని మంత్రి రిజిజు వ్యాఖ్యానించారు.



# నక్సలైట్లపై మారణకాండ

(మొదటి పేజీ తరువాయి)

కడవెండిలో జరిగింది. ఈ సభకు జీడి ఎల్లయ్య అధ్యక్షత వహించగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆనాడు విస్నూరు రామచంద్రారెడ్డి ఆగడాలు, దౌర్జన్యాలకు అంతులేదని, భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వీరమరణం పొందిన మొదటి వ్యక్తి దొడ్డి కొమురయ్య అన్నారు. నాలుగున్నర వేల మంది చంపబడగా పోరాటాన్ని నిర్మూలించలేక పోయారని, చివరకు శాంతి చర్చల ద్వారానే విముక్తి పలకడం జరిగిందన్నారు. నేడు అమిత్‌షా లాంటి వారు కమ్యూనిజాన్ని నిర్మూలిస్తామని కలలు కంటున్నారు. దొడ్డి కొమురయ్యను చంపితే ఉద్యమం మరింత ఉవ్వెత్తున సాగిందే తప్ప అంతం కాలేదన్నారు. దేశంలో తుపాకులు పట్టి పోరాడుతున్న వారు అనేక చోట్ల ఉన్నారని, మణిపూర్‌లో రెండు వర్గాలు తుపాకులు పట్టి కాల్చి చంపుకుంటున్నాయన్నారు. నాగాలాండ్‌లోనూ తుపాకులు పట్టి పోరాటం చేస్తున్నారని, దేశంలోనూ అక్కడక్కడ టెర్రరిస్టులు తుఫాకులు పట్టి ప్రజల ప్రాణాలు తీసుకున్నారు. వారిని తుదముట్టించలేని బిజెపి సర్కార్ నక్సలైట్లను తుదముట్టిస్తామని చెప్పడంలో అర్థం లేదన్నారు. దీన్ని బట్టి బిజెపి, అమీత్‌షా టెర్రరిస్టులకు అనుకూలంగా ఉన్నారనే చెప్పాలన్నారు. నక్జలైట్లు అటవి సంపద కాపాడడం కోసం పనిచేస్తున్నారని, అక్కడ ఉన్నది అంతా గిరిజన బిడ్డలే అన్నారు. నక్సలైట్లను చంపి అటవి సంపదను దోచుకొని కార్పోరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు.

**కగార్ పేరుతో ఆదివాసీలను చంపుతున్న మోదీ సర్కార్ : విమలక్క**

ఆపరేషన్ కగార్ పేరుతో మోదీ సర్కార్ ఆదివాసీలను చంపుతుందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నిర్వాహకురాలు విమలక్క మండిపడ్డారు. అటవీ సంపదను దోచుకొని కార్పోరేట్లకు కట్టబెటేందుకే బిజెపి ఆపరేషన్ కగార్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. మావోయిస్టులను తుదముట్టిస్తామని అమిత్‌షా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వారిని తుదముట్టిస్తామనడం కల అన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలన్నారు.

**దొడ్డి కొమురయ్య స్ఫూర్తిలో ఉద్యమాలు : తమ్మెర విశ్వేశ్వరరావు**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తిగా ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ కంట్రోల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. దేశంలో కమ్యూనిస్టులకు ఎంతో చరిత్ర ఉందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించింది కమ్యూనిస్టులే అన్నారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తిగా ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, మోటే శ్రీశైలం, బిల్లా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# మరణ శాసనం (మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ల సాధనకు మద్దతు ప్రకటించింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా సమ్మె జయప్రదానికి పిలుపునిచ్చింది. జాతీయ సమితి సమావేశాలు సిపిఐ కార్యదర్శి రామకృష్ణ పాండా అధ్యక్షతన జరిగాయి. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల పరిశీలన 'ఎస్ఐఆర్' ప్రక్రియ ఉపసంహరణకు డిమాండ్ చేయాలని జాతీయ సమితి ఏకగ్రీవంగా తీర్మానించింది. ఒకటి లేక రెండు నెలల్లో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించాలన్న ఎన్నికల సంఘం ప్రతిపాదనకు సరైన ప్రణాళిక లేదని, ఆచరణలో అర్హులైన ఓటర్లు అనేక మందికి అన్యాయం జరుగుతుందని, అందుకోసమే 2024లో లోక్‌సభ ఎన్నికల కోసం రూపొందించిన ఓటర్ల జాబితాల ఆధారంగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, కొత్త ఓటర్ల పేర్లను మాత్రమే చేర్చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అదే విధంగా వర్షాల కారణంగా నష్టపోయిన హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రజలకు సముచిత పరిహారం డిమాండ్ చేయాలని సిపిఐ జాతీయ సమితి తీర్మానించింది. భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో ఆస్తి నష్టం, పంట నష్టం సంభవించినట్లు పేర్కొంది. కాగా, సమితి సమావేశాల్లో రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రవేశపెట్టారు. దీనిని సెప్టెంబరు 21 నుంచి 25వ తేదీ వరకు చండీగఢ్‌లో నిర్వహించబోయే జాతీయ మహాసభల్లో ప్రవేశపెడతారు. ఈ ముసాయిదా తీర్మానంపై నాయకులు చర్చించారు. అన్ని అంశాలను నిశితంగా పరిశీలించారు. సవరణలను సూచించారు. వాటిని జాతీయ కార్యదర్శి వర్గం పరిశీలించిన తర్వాత నిర్ణయిస్తుందని, ఆపై తుది ముసాయిదా రూపొందించాలని సమావేశం నిర్ణయించింది.

# వచ్చే ఎన్నికల్లో వంద స్థానాలు గెలుస్తాం

## రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
## 15 మంది ఎంపిలను గెలిపించి ఢిల్లీకి పంపుతాం
## కాంగ్రెస్ అధిష్టానానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ
## వందలో ఒక్కస్థానం తగ్గినా ప్రశ్నించాలని వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న రోజుల్లో శాసనసభ స్థానాలు 119 నుంచి 150కి పెరగబోతున్నాయని, లోక్‌సభ సీట్లు కూడా పెరగబోతున్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో వంద మంది ఎంఎల్‌ఎలను గెలిపించి, తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, అలాగే మరో 15 మంది ఎంపిలను గెలిపించి, ఢిల్లీకి పంపిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్టానానికి హామీనిచ్చారు. వంద స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా తగ్గనివ్వబోనని, ఒక్కటి తగ్గినా తనను ప్రశ్నించాలన్నారు. ఢిల్లీలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సిఎం కోరారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభ'లో ఆయన ప్రసంగించారు. దెబ్బ తిన్న ఆర్థిక వ్యవస్థ, అడుగంటిపోయిన రాజ్యాంగ బద్ద సంస్థల ప్రతిష్ట, వీటన్నింటినీ పునరుద్ధరించుకుంటూ, ఒక్కోక్క కష్టాన్ని అధిగమిస్తూ, సమస్యను పరిష్కరిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు మంత్రివర్గం ముందుకు తీసుకెళ్తుందని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లోనే ఉండాలని, ప్రజాసేవ చేసిన వారికి టికెట్లు ఇచ్చి, వారిని ఎంఎల్‌ఎలును, మంత్రులను చేసే బాధ్యతను మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ తీసుకుంటారని భరోసానిచ్చారు. స్థానికంగా ఎంఎల్‌ఎలు ఉన్నారని, తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటనే ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ప్రస్తుతం 60 మంది ఎంఎల్‌ఎలు ఉంటే, రానున్న ఎన్నికల్లో మరో 80 మందికి కొత్తగా టికెట్లు ఇచ్చే అవకాశాలు ఉంటాయని కాంగ్రెస్ నాయకులకు సిఎం హామీ ఇచ్చారు.



**సోషల్ మీడియాపై యుద్ధం ప్రకటించాలి...** కిరాయి మనుషులతో దుబాయ్‌లో ఆఫీసును ఏర్పాటు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వంపైన విష ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలే తమకు (ప్రభుత్వానికి) బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, సోషల్ మీడియాపై యుద్ధం ప్రకటించాలని, ఈ యుద్ధంలో కల్వకుంట్ల గడి తునాతునకలు కావాలని సిఎం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలను సర్పంచులు, వార్డులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, ఛైర్మన్లు, మేయర్లుగా గెలిపించే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసానిచ్చారు.

**రైతు రాజ్యంపై చర్చకు సిద్ధమా?...** రైతు రాజ్యం ఎవరు తెచ్చారు?, రైతులకు అండగా ఎవరు నిలిచారో పార్లమెంట్, అసెంబ్లీలో చర్చించేందుకు ఢిల్లీలో మోదీ, గల్లీలో కేడీ ఎవరితోనైనా తాము చర్చకు సిద్ధమని, ఈ చర్చకు కెసిఆర్, కెటిఆర్, కిషన్‌రెడ్డి ఎవరొస్తారో రావాలని, తాను కాంగ్రెస్ కార్యకర్తలను తీసుకొస్తానని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నాటి ఇందిరమ్మ పథకాలే పేదల జీవితాల్లో వెలుగు నింపిందని, అందుకే సంక్షేమ పథకాలకు ఇందిరమ్మ పేరును పెడుతున్నామని వివరించారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఉదయమే రూ.5లకే టిఫిన్ పెట్టేందుకు క్యాంటీన్లను పెట్టి, వాటికి ఇందిరమ్మ పేరు పెడుతామంటే, తలమాసిన దద్దమ్మలు, సోయిలేని వాళ్లు ఇందిరమ్మ పేరు పెడుతారా? అని ధర్నాలు చేశారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

**60 వేల ఉద్యోగ నియామకాలపై చర్చకు సిద్ధమా? ...** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే నియమించిన 60వేల మంది ఉద్యోగులను ఎల్‌బి స్టేడియంలోకి తీసుకొస్తానని, ఇందులో ఏ ఒక్కరు తగ్గినా తాను కాళ్లముందు ఉండి క్షమాపణ చెబుతానని, దీనిపైన చర్చకు సిద్ధమా అని నరేంద్రమోదీ, కెసిఆర్,కెటిఆర్, కిషన్ రెడ్డిలకు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి గౌరవాన్ని, గుర్తింపును తీసుకొచ్చామన్నారు.

ఆత్మబలిదానాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే తెలంగాణ యువత వైద్యులు, ఇంజినీర్లు, ఐఎఎవ,ఐపిఎస్‌లు అయి, రాజ్యాన్ని ఏలాలనా?, లేదంటే గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలనా?,ఆలోచన చేయాలని సిఎం సూచించారు. గొల్లోలు గొర్రెలు పెంచుకోవాలని, మాదిగలు చెప్పులు కుట్టుకోవాలని, ఎరుకలోల్లు పందులు పెంచుకోవాలని, ముదిరాజులు చేపలు పట్టుకోవాలని, చంద్రశేఖర్‌రావు ఆయన కుమారుడు మాత్రం రాజ్యాలు ఏలుతరంటా?, ఇదేనా న్యాయం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏంచేశారు?

(మొదటి పేజీ తరువాయి)

గత పదేళ్లలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏమి చేసిందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభ' శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగింది. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మల్లికార్జున ఖర్గే, ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ప్రసంగించారు. సభలో మల్లిఖార్జున్ ఖర్గే ప్రసంగిస్తూ దేశంలో చట్టాలను బిజెపి ప్రభుత్వం ఖూనీ చేసిందని, మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే మొత్తం దేశ పరిస్థితే మారిపోతుందన్నారు. రైతులు, యువత ఐక్యంగా ఉంటే, మోదీ ఢిల్లీ నుంచి పరుగులు తీస్తారని, వదిలిపెట్టి వెళతారని, ఢిల్లీలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. దేశాన్ని రక్షించేందుకు అందరూ ఒకటి కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. 'రూ.15 లక్షలు ఇస్తామని, ప్రతి ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, హామీనిచ్చిన మోదీ, వీటిని అమలు చేశారా? అని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర ఇచ్చారా? దీనిని బట్టి మోదీ నిజం చెబుతారా? అబద్దాలు చెబుతారా?' అని ప్రశ్నించారు. ప్రజలను ఇంకేంత కాలం బిజెపి మోసం చేస్తుందని ఖర్గే మండిపడ్డారు. రానున్నరోజుల్లో కాంగ్రెస్ మరింత అప్రమత్తంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా?...** ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని, కానీ మణిపుర్ వెళ్లడానికి మాత్రం మనసు రాలేదని, మణిపూర్ రాష్ట్రం అంశంపై ఒక్కసారి కూడా ఆయన పెదవి విప్పలేదని ఖర్గే విమర్శించారు. రాహుల్‌గాంధీ, తాను మణిపుర్ వెళ్లామని, మోదీ మాత్రం వెళ్లలేదన్నారు. 'మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపుర్‌వాసులు భారతీయులు కాదా? అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు' అని ఖర్గే విమర్శించారు

**దేశం కోసం పోరాడేందుకైనా ప్రాణాలు అరిపించేం–దుకైనా సిద్ధమే...** దేశం కోసం పోరాడేందుకు ప్రాణాలు అరిపించేందుకైనా కాంగ్రెస్ శ్రేణులు సిద్దంగా ఉన్నాయని, దేశం కోసం ఇందిరా, రాజీవ్, నెహ్రూ ప్రాణాలను అర్పించారని ఖర్గే అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలో ఎవరైనా దేశం కోసం ప్రాణాలు అరిపించారా? అని ఖర్గే నిలదీశారు. ఇందిరా గాంధీ భయపడలేదని, భయపెట్టేందుకు ప్రయత్నించినా తల వంచలేదని, ఎవరు వచ్చినా రాకపోయినా బంగ్లాదేశ్‌ను విడదీస్తానని చెప్పి చేసి చూపారని, మోదీ ఏం చేశారని, కేవలం ప్రసంగాలకే పరిమితం అయ్యారని విమర్శించారు. భారత విదేశీ విధానం బాగాలేదని, తద్వారా అన్ని దేశాల నుంచి శత్రుత్వం ఏర్పడిందని, నేపాల్ దూరం అవుతుందని అన్నారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చినప్పటికీ మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారని, కానీ ఆ విషయంపై ప్రధాని నోరు ఎందుకు విప్పరని నిలదీశారు.

**రిజర్వేషన్లను సాధించే వరకు పోరాడుతాం...**వెనుకబడిన తరగతుల (బిసి) కు రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనికి 42 శాతం ఆమోదం లభిస్తుందని, రిజర్వేషన్లను సాధించే వరకు పోరాడుతామని ఖర్గే చెప్పారు. ప్రధాని మోదీ తన మన్ కి బాత్ చెబితే, తాము దిల్‌కి బాత్, కామ్‌కి బాత్ చెబుతామని, రానున్న రోజులలో కూడా చేసి చూపిస్తామన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులను కెసిఆర్ మోసం చేశారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కెసిఆర్ మోసం చేశారని, గత ప్రభుత్వ హాయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులు, యువత, మహిళలకు విముక్తి లభించిందని ఖర్గే అన్నారు. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమేనని, బిసిల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం కార్యకర్తలేనని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇలా అందరూ కలిసికట్టుగా బిఆర్ఎస్ ను ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గురించి ఆలోచిస్తుందని, వారి కోసం పనిచేస్తుందని, కొన్ని రోజుల్లోనే కార్మికులకు ఏదో ఒకటి చేస్తుందన్నారు.

**రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి కుట్రలు : డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**

రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా కుట్రలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుతం ఒక సైదాంతిక పోరాటం జరుగుతుందని, రాజ్యాంగాన్ని రక్షించాలని కాంగ్రెస్, ఇండియా కూటమి ఒక పక్కన, రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఎన్‌డిఎ కూటమి మరో పక్కన పోరాటం చేస్తున్నాయన్నారు. రాజ్యాంగం ఒక పుస్తకం కాదని, అది ఒక అద్భుత గ్రంథమని, రాజ్యాంగాన్ని నిలబెట్టుకుంటేనే ప్రజలందరికీ భవిష్యత్తు ఉంటుందన్నారు. సామాజిక న్యాయ సూత్రం ఎజెండాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన కొనసాగుతున్నదని, జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై బిఆర్ఎస్, బిజెపి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడప గడపకు తీసుకువెళ్లాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగమే లేకపోతే ఈ దేశంలో పేదలు ,సామాన్యులు, గిరిజనులు, దళితులకు, బలహీన వర్గాలకు ఎటువంటి హక్కులు ఉండేవి కావు హక్కులు కేవలం రాజులు, రాజ్యాధికారం అనుభవించే కొద్ది మంది పెద్దలకు మాత్రమే దక్కేవి అన్నారు. అటువంటి పరిస్థితుల్లో దేశంలోని ప్రతి పౌరునికి సమాన హక్కులు, గౌరవాన్ని కల్పిస్తూ ఈ దేశ సంపద, అవకాశాలు దేశంలోని ప్రజలందరికీ సమానంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ, బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన అద్భుత గ్రంథం రాజ్యాంగం అన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కర్ణాటకలోని బీదర్‌లో ఒక దళిత కుటుంబంలో జన్మించిన ఖర్గే బాల్యంలోనే మత కలహాల్లో తల్లిని కోల్పోయారని, ఆ ఘటన ఆయనను జీవితాంతం సెక్యులరిజం, సామాజిక న్యాయం, సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా మలిచిందన్నారు. సభలో తొలుత ఇటీవల సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కొల్పోయిన వారికి సభ సంతాపాన్ని తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై టిపిసిసి సీరియస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో సంచలనం సృష్టిస్తున్నాయి. బనకచర్ల ఆపడానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలు రాస్తే సరిపోదని.. చంద్రబాబు కోవర్టులకు కాంట్రాక్టులు, కరెంటు కట్ చేయాలని అప్పుడే ఆంధ్రా పాలకులు తమ వద్దకు వస్తారని కామెంట్ చేశారు. తెలంగాణలో చంద్రబాబుకు కోవర్టులు ఉన్నారని.. వారు కట్టే బనకచర్ల ప్రాజెక్టును ఆపాలంటే, కోవర్టులకు నీటి కనెక్షన్లు, కరెంట్ కనెక్షన్లు కట్ చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే జడ్చర్ల అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మరోసారి సీరియస్ అయ్యారు. వెంటనే వ్యాఖ్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించారు. అయితే, సోమవారం జరిగే క్రమశిక్షణ కమిటీ మీటింగ్ తర్వాత అనిరుధ్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

### సిగాచి రసాయన పరిశ్రమ పేలుడుపై
# న్యాయవిచారణ జరిపించాలి

ఘటన పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచన
చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన సిపిఐ ప్రతినిధి బృందం




**ప్రజాపక్షం/హైదరాబాద్/సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై న్యాయ విచారణ చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద పవన్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, రాష్ట్ర సమితి సభ్యులు ప్రకాష్ రావుతో కలిసి సాంబశివరావు గురువారం పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న పలువురిని సిపిఐ ప్రతినిధుల బృందం పరామర్శించి ధైర్యం చెప్పారు. అంతకు ముందు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రమాదంలో 39 మంది చనిపోవడం, మరో 35 మంది తీవ్రంగా గాయపడడం చాలా బాధాకరమన్నారు. దేశ చరిత్రలోనే ఒక పరిశ్రమంలో ఇంత పెద్ద ప్రమాదం జరిగిన దాఖాలు లేవన్నారు. తాము ఢిల్లీలో ఉన్న కారణంగా ప్రమాదంజరిగిన వెంటనే సంఘటన స్థలానికి రాలేకపోయామన్నారు.

టెక్నాలజీ లేనప్పుడు ఒకప్పుడు సింగరేణిలో భూగర్భంలో ఇలాంటి ప్రమాదాలు జరిగేవని, ఇప్పుడు అక్కడ జరగడంలేదని, అంతకంటే పెద్ద ప్రమాదం ఇక్కడ జరగడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. సేఫ్టీ తనిఖీ, పొల్యూషన్ విభాగం, ప్రతి నిమిషం పరిశీలించే మానిటరింగ్ సిస్టం ఉంటున్నా ఈ ప్రమాదం ఎలా జరిగిందో విచారణ చేయాలన్నారు. ఈ ఘటనపై రెండు కమిటీలు వేసినా కానీ న్యాయ విచారణ చేస్తేనే అన్ని అంశాలు బయటికి వస్తాయని కూనంనేని తెలిపారు. తద్వారా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవచ్చని ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ దాని చుట్టుపక్కల ప్రాంతాలు ఫార్మా కంపెనీలతో ఫార్మా హబ్ గా ఉందని, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యాజమాన్యం సరైన విధానాలు అనుసరిస్తుందా, కాలం చెల్లిన మిషన్‌ను ఉపయోగిస్తుందా, ఇప్పుడు డయ్యర్ బ్లాస్టర్ కారణం మానవ తప్పిదమా, యంత్రం తప్పిదమా అనేది విచారణ చేపట్టడం ద్వారానే తెలుస్తున్నదనీ వారన్నారు. ఈ మూడు నెలలకు ఒకసారి సేఫ్టీ తనిఖీలు ఉంటాయని, దానిపై కౌంటర్ చెక్ ఉంటాయని అవి జరిగితే ఇలాంటి ప్రమాదాలు ముందుగానే పసిగట్టవచ్చని తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ. 550 మాత్రమే ఇస్తూ సంవత్సరానికి రూ. 15000 రూపాయల వరకే జీతాలు ఇస్తే వారు ఎలా జీవిస్తారని వారన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కలిసి రూ.కోటి రూపాయలు సహాయం ప్రకటించారని, కానీ భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే న్యాయ విచారణ ద్వారానే సాధ్యమవుతుందని వారన్నారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాల్సిన సేఫ్టీ అధికారులు చేయకపోవడం, అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న కారణంగానే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయని నిజాలు నిగ్గు తెల్చేందుకు ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని సత్యం కోరారు. ఈ ప్రమాదంలో గల్లంతైన వారి వివరాలతోపాటు ప్రమాదం తీవ్రత, భద్రతలోపాలపై హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్‌ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



### తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు
# దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు



**ప్రజాపక్షం/హైదరాబాద్/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా అసెంబ్లీలో పలువురు నివాళులు అర్పించారు. దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుదిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వినోద్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, శాసనసభ కార్యదర్శి వి.నరసింహచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సిపిఐ నాయకుల ఘన నివాళి**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్యకు సిపిఐ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. దొడ్డి కొమురయ్య 75వ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో గురువారం ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, ఈటి నరసింహ, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవిందు, బోయ శ్రీరాములు, అంజయ్య, నరసింహ తదితరులు ఉన్నారు.

**దొడ్డి కొమరయ్య ఆశయాలను నెరవేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత : సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దేశ్‌ముఖ్‌లను ఎదిరించి పోరాడి అమరుడైన దొడ్డి కొమరయ్య ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌లు కలిసి దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ నిజాం నవాబుల పరిపాలనలో వెట్టిచాకిరీ, బానిసత్వం కొనసాగుతున్న తరుణంలో గ్రామాల్లో దేశ్‌ముఖ్‌ల ఆగడాలు పెరిగిపోయి ప్రజలను పట్టిపీడిస్తున్న నిజాం నవాబు, రజాకార్లను ఎదిరించడానికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్న తరుణంలో కడివెండి గ్రామంలో విసునూరు దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న క్రమంలో 1946 జులై 4న దొడ్డి కొమరయ్యపై కాల్పులు జరపడంతో నేలకొరిగారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సమ్మయ్య, కిన్నెర మల్లవ్వలతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.





## టిజిటిడిసి ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం : ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గవర్నర్ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ(టిజిటిడిసి)కు చెందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నలుగురు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం పట్ల టిజిటిడిసి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా టూరిజంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.

## ఎఐవైఎఫ్ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఎఐఎవైఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఖండించారు. ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల ముట్టడికి ఎలాంటి పిలుపునివ్వకున్నా అన్ని జిల్లాల్లో పోలీసులు ఎఐవైఎఫ్ నేతల అరెస్టు చేశారని, వారిని బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ధర్మేంద్ర మీడియాతో మాట్లాడుతూ ఇటీవలకాలంలో రాష్ట్ర పోలీసు లు పార్టీ, ప్రజా సంఘాలకు సంబంధం లేకున్నా, ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పిలుపునివ్వకున్నా అక్రమంగా అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమన్నారు. సిపిఐతో పాటు అనుబంధ ప్రజా సంఘాలు సమాజ హితమే లక్ష్యంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, పాలకుల తీరు ను నిరసిస్తూ నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. అయితే నిరసన కార్యక్రమం




చేపట్టినా ముందుగానే బహిరంగంగా ప్రకటిస్తామన్నారు. కానీ ఇవేమీ పట్టకుండా పోలీసు యంత్రాంగం, ఇంటెలిజెన్స్, కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య పోకడలనే అనుసరిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రసాదించిన పోరాట హక్కులను గౌరవించాలని, అరెస్టులతో అణచివేత ధోరణిని కట్టడి చేయవచ్చనే దృక్పథంను మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొన్ని పోలీస్ స్టేషన్లలో అయితే పై నుండి ముందస్తు అరెస్ట్ లిస్ట్ వచ్చిందంటూ,ఒకవేళ లిస్ట్ లో పేరు లేకున్నా తమ ఉన్నతాధికారులకు మేము కస్టడీలోకి తీసుకున్నామని చూపించడానికి ఒక గ్రూప్ ఫోటో చాలు అంటూ, నేతలను అడుగుతున్నారని, ఈ విధానాలన్నీ దుర్మార్గమని వారు ధ్వజమెత్తారు. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసుల అవగాహన లేమి వైఫల్యం కారణంగానే, ఈ పొరపాట్లు జరుగుతున్నాయని అందుకే రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి శిక్షణా తరగతులను ఏర్పాటు చేసి పూర్తి స్థాయి అవగాహనను కల్పించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్, వంశీ పాల్గొన్నారు.

# ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు

పార్టీ నియమ నిబంధనలకు నాయకులు కట్టుబడి ఉండాలి
టిపిసిసి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో 50 ఏళ్ల క్రితం జరిగిన ఎమర్జెన్సీ గురించి మాట్లాడే బిజెపి నేతలు 11 ఏళ్ల బిజెపి పరిపాలనలోని ఎమర్జెన్సీ పరిస్థితుల గురించి ఎందుకు మాట్లాడటంలేదని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన భేష్ అని, పార్టీ కార్యకర్తల పనితీరు బాగుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఇష్టానుసారం మాట్లాడవద్దని హెచ్చరించారు. పార్టీ నియమ నిబంధనలకు నాయకులు కట్టుబడి ఒకేతాటిపై నిలవాలన్నారు. టిపిసిసి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం శుక్రవారం గాంధీభవన్‌లో జరిగింది. సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి. మహేష్ కుమార్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మల్లిఖార్జున్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచేలా పని చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించారు. పార్టీలో కొత్త పాత అనే తేడా లేకుండా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. పార్టీ అంతర్గత విషయాలు బహిరంగంగా మాట్లాడి ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దన్నారు. ఏ సమస్య ఉన్నా పార్టీ అంతర్గత సమావేశాల్లోనే మాట్లాడాలని ఆయన ఆదేశించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలపై గత ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తేయాలని కోరారు. నామినేటెడ్ పదవులను త్వరగా భర్తీ చేయాలన్నారు. పార్టీ నాయకులకు ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని, పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి, సమర్ధులకు పదవులు ఇవ్వాలని ఆయన టిపిసిసికి సూచించారు. మేనిఫెస్టో అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ కృషి అభినందనీయమని, హామీలను అమలుచేసే ఏకైక పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచి పోతుందన్నారు.

**పార్టీలో నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలి : సిఎం రేవంత్‌రెడ్డి**

కాంగ్రెస్ పార్టీలో నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని కష్టపడి రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని, రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలని, గ్రామాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమన్వయంతో పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. పార్టీ పదవులను సాధారణంగా పరిగణించవద్దని, పార్టీ పదవులతోనే నాయకులకు గుర్తింపు, గౌరవం ఉంటుందని, రాజకీయాల్లో నాయకుల ఎదుగుదలకు ఇది ఉపయోగపడుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెరగనున్నాయని, రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయనున్నాయన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కుల గణన చేసేలా చేయడంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో కూడా ప్రభు త్వం చాలా విజయాలు సాధించిందని అన్నారు. తాను టిపిసిసి అధ్యక్షులుగా ఉన్న సమయంలో 45 లక్షల మంది క్రియాశీలక సభ్యత్వం చేసుకున్నామని, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలామందికి ప్రభుత్వంలో పదవులు వరించాయన్నారు. సుదీర్ఘ కాలం ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన అరుదైన ఘనత మల్లికార్జున ఖర్గేదని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ నాయకులు ముందుకు వెళ్లాలన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి కాంగ్రెస్ పార్టీ పనిచేస్తున్నదని, తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పార్టీ మరోసారి 90సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమాగా చెబుతున్నానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమర భేరి సభ మోగిస్తున్నదన్నారు.

# జాతీయ ఉపాధి హామీకి బిజెపి తూట్లు

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం
వ్య.కా.సం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య

**ప్రజాపక్షం/ కొణిజర్ల :** కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. కాంతయ్య ఆరోపించారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కోత విధించడంతో పాటు పని దినాల సంఖ్యను తగ్గించారని ఆయన తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా 26వ మహాసభ శుక్రవారం కొణిజర్లలో అమరజీవులు సిద్ది వెంకటేశ్వర్లు, వెంపటి సూర్యనారాయణనగర్‌లో జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన కాంతయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని తద్వారా వ్యవసాయ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లపరం చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని తద్వారా వ్యవసాయరంగం నుండి గ్రామీణ ప్రజలు వైదొలగక తప్పని స్థితి ఏర్పడుతుందన్నారు. ధరల పెరుగుదల పాలకుల వైఫల్యమేనని కాంతయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు లో తీవ్ర జాప్యం జరుగుతుందని, ఇందిరమ్మ భరోసా పథకాన్ని వ్యవసాయ కార్మికులకు బేషరతుగా అమలు చేయాలని తక్షణం పేదల ఖాతాల్లో రూ.12వేల చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలు పెంచి రోజుకు రూ.600 గిట్టుబాటు అయ్యేవిధంగా సవరించాలని కాంతయ్య డిమాండ్ చేశారు. దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వెనక కమ్యూనిస్టుల పోరాటాలు, త్యాగాలు ఉన్నాయని, పోరాటాలు లేకుండా సమస్యలు పరిష్కారం కావన్నారు.

మహాసభ ప్రారంభ సూచికగా వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని కాంతయ్య ఆవిష్కరించారు. సిద్దినేని కర్ణకుమార్, పగిడిపల్లి ఏసు, వీరబాబు, కంపసాటి వెంకన్న, ఈశ్వరమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, మందడపు రాణి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.19, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి, యూసఫ్‌గూడ, హైదరాబాద్.
NIT No. 06/EE/DIV-19/SLPZ/GHMC/2025-26/83 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 03.07.2025
**పనుల సంఖ్య:** (5)నెం.లు, సివిల్ పనులు. **అంచనా విలువ:** రూ.40.00లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 04.07.2025న సా.04.00గం.ల నుండి 10.07.2025న మ.01.00గం.ల వరకు మాత్రమే, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, జిహెచ్‌ఎంసి. శ్రీ ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 99630-25505. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, (ఎస్‌ఎల్‌పిజెడ్), జిహెచ్‌ఎంసి.**
DIPR R.O. No. : 4591-PP/CL/ADVT/1/2025-26, Date: 04-07-2025

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం.డి1/358/2024 ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 02.07.2025
ఈ దేవస్థానము నందు (1) ది.01.09.2025 నుండి ది.31.08.2026 వరకు అవసరమైన పూలు సరఫరా మరియు (2) ది.01.08.2025 నుండి ది.31.07.2026 వరకు పూజాద్రవ్యములు సరఫరా చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 05.07.2025 ఉదయం గం. 11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 18.07.2025 ఉదయం గం. 11.00 వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 18.07.2025 ఉదయం గం.11.30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 18.07.2025 మధ్యాహ్నం గం. 12.00లకు.
ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
**సం/- ఎల్. రమాదేవి కార్యనిర్వహణాధికారి**
DIPR R.O. No. : 4599-PP/CL/ADVT/1/2025-26, Date: 04-07-2025

**సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ :: ఏటూరునాగారం**
ఐటీడీఏ/గిరిజన ఏజెన్సీ ఎంప్యానెల్మెంట్/2025, తేది :04.07.2025.
పత్రికా ప్రకటన
సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఏటూరునాగారం, ములుగు జిల్లా పరిధిలో పలు అభివృద్ధి పనుల కొరకై వాహనాలు కావలెను. ఇందుకు సంబంధించి ఆసక్తి గల గిరిజన ఏజెన్సీలు ITDA ఏటూరునాగారం వారితో ఎంప్యానెల్మెంట్ చేసుకోవడానికి దరఖాస్తులు ఆహ్వానించనైనది. **దరఖాస్తు ఫారములు ITDA ఏటూరునాగారం నందు తేది:** 05.07.2025, మధ్యాహ్నం 3.00 గంటల నుండి 08.07.2025, సాయంత్రం 5:00 గంటల వరకు లభించును. **పూర్తి చేసిన దరఖాస్తు ఫారములు తేది:** 10.07.2025 సాయంత్రం 5:00 గంటల లోపు ITDA ఏటూరునాగారం నందు సమర్పించవలెను. దీని పైన సమయానుసారం మార్పులు చేయడానికి, షరతులు విధించడానికి మరియు ఎలాంటి ఏటూరునాగారం గారికి పూర్తి కారణాలు లేకుండా తగిన నిర్ణయం తీసుకోవడానికి ప్రాజెక్ట్ ఆఫీసర్, I.T.D.A అధికారాలు ఉండును. **(వివరాల కోసం ఫోన్ నెంబర్ - 8374210939 (పి.శివ ప్రసాద్ DAO)** గారిని సంప్రదించగలరు.
**సం/- ప్రాజెక్ట్ ఆఫీసర్, I.T.D.A ఏటూరునాగారం, ములుగు జిల్లా**
DIPR R.O. No. : 4625-PP/CL/ADVT/1/2025-26, Date: 04-07-2025

**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-11, రాజేంద్రనగర్ సర్కిల్.
NIT No. 17/EE-11ECRZ/GHMC/2025-26, టెండర్ ప్రకటన తేది: 04.07.2025
పని పరిధి: *యాక్రిలిక్ సింథటిక్ & కలర్ లేయర్ కోసం సీల్డ్ కొటేషన్ల కోసం ఆహ్వానం:*
1. **ప్రైమర్ (1 లేయర్):-** రీసర్ఫేసర్ లేయర్స్ మరియు ఉపరితలం మధ్య బంధాన్ని ఏర్పరిచే యాక్రిలిక్ ప్రైమర్ యొక్క ఒక కోట్‌ను అందించడం మరియు వేయడం.
2. **కోర్స్ (1 లేయర్) :-** సింథటిక్ కలర్ లేయర్స్ మరియు ఉపరితలం మధ్య బంధాన్ని ఏర్పరిచేలా ఆమోదించబడిన సిలికాఇసుకతో కలిపిన యాక్రిలిక్ రీసర్ఫేసర్ యొక్క ఒక కోట్‌ను అందించడం మరియు వేయడం.
3. **టెక్చర్ కోర్స్ (3 లేయర్స్) :-** సిలికా ఇసుకతో కూడిన క్లాసిక్‌కు మూడు లేయర్ల రంగును అందించడం, వేయడం, ఇది ఏకరీతి ఉపరితల ఆకృతిని అందిస్తుంది మరియు ట్రాక్షన్ ఆఫ్ ది కోర్టు మరియు రోలర్ వేగాన్ని నిర్ణయిస్తుంది.
4. **ఫినిష్ కోర్స్ (1 లేయర్) :-** ఒక రోలర్ ఎక్స్‌ట్రా ఫైన్ ఫినిష్ కోట్ యొక్క కలర్ క్లాసిక్ అందించడం, వేయడం వలన వాతావరణానికి, అతినీలలోహిత క్షీణతకు హై రెసిస్టెంట్ కలిగిన శక్తివంతమైన మన్నికైన ఫినిష్ (రంగు) సృష్టించబడుతుంది.
5. **లైన్స్ (2 లేయర్) :-** హెవీ బాడీడ్ యాక్రిలిక్ లేటెక్స్ యొక్క రెండు కోట్లు అందించడం, వేయడం. రంగు తెల్లటి చారల పెయింట్ టెక్స్చర్డ్ మరియు అన్ టెక్స్చర్డ్ రెండింటిలోనూ వస్తుంది మరియు అప్లికేషన్ మీద కవర్ చేస్తుంది.
**పన్నులు మినహాయించి కొటేషన్ (రూ. చదరపు అడుగులలో):** సీల్డ్ కొటేషన్లు (చదరపు అడుగులలో), **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *ఇఒఐ రిలీజ్:* 04.07.2025న మ.03.00గం.లకు, *ప్రతిపాదన సమర్పణ ముగింపు తేదీ:* 08.07.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-11, రాజేంద్రనగర్. ఫోన్: 7337557239.
మరిన్ని వివరాలను @ http://www.ghmc.gov.in వద్ద టెండర్ నోటిఫికేషన్లు మరియు ఈ కార్యాలయం యొక్క నోటీసు బోర్డులో చూడవచ్చు.
**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్-11, జిహెచ్‌ఎంసి.**
DIPR R.O. No. : 4627-PP/CL/ADVT/1/2025-26, Date: 04-07-2025

ప్రజాపక్షం
శనివారం, 05 జులై

## ఉపాధికి ఎంఎస్ఎంఇలు కీలకం

గత నెల 27వ తేదీన ప్రపంచం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇలు) దినోత్సవం జరుపుకుంది. ఈ సంవత్సరం వేడుకలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న శ్రామిక శక్తికి ఉపాధి కల్పనకై 2030 నాటికి 60 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సిన బృహత్ కర్తవ్యం ప్రపంచం ముందుంది. ఎంఎస్ఎంఇలు సరైన ప్రోత్సాహకాలు కరవై, ఎన్నో అవరోధాలు ఎదుర్కొంటూనే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.3 బిలియన్ మందికి ఉపాధులు కల్పిస్తున్నాయి. కోవిడ్ కాలం ఎంఎస్ఎంఇలను తీవ్రంగా దెబ్బతీసింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. ప్రభుత్వ ఉద్దీపన పథకాల కింద అందుతున్న రుణాలు సహాయకారి అవుతున్నాయి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెంది భారీ పరిశ్రమల్లో ఉద్యోగాలు ఊడుతుండగా, పునాదిస్థాయిలో ఉపాధి కల్పనకు తోడ్పడుతున్నవి ఎంఎస్ఎంఇలే. పేరు గొప్ప చూచి కార్పొరేట్లకు వందల వేల కోట్లు అప్పులిచ్చి అవి ఎగనామం పెడితే లబోదిబోమంటున్న బ్యాంకులు ఇతర ద్రవ్య సంస్థలు ప్రభుత్వ చల్లని చూపుతో 15–16 లక్షల కోట్ల రుణాలను రైట్ ఆఫ్ (రద్దు చేయడం కాదని వాదిస్తారు) చేసి, కష్టమర్లపై భారాలతో ఆ లోటు పూడ్చుకుంటున్నాయి. కానీ ఎంఎస్ఎంఇలకు రుణాల మంజూరుకు సవాలక్ష షరతులు, పరిమితులు విధించి అంట్రప్రొన్యూర్లను తమ చుట్టూ తిప్పుకుంటాయి. ఉపాధి కల్పనను పెంపొందించే నిమిత్తం ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలతో కూడిన పరపతి, మార్కెటింగ్ వసతులు అవసరం. ప్రభుత్వాల దృష్టి మారకపోతే ప్రమాదం ముంచుకొస్తుంది. మన దేశానికి సంబంధించి 2030 నాటికి 9 కోట్ల నుంచి 11.5 కోట్ల వరకు ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. 14.8 కోట్లు అవసరమని ఐఎంఎఫ్ అంచనా వేసింది. మన దేశంలో ఎంఎస్ఎంఇల్లో 11 కోట్ల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఫార్మల్ (నియత) రంగంలోని మొత్తం ఉద్యోగాల్లో ఇవి దాదాపు 62 శాతం. ప్రపంచవ్యాప్తంగా చూచినట్లయితే వ్యాపారాల్లో 90 శాతానికి, ఉపాధులో 60 నుంచి 70 శాతానికి, జిడిపిలో 50 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అవి ముఖ్యంగా పేదలు, మహిళలు, యువత బలహీన తరగతులకు పనులు చూపుతూ సమాజాలకు వెన్నెముకగా పనిచేస్తున్నాయి. అదే సమయంలో స్థానిక, జాతీయ, ఆర్థిక వ్యవస్థలకు ఆదాయ వనరుగా ఉన్నాయి. వర్ధమాన మార్కెట్లలో కల్పించే ప్రతి 10 నియంత ఉద్యోగాల్లో 7 ఎంఎస్ఎంఇల్లోనే. అయినా పెట్టుబడులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తక్కువ అభివృద్ధిలో ఉన్న దేశాల్లో ఈ సమస్య హెచ్చుగా ఉంది. 41 శాతం ఎంఎస్ఎంఇలు ఈ ఫిర్యాదు చేశాయి. మధ్యస్థాయి అభివృద్ధి దేశాల్లో 30శాతం, ఉన్నత ఆదాయ దేశాల్లో 15 శాతం మాత్రమే ఫైనాన్స్ సమస్య ఎదుర్కొంటున్నాయి.

ఈ ప్రపంచ సభకు ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరెస్ పంపిన సందేశంలో ఎంఎస్ఎంఇల పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. "తక్కువ వడ్డీ రుణాలు లభ్యం చేయడం, మార్కెట్ అవకాశాలు కల్పించడం, డిజిటల్ మౌలిక వసతులను, నైపుణ్యాలను పటిష్టం చేయడం, మెరుగుపరచడం ద్వారా ఎంఎస్ఎంఇల సాఫల్యతకు దోహదం చేయాలి" అన్నారు. ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ ఎఫ్ హాంగ్ బో ఉద్యోగాల కల్పనలో, సామాజిక న్యాయాన్ని ముందుకుగొని పోవడంలో ఎంఎస్ఎంఇల పాత్రను ప్రశంసించారు.

ఎంఎస్ఎంఇలు కేవలం గ్రోత్ ఇంజన్లు మాత్రమే కాదు, సామాజిక న్యాయానికి ప్రోత్సాహకారులు. ముఖ్యంగా నియత ఆర్థిక నిర్మాణాల నుంచి మినహాయించబడే స్త్రీలు, యువత, బలహీన తరగతులకు ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎమ్ఇలు సమ్మిళిత వృద్ధి, ఉపాధి కల్పన, హుందాతనంతో కూడిన పని చూపడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

మన దేశంలో ఈ దినాన్ని 'ఉద్యామి భారత్– ఎంఎస్ఎంఇ దినోత్సవం'గా పాటించారు.ఈ రంగంలో తమ సాఫల్యాలను ప్రభుత్వం ప్రదర్శించి గొప్పలు చెప్పుకుంది. అయితే గత దశాబ్దంగా అవి ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు ఆ రంగంలోని వారికి బాగా తెలుసు. ఈ రంగం భారతదేశ వృద్ధి గాథలో రెండవ ఇంజన్ అని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రస్తుతించినప్పటికీ, కేటాయింపులకు వచ్చేసరికి అది పుర్రచెయ్యి విసురుడే. 2025–26లో కేటాయింపు 2022–23లో వాస్తవంగా ఖర్చు చేసిన దానికన్నా తక్కువగా ఉంది. ఎంఎస్ఎంఇ రంగానికి ప్రభుత్వ తోడ్పాటు అవసరం మేరకు లేదన్నది సత్యం . పునరాలోచించాలి.

## 'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలపై ఆర్‌ఎస్‌ఎస్ అక్కసు


కృష్ణ ఝా

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే రాజ్యాంగ ప్రవేశిక నుండి 'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలను తొలగించాలని ప్రతిపాదించారు. ప్రవేశిక 'ప్రాథమిక హక్కుల'తో పాటు రాజ్యాంగం మౌలిక స్వరూపంలో భాగంగా ఉంది. ప్రవేశికలోని అన్ని పదాలను లేదా భావనలను సుప్రీంకోర్టు చాలాసార్లు సమర్థించింది. రాజ్యాంగ ప్రవేశిక నుండి 'సెక్యులర్', 'సోషలిస్ట్' పదాలను తొలగించడం రాజ్యాంగంపై దాడికి పాల్పడినట్లే అవుతుంది. ఇది రాజ్యాంగాన్ని ధ్వంసం చేయటం, భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే ఆర్‌ఎస్ఎస్ దీర్ఘకాలిక లక్ష్యాన్ని వెల్లడిస్తుంది. వలస పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన అసంఖ్యాక స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు, కలలకు భారత రాజ్యాంగం

> *నిజానికి, ఆర్ఎస్ఎస్‌కు ప్రవేశికతో మాత్రమే కాదు, మొత్తం రాజ్యాంగంతోనే అసౌకర్యంగా ఉంది. మన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతల ఆదరణ పొందిన విలువలను ఇది సహించదు. దీనికి కారణం చాలా సులభం – స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ ఎటువంటి పాత్ర పోషించలేదు. అది కేవలం బ్రిటీష్ వారితో సహకరించింది. మతం ఆధారంగా భారతీయుల మధ్య విభేదాలను సృష్టించడం ద్వారా జాతీయ ఉద్యమాన్ని బలహీనపరచేందుకు ప్రయత్నించింది. ఆ విధంగా, ఆర్ఎస్ఎస్ వలస పాలకుల విభజించు –పాలించు విధానానికి సహాయపడింది.*

సజీవ నిదర్శనం. ప్రవేశికలో 'సోషలిజం', 'సెక్యులరిజం' పదాలను చేర్చడం యాదృచ్ఛికం కాదు; ఇది స్వాతంత్ర్య సమరయోధులు నిలబడిన, తమ ప్రాణాలను అర్పించిన మూల విలువలను ప్రతిబింబిస్తుంది. వారి ఆదర్శాలు రాజ్యాంగంలోని ప్రతి నిబంధనలో పొందుపరచబడ్డాయి. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఈ ప దాలను చేర్చడం కేవలం ఆ వారసత్వాన్ని ధృవీకరించింది. ప్రవేశిక రాజ్యాంగం ప్రధాన విలువలను కలిగి ఉంది. ప్రవేశికను మార్చడానికి ఏ ప్రయత్నమైనా రాజ్యాంగ విద్రోహ చర్య అవుతుంది. 'సెక్యులర్' అనే పదం అంబేద్కర్ రాజ్యాంగంలో లేదనే హోసబాలే వాదన కూడా అబద్ధం. ప్రవేశికలో 'సెక్యులర్' అనే పదాన్ని చేర్చడానికి ముందే, రాజ్యాంగంలోని పార్ట్ IIIలో పొందుపరిచిన ప్రాథమిక హక్కుల విభాగంలో ఈ పదం ఉంది. 'సెక్యులర్' అనే పదం ఆర్టికల్ 25లోని క్లాజ్ (2)(ఎ) కిం ద ఉంది. ధర్మాధర్మ వివేక స్వేచ్ఛ, మతావలంబన, మతాచరణ, ప్రచార స్వేచ్ఛలను అది ప్రస్తావించింది. కాబట్టి ఈ పదం భారత రాజ్యాంగ ప్రవేశికలో చేర్చడానికి ముందే ప్రధాన విలువల్లో ఒకటిగా ఉంది.

నిజానికి, ఆర్ఎస్ఎస్‌కు ప్రవేశికతో మాత్రమే కాదు, మొత్తం రాజ్యాంగంతోనే అసౌకర్యంగా ఉంది. మన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతల ఆదరణ పొందిన విలువలను ఇది సహించదు. దీనికి కారణం చాలా సులభం –




స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ ఎటువంటి పాత్ర పోషించలేదు. అది కేవలం బ్రిటీష్ వారితో సహకరించింది. మతం ఆధారంగా భారతీయుల మధ్య విభేదాలను సృష్టించడం ద్వారా జాతీయ ఉద్యమాన్ని బలహీనపరచేందుకు ప్రయత్నించింది. ఆ విధంగా, ఆర్ఎస్ఎస్ వలస పాలకుల విభజించు–పాలించు విధానానికి సహాయపడింది.

రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ఉద్దేశాన్ని ఆర్ఎస్ఎస్ వ్యక్తపరచడం ఇదే మొదటిసారి కాదు. అది ఎప్పటికప్పుడు తన మాటలు, చేతల ద్వారా ఇలా చేస్తూనే ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, అనేక మంది బిజెపి నాయకులు తమ పార్టీ 400కి పైగా సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని గొప్పగా చెప్పుకోవడం ప్రారంభించారు. ఈ వాదనలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించాయి, విస్తృత చర్చకు దారితీశాయి. వాస్తవానికి ఈ ఆందోళన చాలా పెద్ద చర్చకు దారి తీసింది. అమిత్ షా తన ఎన్నికల ప్రచార ప్రసంగాలలో ప్రవేశికలోని 'సెక్యులర్' పదంపై తన ప్రేమను బహిరంగంగా ప్రదర్శించవలసి వచ్చింది. తమ పార్టీ 400కి పైగా సీట్లు పొందితే ఈ పదం రాజ్యాంగం నుండి తొలగించబడుతుందనే బిజెపి నాయకుల వాదనలను ఖండించవలసి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి బలం 303 నుండి 240కి తగ్గిన విషయం తెలిసిందే కదా! ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి భారత రాజ్యాంగ ప్రవేశిక నుండి 'సోషలిస్ట్', 'సెక్యులర్' అనే పదాలను తొలగించాలని ప్రతిపాదించిన వెంటనే, ఎప్పటిలాగే, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, జితేంద్ర సింగ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మతో సహా పలువురు బిజెపి నాయకులు తమ గొంతు కలిపారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అయితే ప్రవేశికలో 'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలను చేర్చడం 'సనాతన స్ఫూర్తికి అపవిత్రం' అని కూడా వ్యాఖ్యానించారు. ఇలాంటి సమష్టి చర్యకు పదే పదే పాల్పడటం ద్వారా బిజెపి, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని దెబ్బతీయాలనే వారి ఉద్దేశాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

వాస్తవానికి రాజ్యాంగ పరిషత్ మొత్తం భారతదేశ రాజ్యాన్ని సెక్యులజం కింద తీసుకువచ్చేందు కు కృషి చేసింది. 1949 అక్టోబర్ 14న రాజ్యాంగ పరిషత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇలా ప్రకటించారు: ఈ 'స్వేచ్ఛా భారతదేశ, లౌకిక రాజ్య, రాజ్యాంగాన్ని ముమ్మందు మతపరమైన ప్రాతిపదికన ఏ నిబంధనతోనూ రూపుమార్చే అవకాశం ఉండబోదని నేను స్పష్టం చేస్తున్నాను. 1949 నవంబర్ 23న లౌకిక రాజ్యం ప్రాముఖ్యతను రాజ్యాంగ పరిషత్‌కు చెందిన మరో సభ్యుడు టి.జె.ఎం. విల్సన్ ఇలా వివరించారు: 'మన రాజ్యాంగం గొప్ప విజయం దాని లౌకిక స్వభావం, దాని నుండి ఉద్భవించిన లౌకిక రాజ్యం.' 'మనం దేశానికి ఈ లౌకిక స్వభావాన్ని సాధించాము. దానిని రాజ్యాంగంలో అందించాము.' అని పేర్కొన్నారు. 'కానీ మేఘాలు కమ్ముకుంటున్నాయి. రాజ్యం లౌకిక స్వభావాన్ని చీకటిమయం చేయడానికి, దాన్ని తుడిచివేయడానికి బెదిరిస్తున్నాయి. ఈ దేశంలోని ప్రగతిశీల శక్తులు, మన గొప్ప, ప్రియమైన ప్రధాన మంత్రి (జవహర్‌లాల్ నెహ్రూ) మార్గదర్శకత్వంలో, నాయకత్వంలో, ఆ మేఘాలను తొలగించి, లౌకికరాజ్యాన్ని సాధించడానికి ఐరోపా, ఆసియాలోని చాలా దేశాలు అనుభవించిన ఆ వినాశనం, దురదృష్టాన్ని మన దేశం మళ్ళీ అనుభవించడానికి అనుమతించబోరని నేను ప్రార్థిస్తున్నాను, విశ్వసిస్తున్నాను.' అని అన్నారు.

సుప్రీంకోర్టు కూడా భారత రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిజం', 'సెక్యులరిజం' అనే పదాలను చేర్చడాన్ని సమర్థించింది. 2024 నవంబర్‌లో రాజ్యాంగం 75వ వార్షికోత్సవానికి ముందు, ప్రవేశికలో 'సోషలిస్', 'సెక్యులర్' పదాలను చేర్చడాన్ని

> *సుప్రీంకోర్టు కూడా భారత రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిజం', 'సెక్యులరిజం' అనే పదాలను చేర్చడాన్ని సమర్థించింది. 2024 నవంబర్‌లో రాజ్యాంగం 75వ వార్షికోత్సవానికి ముందు, ప్రవేశికలో 'సోషలిస్', 'సెక్యులర్' పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లను కొట్టివేసింది. రాజ్యాంగం ఆమోదించే సమయంలో దాని ఆది రూపంలో ప్రవేశికలో ఈ పదాలు లేవనే కారణంతో మాత్రమే ఈ పదాలను చేర్చడాన్ని చెల్లుబాటు కాకుండా చేయలేమని తీర్పు చెప్పింది. భారత ప్రధాన న్యాయ మూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయ మూర్తి పి.వి.సంజయ్ కుమార్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.*

సవాలు చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లను కొట్టివేసింది. రాజ్యాంగం ఆమోదించే సమయంలో దాని ఆదిరూపంలో ప్రవేశికలో ఈ పదాలు లేవనే కారణంతో మాత్రమే ఈ పదాలను చేర్చడాన్ని చెల్లుబాటు కాకుండా చేయలేమని తీర్పు చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి పి.వి. సంజయ్ కుమార్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

## పెరుగుతున్న ప్రమాదాలతో కార్మికులకు భద్రత కరువు

పారిశ్రామికీకరణతో కొత్త పరిశ్రమలు, కర్మాగారాలు ఏర్పాటు అవుతున్నాయి. పరిశ్రమలలో ఉపాధి కొరకు నిరుద్యోగ యువత వివిధ ప్రాంతాలనుండి వెతుక్కుంటూ వస్తుంటారు. అదే అవకాశంగా పరిశ్రమల యాజమాన్యం అతి తక్కువ వేతనాలకు ఉపాధి కల్పిస్తూ నైపుణ్యం లేని కార్మికులను నియమించుకొని వారి శ్రమను దోచుకుంటున్నారు. బయటి ప్రాంతాల నుండి వలస వచ్చిన కార్మికులగుట వలన కనీస సౌకర్యాలు లేకున్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పని చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తరచూ ఏదో ఒక పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతూ కార్మికులు తీవ్రంగా గాయపడుతుండటం.. క్షతగాత్రులు కావడం చూస్తున్నాం. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని పరిశ్రమలు కనీస భద్రతా ప్రమాణాలు పాటించటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పారిశ్రామిక ప్రమాద బాధితుల్లో ఎక్కువమంది జీవనోపాధి కోసం పొట్టచేత పట్టుకొని వివిధ రాష్ట్రాల నుండి వలస వచ్చిన శ్రమజీవులే ఎక్కువ ఉంటున్నారు. అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించిన కెమికల్, ఫార్మా రసాయన కర్మాగారాల్లో రాష్ట్రంలో వేలాది మంది పనిచేస్తున్నారని కార్మిక శాఖ నివేదికలు చెబుతున్నాయి. సరైన నైపుణ్యం లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో యంత్రాలను సక్రమంగా నిర్వహించలేక, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం, పాశ మైలారం పారిశ్రామికవాడలో జూన్ 30న సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఔషధ పరిశ్రమలో భారీ విస్ఫోటం సంభవించింది. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఘోరమైనదిగా.. అందరిని భయభ్రాంతులను కలిగించే విధంగా ఉన్నది.

### సిగాచీ ఔషధ పరిశ్రమ

గుజరాత్ కేంద్రంగా పనిచేస్తున్న సిగాచీ సంస్థకు తెలంగాణ, మహారాష్ట్రలో పరిశ్రమలు ఉన్నాయి. పాశమైలారం పారిశ్రామికవాడలో దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఔషధ తయారీ పరిశ్రమ ఉన్నది. ఇక్కడ ముడి సరుకును శుద్ధిచేసి 'మైక్రో క్రిస్టలైన్ సెల్యూలోజ్' అనే ఔషధాన్ని తయారుచేస్తారు. దీన్ని వివిధ ఔషధ తయారీ సంస్థలకు విక్రయిస్తారు. ఈ పరిశ్రమలో నాలుగు బ్లాకులు ఉన్నాయి. ఒక బ్లాక్‌లో ప్రొడక్షన్ విభాగం ఉంది. ఇక్కడే ఔషధం తయారీ జరుగుతుంది. దాని పైభాగముల్లో క్వాలిటీ కంట్రోల్ బ్లాక్ ఉంటుంది. ఇక్కడ మొత్తం 189 మంది సిబ్బంది పని చేస్తుంటారు. వీరిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. ఉదయం 9 .50 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో స్ప్రేయర్డ్ డయ్యర్ పేలిపోవటంతో మొత్తం భవనమే కుప్పకూలింది. ఆ సమయములో 147 మంది పరిశ్రమ ఆవరణలో ఉన్నట్లు తెలుపుతున్నారు. 40కి పైగా మృతి చెందారు. శిథిలాలను తొలగిస్తున్న కొద్ది మృతదేహాలు బయటపడుతున్నాయి. కాలిపోయిన మృతదేహాల నుంచి వస్తున్న కమురువాసన, రసాయనాల దుర్గంధం కలిసి ఆ ప్రాంతంలో కెమికల్ దుర్వాసనతో వ్యాపించిపోయింది.

### జరుగుతున్న ప్రమాదాలు

రసాయన, ఔషధ, టెక్స్‌టైల్, ఆహార సంబంధిత పరిశ్రమల్లో ఇటీవల కాలంలో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పారిశ్రామిక రంగం కేంద్రీకృతమై ఉన్న హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఏటా ప్రమాదాలు నమోదయితున్నాయి. హైదరాబాద్ పరిసరాల్లోని జీడిమెట్ల, జిన్నారం, గడ్డపోతారం, మైలారం ఐడిఏ బొల్లారం, పటాన్ చెరువు, సంగారెడ్డి తదితర పారిశ్రామిక వాడల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఔషధ తయారీ యూనిట్లు, ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లలో పేలుళ్లు, రసాయనాల లీకేజీలు, షార్ట్ సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలు సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం తదితరాల మూలంగా కార్మికులు ప్రాణాలు గాల్లో కలుస్తుండగా, భారీగా ఆస్తినష్టం కూడా జరుగుతుంది. పారిశ్రామిక రంగంలో ఫార్మా స్యూటికల్స్, కెమికల్ యూనిట్స్‌ను హైరిస్క్ పరిశ్రమలుగా పరిగణిస్తూ ఉంటారు. తెలంగాణలో హైరిస్క్ యూనిట్లు 4,130 వరకు ఉన్నప్పటికీ వాటిలో భద్రత ప్రమాణాలను తనిఖీ చేసే ఇన్స్‌పెక్టర్లు అది కొద్దిమంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 మంది ప్రాక్టీస్ ఇన్స్‌పెక్టర్లు మాత్రమే ఉన్నారు. వారు రెగ్యులరుగా పరిశ్రమల సేఫ్టీ ప్రోటోకాల్స్‌ను తనిఖీ చేయడంలో విఫలమవుతున్నారని విమర్శల ఉన్నాయి.



### ప్రమాదాలకు కారణాలు

రియాక్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం, ముడి సరుకులు, ఉత్పత్తుల నిలువ, రవాణాలో అజాగ్రత్తలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఫ్యాక్టరీల్లో భారీ యంత్రాల చుట్టూ రక్షణ చర్యలు, పిట్స్, సంప్స్ వద్ద యంత్ర భాగాలు తనిఖీలు, పరిశుభ్రత, సరైన గాలి, వెలుతురు, ఉష్ణోగ్రతలు ఉండేలా చూసుకోవడం, హానికర రసాయనాలను సురక్షితంగా పారివేయడం వంటి వాటిలో నిర్లక్ష్యం వంటివి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఉద్యోగులు, కార్మికులకు సరైన నైపుణ్యం శిక్షణ లేకపోవడం, ప్రమాదకర రసాయనాల గురించి వారికి అవగాహన లేకపోవడం, కాలం చెల్లిన యంత్రాలను మార్చకపోవడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించేలా చూడాల్సిన డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు నామమాత్ర తనిఖీలు, నోటీసుల జారీతోనే సరిపెడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలతో పాటు ఫైర్ ఆడిట్‌ను ఏటా నిర్వహించాల్సి ఉండగా.. అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. భద్రత ఆడిట్లు, కార్మికులకు నిరంతర శిక్షణ, పర్యావరణ నియమాలు పాటించడం, సాంకేతికంగా నవీకరణ, అత్యవసర స్పందన కోసం పరిశ్రమల్లో అగ్నిమాపక, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవడం తదితరాలపై దృష్టి పెట్టాలనే డిమాండు కార్మికుల నుంచి కార్మిక సంఘాల నుండి వినిపిస్తుంది.

### కార్మికులకు భద్రత కల్పించాలి

కర్మాగారాలు, పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం.. కార్మికుల భద్రత అంశాన్ని పట్టించుకోవడం లేదు. కార్మికుల భద్రతకు ప్రపంచ దేశాలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తాయి. సింగపూర్‌లో పని ప్రదేశంలో కార్మికుడు ప్రమాదంలో చనిపోతే.. నిర్లక్ష్యానికి కారణమైన యజమానికి జైలు శిక్ష వేస్తారు. నెలల వ్యవధిలో విచారణ ముగిస్తారు. ఆస్ట్రేలియాలో పని ప్రదేశంలో కార్మికుడు చనిపోతే మ్యాన్ స్లాటర్ కేసుగా బుక్ చేస్తారు. యజమానికి విధించే శిక్ష 2023లో 10 ఏళ్ల నుంచి 20 ఏళ్లకు పెంచారు. మన దేశంలో, రాష్ట్రంలో ప్రమాదం జరిగిన తర్వాత సరైన విచారణ జరగటం లేదు. చార్జిషీట్లు దాఖలు కావడం లేదు. కర్మాగారాల్లో భద్రతా వైఫల్యాలు, కార్మికచట్టాల ఉల్లంఘనల నివారణకు ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి. కర్మాగారాల పర్యవేక్షణ రెగ్యులర్‌గా ఉండాలి. పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి. కార్మికులకుందరికి ఇన్సూరెన్స్‌తో పాటు ప్రమాద బీమా చేయించాలి. ప్రభుత్వం ప్రమాదాలకు కారణమవుతున్న పరిశ్రమ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

**– ఉజ్జిని రత్నాకర్ రావు**
9490952646

## పనికి, కుటుంబ జీవితానికీ మధ్య సమతుల్యం సాధిద్దాం!

కొందరు వృత్తి సంబంధ పనుల్లో తనమునకలై, తమ వ్యక్తిగత పనులనే కాదు తమ కుటుంబాలను కూడా నిర్లక్ష్యం చేస్తూ అనేక ఇతర సమస్యలను ఎదుర్కొంటారు. ఇలాంటి అతిగా పని చేసే వారిని మనం సాధారణంగా పని రాక్షసులుగా పిలుస్తాం. అధిక సమయం వృత్తి లేదా ఉద్యోగ ఉపాధులకే కేటాయిస్తూ, తమను తాము మరిచిపోయి పలు అనారోగ్య సమస్యలకు కూడా లోనవుతున్నారు. వీరిని 'వర్క్‌హాలిక్స్' అని పిలవడం పరిపాటిగా మారింది. 'వర్క్', 'ఆల్కహాల్' అను పదాల కలయికతో ఏర్పడిన 'వర్క్‌హాలిక్స్' గుణం కలిగి ఉన్న వ్యక్తులు వృత్తి ఉద్యోగ ఉపాధుల పనిల్లో మాత్రమే మునిగిపోయి తనను తాను మరిచిపోతారు, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి, తమ వ్యక్తిగత జీవితాలకు సహితం దూరమై తమ తమ జీవితాలను దుర్భరంగా మార్చుకుంటూ, అనారోగ్యాల బారిన పడడాన్ని చూస్తున్నాం. వృత్తికి సంబంధించిన పనులను చేయాలి కాని వ్యక్తిగత జీవితానికి, కుటుంబ సభ్యులకు కూడా తగిన సమయం కూడా కేటాయిస్తూ సమతుల్యతలను సాధించడమే అసలైన జీవన మాధుర్యమని తెలుసుకోవాలి. పనికి అనవసర అధిక సమయాలను కేటాయించడం, పని గంటలను మరిచి పనిలో మునిగిపోవడం లాంటి గుణాలు తమ జీవితాలను దుఃఖముతో చేస్తాయని అవగాహన పర్చడానికి ప్రతి ఏటా జూలై 5న ప్రపంచ దేశాలు జాతీయ వర్క్‌హాలిక్స్ దినం లేదా జాతీయ అతిగా పని చేసే వారి దినంగా పాటిస్తాయి. ఇలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు తమకు కేటాయించిన సమయంలో మాత్రమే పని చేస్తూ, వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలకు తగు సమయాన్ని కేటాయిస్తూ జీవితంలో పనికి, ఇతర అంశాలకు సమతుల్యత సాధిస్తూ, సంతోష ఆరోగ్యకర జీవితాలను గడపడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాలి. మనం వృత్తి పనులు చేయడానికి మాత్రమే కాదని గమనించాలి. మనకంటూ ఒక వ్యక్తిగత జీవితం ఉంది. మనకు కూడా అభిరుచులు ఉంటాయి. మనకు కూడా అందరితో కలిసి ఆనందంగా జీవించాలని ఉంటుంది. అభిరుచులను తీర్చుకోవాలని ఉం టుంది. మన కుటుంబాన్ని, సంతానాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలని కూడా ఉంటుంది. జీవనోపాధికి ఏదో ఒక వృత్తిని ఎంచుకుంటాం. దాని నుం చి లభించే జీతంతో మనదైన జీవితాలను గడుపుతాం. జీతం మాత్రమే జీవితం కాదని తెలుసుకోవాలి. వృత్తి పనుల్లో అధిక సమయం కేటాయించడం ఉత్తమం కాదు. మనకు కేటాయించిన దాదాపు 8 గంటల సమయంలో మాత్రమే ఏకాగ్రతతో పని చేయాలి, ఉత్తమ ఫలితాలను సాధించాలి. అధిక సమయం పని చేస్తే ఏకాగ్రత లోపిం చి తక్కువ ఫలితాలు లేదా ఎక్కువ తప్పులు జరుగుతాయి. దీనితో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిద్రలేమి, అలసట, తలనొప్పి లాంటివి ఆవహిస్తాయి. అనారోగ్యం మనల్ని ఆక్రమిస్తుంది. ఓవర్ వర్క్ మన శ్యాంతిని హరిస్తుంది. సంస్థలో చెడ్డ పేరు తెస్తుంది. మనం వృత్తిలో పని గంటలను పాటిద్దాం. సహచర ఉద్యోగులతో సరదాగా కలిసి పని చేద్దాం, పనితో ఏకాగ్రతను పెంచుకుంటూ సాఫల్యత సాధిద్దాం. సమయానుకూలంగా కుటు ంబంతో కలిసి వినోదాలు, విందులు, యాత్రలకు ప్రణాళికలు వేద్దాం. జీవితాన్ని సమతుల్యతతో సంతోషాలు నిండిన మహాభాగ్యంగా మలుచుకుందాం. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని తెలుసుకుందాం. ఆరోగ్యానికి కొంత సమయాన్ని పెట్టుబడిగా పెడదాం. ఆరోగ్యం ఉంటేనే వృత్తి ఉద్యోగాలని తెలుసుకుందాం. వర్క్‌లైఫ్‌ను బ్యాలె న్స్ చేసుకుంటూ ఆనంద సుగంధాలతో జీవితాలను కొనసాగిద్దాం. అందరూ మెచ్చే విధంగా జీవనశైలినా మార్చుకుందాం.

(జులై 5న జాతీయ వర్క్‌హాలిక్స్ డే)

**– డాక్టర్.బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700047

## మంటగలుస్తున్న మానవ సంబంధాలు

తాత మనవడు సినిమాలో సినారె రాసిన 'అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం ఆత్మ తృప్తికై మనుషులు ఆడుకునే నాటకం వింత నాటకం' అని ప్రతి ఒక్కరూ పాడుకునేలా చేస్తున్నది. నేటి మనుషుల తీరు. ప్రతి రోజు కేరళ నుంచి కాశ్మీర్ వరకు జరుగుతున్న ఉదంతాలు ఇది నిజమనిపిస్తున్నాయి. ఈ రోజుల్లో సమాజంలో భార్య, భర్త విడాకులు తీసుకోవడం, అక్రమ సంబంధాలు వంటివి పెరిగినట్లు అనిపిస్తోంది. ఆశ్చర్యమేమిటంటే, ఇది మామూలే అనే నిర్లిప్త ధోరణిని ప్రజలు వ్యక్తపరచటం. విడాకులు, అక్రమ సంబంధాల వల్ల కుటుంబ వ్యవస్థ కూలిపోవటం, భార్యాభర్తల మధ్య పరస్పర అనుమానాల వల్ల హత్యలు, ఆత్మహత్యలు, తద్వారా వారి పిల్లలు అనాథలు కావడం వంటి విషాదకర పరిణామాలు చోటుచేసుకుంటాయి. క్షణిక సుఖం కోసం అక్రమ సంబంధాలు వివాహ వ్యవస్థకే సవాళ్లు విసురుతున్నాయి. రెండు నెలల్లో ముగ్గురు భర్తలను మార్చిన వనిత. ప్రేమ కాదన్నందుకు పదో తరగతి అమ్మాయి తల్లిని చంపిన ఉదంతం. తల్లీ కూతురుతో అక్రమ సంబంధం పెట్టుకొని నవ వరుడిని చంపిన సంఘటన, చదువు చెప్పాల్సిన నలభై ఏళ్ల టీచర్ పదవ తరగతి అబ్బాయితో అక్రమ సం బంధం. ఇటీవల ముగ్గురు పిల్లల తల్లి (39) తన కుమార్తెతో వివాహం నిశ్చయమైన 24 సంవత్సరాల వ్యక్తితో లేచిపోయింది. హైదరాబాద్‌లో గురుమూర్తి అనే వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతకంగా నరికి చంపి కుక్కర్లో ఉడకబెట్టి చెరువులో పడేశాడు. మరొక వ్యక్తిని మోరీలో పడేసి సిమెంట్‌తో కప్పి పడేసింది. అక్రమ సంబంధంతో సుఖపడదామని ముక్కుపచ్చలారని ముగ్గురు అబ్బాయిలను విషం ఇచ్చి చంపింది ఒక మహా తల్లి. భర్తకు కరెంటు షాకిచ్చి చంపింది ఒక ఇల్లాలు. కర్ణాటక మాజీ డీజీపీ ప్రకాష్‌ను అత్యంత దారుణంగా చంపింది తన భార్య. కేంద్రమంత్రి మనవరాలిని దారుణంగా హత్య చేశారు తన భర్త. రెండేళ్లు కాపురం చేశాక లవర్‌తో వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది మరో యువతి. పదుల సంఖ్యలో పెళ్లిళ్లు చేసుకొని మోసం చేసిన ఘటనలు, హత్యలు కోకొల్లలు. గతంలో ఇలాంటి వార్తలు విన్నప్పుడు ఎక్కడో జరిగింది అనుకునే వారు. కానీ ఇప్పుడు తమ సమీప ప్రాంతాల్లో ఇలాంటి నేర ప్రవృత్తి పెరిగి పోవడం దానికి పేద ధనిక కులం మతం ప్రాంతం అన్నీ సమానంగా ఉంటున్నాయి. మనిషిని అంతమొందించాలంటే ఎలా అని రోజుల కొద్దీ ఆన్లైన్‌లో తర్ఫీదు పొందుతున్నారు. పనికిమాలిన పనులు చేయడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. డీప్‌ఫేక్, టెక్ ఫాగ్ చాలా టూల్స్ ద్వారా మనుషులను మోసం చేస్తున్నారు. మనిషికి కృతిమ మేధస్సు (ఎఐ) ఎలా సహాయపడుతుందో అలాగే వారి ఆచూకీ తెలుపడానికి ఉపయోగపడుతోంది. ఈ వార్తలు చూసినప్పుడు క్షణిక సుఖం కోసం కుటుంబ విలువలు మంటగలుపుతున్నారు. ఇతరుల మోజులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఒకప్పుడు సమాజంలో ఎవరికైనా ఆపద వస్తే ఒకరికి ఒకరు తోడుగా ఉండేవారు. నేడు పరిస్థితులు మారిపోయాయి ఏది జరిగినా మనకెందుకులే అనుకునే సంస్కృతి సమాజంలో పెరిగిపోయింది. వ్యక్తి ఎంత సేపు ఆర్థిక సంబంధాలు కొరకు మాత్రమే మానవ సంబంధాలు కొనసాగిస్తున్నారు. ప్రతిరోజు ఒకరితో మనం కలిసి ఉంటే మనకు వారు ఏవిధంగా ఉపయోగపడతారు అనే ఆలోచన సమాజంలో పెరిగిపోయింది. చివరికి కుటుంబ సభ్యుల అనుబంధాలు కూడా ఆర్థిక సంబంధాలుగా మారిపోవడం చాలా బాధాకరం. ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు కుటుంబ సభ్యులందరూ కలిసి ఉండేవారు. ఆ కుటుంబంలో ఉండే పెద్దవారు కుటుంబ సభ్యులకు వారికి తెలియకుండానే వ్యక్తిత్వ వికాస బోధన చేసేవారు. వారి ప్రవర్తన చూసి పిల్లలు నేర్చుకునేవారు. భవిష్యత్తులో సమాజంలో ఏ విధంగా ఉంటే మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారో వారికి దిశానిర్దేశం చేసేవారు. నేటి ఆధునిక యుగంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. నేను, నా భార్య పిల్లలు మాత్రమే అనుకునే 'న్యూక్లియర్ ఫ్యామిలీస్' ఏర్పడ్డాయి. ఆధునిక ప్రపంచంలో మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారడానికి ప్రధాన కారణాలు తను మాత్రమే ఎదగాలని వ్యక్తిగత స్వార్థం, సామాజిక స్పృహ లోపించడం, సోషల్ మీడియా, ఉమ్మడి కుటుంబాలకు దూరంగా ఉండడం వంటివి. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే సంభాషణల వల్ల వారిద్దరి మధ్య మానవ సంబంధాలు బలపడే అవకాశాలు ఉన్నాయి. సోషల్ మీడియా ప్రభావానికి లోనై ప్రజలు భౌతికంగా సంభాషించడం మానేసి చాలా రోజులైంది. వారికి సంతోషం వచ్చినా బాధలు వచ్చినా సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా సాధనాలలో ఎక్కువ సమయం గడుపుతూ భౌతికంగా వ్యక్తుల మధ్య ఉండే సంభాషణలు, ప్రేమ, అనురాగాలు, ఆప్యాయతలు దూరమవుతున్నారు. సామాజిక మాధ్యమాలలో ఉండే స్నేహితులు వారికి నిజమైన స్నేహితులుగా భావిస్తున్నారు. విద్యార్థులను, యువకులను ధనార్జక యంత్రాలుగా కాక మానవీయత కలిగిన వారుగా, మంచి పౌరులుగా రూపొందించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. అదే రేపటి తరానికి మార్గదర్శకమవుతుంది.

**– డా.ముచ్చుకోట సురేష్‌బాబు**
9989988912



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## పని నచ్చకపోతే నక్సల్స్‌గా ముద్ర వేయడం ఫ్యాషన్ అయ్యింది

ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ విమర్శ

**న్యూఢిల్లీ :** ఒకరి పనిని లేదా వారి భావజాలాన్ని అంగీకరించడానికి ఇష్టపడకపోతే వారిని 'నక్సల్' అని ముద్ర వేయడం 'ఫ్యాషన్'గా మారుతోందని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ విమర్శించారు. పంఢర్‌పూర్‌కు వార్షిక 'వారి' తీర్థయాత్రలో 'అర్బన్ నక్సల్స్' చొరబడ్డారని, 'వార్కారీలను' లేదా లార్డ్ విఠల్ భక్తులను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని బుధవారం శాసన మండలిలో శివసేనకు చెందిన మనీషా కయాండే పేర్కొనడంపై శరద్ పవార్ స్పందించారు. దానికి సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద లేదన్నారు. కానీ, కానీ మీడియాలో నివేదించబడిన రెండు సంస్థలలో లోకాయత్ ఒకటన్నారు. తాను లోకాయత్ పనిని చూశానని చెప్పారు. 'ఈ సంస్థ దాని దృక్పథంలో ఆధునికమైనది. గత కొన్ని సంవత్సరాలుగా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా సాధారణ ఏకాభిప్రాయాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. వారు నక్సల్స్ కాదు. 'ఒకరి పనిని లేదా భావజాలాన్ని అంగీకరించకపోతే వారిని నక్సల్‌గా ముద్ర వేయడం ఇప్పుడు పెరుగుతోంది' అని పవార్ అన్నారు.

# నవ భారతదేశానికి ఆకాశం కూడా హద్దు కాదు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధీమా

ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటన సందర్భంగా భారత ప్రవాసుల సమావేశంలో ప్రసంగం

రీజియన్‌లోనే భారతదేశ 'యుపిఐ'ని స్వీకరించిన మొదటి దేశమని ప్రశంస



**పోర్ట్ ఆఫ్ స్పెయిన్ :** భారతదేశం త్వరలోనే ప్రపంచంలోని మూడు అగ్ర ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలువనున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీమా వ్యక్తం చేశారు. కృత్రిమ మేధస్సు, సెమీ కండక్టర్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి దాని లక్ష్యాలు వృద్ధికి నూతన చోదకాలుగా మారుతున్నాయని చెప్పారు. గురువారం ఇక్కడ జరిగిన భారత ప్రవాసుల సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 'భారతదేశం నేడు అవకాశాల భూమి'గా రూపాంతరం చెందిందన్నారు. ఫలాలు, పురోగతి అత్యంత అవసరమైన వారికి చేరుతున్నాయన్నారు. 'నవ భారతదేశానికి ఆకాశం కూడా హద్దు కాదు' అని ఉద్ఘాటించారు. 5 దేశాల పర్యటనలో భాగంగా ట్రినిడాడ్ మరియు టొబాగోలో అడుగుపెట్టిన మోదీ కొన్ని గంటల తర్వాత ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 1999 తర్వాత ఈ కరేబియన్ ద్వీప దేశానికి భారత ప్రధానమంత్రి చేసిన మొదటి పర్యటన ఇది. ట్రినిడాడ్ – టొబాగో ప్రధానమంత్రి కమలా పెర్సద్‌బిసెస్సర్ , ఆమె మంత్రివర్గ సభ్యులు, చట్టసభకు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పలువురు దాదాపు 4,000మందికి పైగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఆయన తన ప్రసంగంలో ట్రినిడాడ్ – టొబాగోలో ఉంటున్న భారతీయ సమాజాన్ని ఆయన ప్రశంసల్లో ముంచెత్తారు. 'వారు వారి నేలను వీడినా వారి ఆత్మను మాత్రం వీడలేదు'. వారు గంగ యమునలను వెనక వదిలి వెళ్లారు. కానీ, రామాయణాన్ని వారి గుండెల్లోనే పెట్టుకున్నారు. వారు వారి నేలను మాత్రమే వీడినా వారి ఆత్మను మాత్రం విడిచిపెట్టలేదు. వారు కేవలం వలసదారులే కాదు . వారు కాలాతీత నాగరికతకు దూతలు' అని మోదీ ప్రస్తుతించారు. వారి సహాయాలు ఈ దేశానికి సాంస్కృతికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రయోజనం చేకూర్చింది. ఈ అందమైన దేశంపై దాని ప్రభావాన్ని చూడండి అని మోదీ జోడించారు. అయోధ్యలోని రామాలయ ప్రతిరూపాన్ని, సరయూనది నుంచి కొంత నీటిని తీసుకొచ్చానని చెప్పారు. 'ఈ ఏడాది ప్రారంభంలో ప్రపంచంలోనే అతిపెద్ద జనసమీకరణతో మహాకుంభమేళా జరిగిందని మీకు తెలుసు. మీ కోసం మహాకుంభమేళా నుంచి నీటిని నాతో తీసుకొచ్చే గౌరవం నాకు దక్కింది'అని ప్రధాని మోదీ తెలిపారు. సరయూనది, మహా కుంభ్ పవిత్ర జలాలను ఇక్కడ గంగాధారకు అవకాశం కల్పిస్తూ అనుమతించాలని నేను కమలాజీ (ప్రధానమంత్రి)ని కోరుతున్నాను. ఈ పవిత్ర జలాలు ట్రినిడాడ్–టొబాగో ప్రజలను ఆశీర్వదిస్తాయి' అని ఆయన జోడించారు. గిర్మితియా కమ్యూనిటీకి సంబంధించిన సమగ్ర డేటాను రూపొందించడానికి భారతదేశం చురుకుగా పనిచేస్తున్నదని నరేంద్రమోదీ చెప్పారు. అంతేకాకుండా ప్రధానమంత్రి మోదీ తన ప్రసంగంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకత, దాని పైకి వెళ్లే పథాన్ని కూడా ప్రముఖం గా ప్రస్తావించారు. భారతదేశ వృద్ధికి దాని నవకల్పనతో కూడిన, శక్తివంతమైన యువత శక్తిగా తోడు నిలిచిందని కితాబునిచ్చారు. డిజిటల్ చెల్లింపులలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన భారతదేశ 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' (యుపిఐ) కూడా మోదీ ఈ సందర్భంగా ప్రదర్శించారు. 'ప్రపంచంలోని రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీల్లో దాదాపు 50 శాతం భారతదేశంలోనే జరుగుతాయి. అంతేకాకుండా ఈ రీజియన్‌లోనే యుపిఐను స్వీకరించిన మొదటి దేశమైన ట్రినిడాడ్–టొబాగోను నేను అభినందిస్తున్నాను. ఇప్పు డు డబ్బు పంపడం గుడ్ మార్నింగ్ టెక్స్ట మెసేజి పంపించే అంత ఈజీ అవుతుంది. వెస్ట్ ఇండీస్ బౌలింగ్ కంటే కూడా వేగంగా జరుగుతుందని నేను మీకు హామీ ఇస్తున్నాను' అని ప్రధానమంత్రి మోదీ వారికి అభయం ఇచ్చారు. మౌలిక సదుపాయాలు, చక్షణ, తయారీ రంగాలలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కూడా మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

## 'ఇడి' నేషనల్ హెరాల్డ్ అభియోగం...

# నిజంగా ఒక వింత కేసు

సోనియాగాంధీ తరపు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు



**న్యూఢిల్లీ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన 'నేషనల్ హెరాల్డ్ కేసు 'నిజంగా ఒక వింత కేసు' అని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తరపున ప్రాతినిథ్యం వహించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. ఈ కేసులో దాఖలుచేసిన చార్జిషీట్‌ను పరిగణనలోనికి తీసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి.రాజు జులై 3న తన వాదనలు ముగించిన తర్వాత సింఘ్వీ శుక్రవారం తన ఖండనను ప్రారంభించారు. 'ఇది నిజంగానే ఒక వింత కేసు. వింతను కూడా మించిన కేసు. ఇంతకు ముందెన్నడూ లేని రీతిలో ఉన్నటువంటి మనీల్యాండరింగ్‌కు సంబంధించిన కేసు. ఎలాంటి ఆస్తి లేకుండా ఎలాంటి ఉపయోగం లేదా ఆస్తి ప్రొజెక్షన్ లేకుండా ఆరోపించబడిన కేసు ఇది' అని అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) కు చెందిన రూ.2,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను యంగ్ ఇండియన్ అనే ప్రైవేట్ కంపెనీ మోసపూరితంగా స్వాధీనం చేసుకుని కుట్ర, మనీల్యాండరింగ్‌కు పాల్పడిందని నిందిస్తూ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, దివంగత కాంగ్రెస్ నేత మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండేజ్ సహా సుమన్‌దూబే, శామ్ పిట్రోడాలపై ఇడి అభియోగాలు మోపింది.యంగ్ ఇండియన్‌లో సోనియాగాంధీ 76శాతం వాటాలను కలిగి ఉన్నారని, వారు రూ.90కోట్ల రుణం కోసం అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను దోచుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. అయితే ఎజెఎల్‌ను రుణరహితంగా చేసేందుకు ఈ ప్రక్రియ సాగుతోందని సోనియాగాంధీ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. చట్టం ప్రకారం ప్రతీ కంపెనీకి హక్కు ఉంది. ప్రతీ రోజూ వివిధ సాధనాల ద్వారా తమ కంపెనీలకు విడుదల పొందేలా చూస్తారు. కాబట్టి మీరు అప్పును తీసేసి మరో సంస్థకు అప్పగిస్తారు కాబట్టి ఈ కంపెనీ స్వేచ్ఛను పొందుతుంది అని సింఘ్వీ చెప్పారు. యంగ్ ఇండియన్ 'ఒక లాభాపేక్ష లేని కంపెనీ' అని సింఘ్వీ చెప్పారు. 'అంటే అది డివిడెండ్లు ఇవ్వదు. ప్రోత్సాహకాలు ఇవ్వదు. జీతాలు ఇవ్వదు. అది వారికి బోనస్‌లు కూడా ఇవ్వదు. అది ఏమీ ఇవ్వదు' అని ఆయన వాదించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ చాలా ఏళ్లుగా ఏమీ చేయలేదని, బదులుగా ఒక ప్రైవేట్ ఫిర్యాదును స్వీకరించిందని సింఘ్వీ చెప్పారు. ప్రస్తుత కోర్టుకు ఈ కేసును విచారించే అధికార పరిధిలేకపోవడానికి గల కారణాలను సింఘ్వీ ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ తన వాదనలను కొనసాగించారు. జులై 3న అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి.రాజు చార్జిషీట్‌లోని అంశాలను ఆధారంగా చేసుకుని గాంధీలు యంగ్ ఇండియన్ 'లబ్ధిదారులైన యజమానులు' అని, ఇతర షేర్ హోల్డర్ల మరణం తర్వాత పూర్తి నియంత్రణను పొందారని వాదనలు వినిపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గాంధీలు, ఇతరులకు వ్యతిరేకంగా సెక్షన్లు 3 (మనీ ల్యాండరింగ్), సెక్షన్ 4 ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద (మనీల్యాండరింగ్‌కు పాల్పడినందుకు శిక్ష)అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. ఇడి తన చార్జిషీట్‌లో దూబె, పిట్రోడా, సునీల్ భండారి, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్కండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లను కూడా చేర్చింది.

# ప్రమాదకర స్థాయిలో నదులు



**న్యూఢిల్లీ :** అసోంలో వరద పరిస్థితి దారుణంగా మారింది. గోలాఘాట్ జిల్లాలోని ధన్సిరి (దక్షిణ) నది, శివసాగర్ జిల్లాలోని దిఖోవ్ నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ఈ మేరకు కేంద్ర నీటి కమిషన్ (సిడబ్ల్యుసి) శుక్రవారం రోజు వారీ బులెటిన్‌లో పేర్కొంది. భారతదేశంలో ప్రస్తుతం తీవ్రంగా వరదలు సంభవించే కేటగిరీలో ఉన్న రెండు ప్రాంతాలు ఇవే. సిడబ్ల్యుసి నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా 14 ప్రదేశాలు ఉండగా, వీటిలో తీవ్ర వరదలు సంభవించే ప్రదేశాలు రెండు ప్రదేశాలు ఉన్నాయి. ఇక్కడ నీటి మట్టం ప్రస్తుతం హెచ్చరిక స్థాయి కంటే ఎక్కువగా ఉంది. సాధారణం కంటే ఎక్కువ కేటగిరీలోని 12 ప్రదేశాలు అసోం, బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ అంతటా విస్తరించి ఉన్నాయి. తీవ్ర వరద పరిస్థితి కేటగిరీలోని రెండు నదులలో నీటి మట్టాలు ఇప్పటికీ పెరుగుతున్నాయని భారతదేశం అంతటా కీలకమైన వరద అంచనా ప్రదేశాలలో నీటి మట్టాలను పర్యవేక్షించే బులెటిన్ నివేదించింది. గోలాఘాట్ జిల్లాలోని నుమాలిఘర్ వద్ద శుక్రవారం ధన్సిరి (దక్షిణ) నది 78.81 మీటర్ల వద్ద ప్రవహిస్తోంది. ఇది ప్రమాద స్థాయి 78.42 మీటర్ల కంటే ఎక్కువగా ఉంది. నీటి మట్టం శుక్రవారం ఉదయం గంటకు 20 మి.మీ. స్థిరంగా పెరుగుతోంది. శివసాగర్ జిల్లాలోని శివసాగర్ వద్ద, దిఖో నది 92.4 మీటర్ల కంటే ఎక్కువగా 92.57 మీటర్ల వద్ద ప్రవహిస్తోంది. నీటి మట్టం గంటకు 110 మి.మీ. స్థిరంగా పెరుగుతోంది. అసోంలో సాధారణం కంటే ఎక్కువ వరద కేటగిరీ కింద ఆరు అదనపు ప్రదేశాలు ఉన్నాయి. వీటిలో అన్నపూర్ణ ఘాట్ (కాచర్) వద్ద బరాక్, బెకి రోడ్ బ్రిడ్జి (బార్పేట) వద్ద బెకి, నీమతిఘాట్ (జోర్హాట్) వద్ద బ్రహ్మపుత్ర వంటి నదులు ఉన్నాయి. ఈ ప్రదేశాలు హెచ్చరిక పరిమితులను దాటి ప్రమాద గుర్తులను చేరుకుంటున్నాయి లేదా పెరుగుతున్నాయి అని బులెటిన్ తెలిపింది. రిజర్వాయర్ ఇన్‌ఫ్లోలను కూడా పర్యవేక్షిస్తున్నారు. 11 రాష్ట్రాల్లోని 25 ప్రదేశాలకు పరిమితికి మించి నీటి ప్రవాహం అందుతోంది. వీటిలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడులోని కీలక జలాశయాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని నర్మదా నదిపై ఉన్న బార్గి రిజర్వాయర్‌కు 6,948 క్యూమెక్‌ల ఇన్‌ఫ్లో రేటు ఎక్కువగా ఉండగా, తెలంగాణలోని పిడి జురాలా ఆనకట్ట 3,400 క్యూమెక్‌ల పెరుగుదలను నమోదు చేసింది.

# హిమాచల్‌లో 'జలప్రళయం'

43 మంది మృతి, మరో 37 మంది గల్లంతు

జూన్ 20 నుంచి ఇప్పటి వరకు రూ. 5 వేల కోట్ల మేర ఆస్తి నష్టం



**సిమ్లా :** హిమాచల్‌ప్రదేశ్‌ను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేశాయి. ఇటీవల ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీంతో హిమాచల్‌ప్రదేశ్‌కు భారీ ఆస్తి, ప్రాణ నష్టం ఏర్పడింది. బియాస్ సహా పలు నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పలు ప్రాంతాల్లో భారీ వరదలు సంభవించాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. కాగా, గత నెలలో రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి హిమాచల్ ప్రదేశ్‌లో వాతావరణ విధ్వంసంతో మేఘాల విస్ఫోటనం, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం కారణంగా 43 మంది మరణించారని, మరో 37 మంది గల్లంతయ్యారని అధికారులు శుక్రవారం తెలిపారు. జూన్ 20న రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకగా, అప్పటి నుండి రూ. 5,000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. మృతి చెందిన 43 మందిలో 14 మంది మేఘాల విస్ఫోటనం వల్ల, ఎనిమిది మంది ఆకస్మిక వరదల వల్ల, ఒకరు కొండచరియలు విరిగిపడటంతో మరణించగా, ఏడుగురు మునిగిపోయారు. మండి జిల్లాలో అత్యధికంగా 17 మరణాలు సంభవించాయి. జిల్లాలో మంగళవారం పది సార్లు మేఘాలు విస్ఫోటనం చెందడం, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగి పడి విధ్వంసం సృష్టించాయి. కేవలం ఈ ఒక్క జిల్లాలోనే గల్లంతయిన 31 మంది కోసం ఇంకా గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళానికి చెందిన సైనికులు భారీ వర్షం తర్వాత భరద్, దేజి, పాయాలా, రుక్చుయ్ గ్రామాల్లో చిక్కుకున్న 65 మందిని రక్షించారు. ఈ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం, రోడ్లు దెబ్బతినడం, నదులు ఉప్పొంగడం వల్ల అనేక గ్రామాలు తెగిపోయాయి. ప్రజల ఇళ్ళు, పొలాలలో శిథిలాలు పేరుకుపోయాయి. 150 కి పైగా ఇళ్ళు, 106 పశువుల కొట్టాలు, 31 వాహనాలు, 14 వంతెనలు, అనేక రోడ్లు దెబ్బతిన్నాయి, వివిధ విపత్తులలో 164 పశువులు చనిపోయాయి. రక్షించిన 402 మందిని ఉంచడానికి ఐదు సహాయ శిబిరాలను ఏర్పాటు చేయగా, వాటిలో 348 మంది జిల్లాలోనే ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 332 ట్రాన్స్‌ఫార్మర్లు, 784 నీటి సరఫరా పథకాలకు అంతరాయం కలిగిందని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ తెలిపింది. శనివారం నుండి మంగళవారం వరకు రాష్ట్రంలోని కొండ ప్రాంతాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కార్యాలయం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హిమాచల్‌లోని కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది.

అఘర్‌లో గురువారం సాయంత్రం నుండి 71.4 మి.మీ వర్షం కురిసింది, ఘఘాస్ 38.6 మి.మీ, సరహన్ 36.4 మి.మీ, నగ్రోటా సూర్యన్ 31.4 మి.మీ, కందఘాట్ 31 మి.మీ, కర్సోగ్ 27.4 మి.మీ, మురారి దేవి 24.4 మి.మీ, కాంగ్రా 22.7 మి.మీ, పాలంపూర్ 21 మి.మీ వర్ష పాతం నమోదైంది.



# టివికె సిఎం అభ్యర్థిగా దళపతి విజయ్..

టివికె కీలక ప్రకటన

**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తమిళగ వెట్రి కగళం(టివికె) పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా టివికె అధినేత, హీరో విజయ్ పేరును ప్రకటించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే బరిలో దిగుతుందని స్పష్టం చేసింది. బిజెపి, డిఎంకెలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. టివికె పార్టీ సిద్ధాంతానికి ఈ రెండు పార్టీలు శత్రువులని పేర్కొంది. పార్టీ అధినేత విజయ్ అధ్యక్షతన శుక్రవారం చెన్నైలో ఉన్నత స్థాయి కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ పలు తీర్మానాలు చేసింది. సెప్టెంబర్, డిసెంబర్ మాసాల మధ్య విజయ్ పర్యటన రాష్ట్రంలో కొనసాగుతుందని ప్రకటించింది. వచ్చే నెలలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. అలాగే గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నేతలకు ఉన్నతస్థాయి కమిటీ సూచించింది. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇంగ్లీష్ భాషపై చేసిన వ్యాఖ్యలపై సైతం ఈ సందర్భంగా చర్చించారు. అలాగే తమిళనాడులో ద్వంద్వ భాషా విధానాన్ని అమలు చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని టివికె స్పష్టం చేసింది. తమిళనాడుపై హిందీ, సంస్కృతం భాషను బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తే.. ఆ చర్యలను తమ పార్టీ అడ్డుకుంటుందని విజయ్ వెల్లడించారు. అయితే ఎన్నికల సవరణ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు విజయ్. మైనార్టీ ఓట్లను తగ్గించేందుకే ఈ నిర్ణయమని పేర్కొన్నారు. అంతేకాదు.. బిజెపి అనుకూల ఓట్లను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒక భాగమన్నారు. కాగా, 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలు సభలు, సమావేశాలు నిర్వహించడమే కాకుండా.. కీలక నిర్ణయాలను హీరో విజయ్ తీసుకునే అవకాశముందని సమాచారం.

# క్యూట్ యుజిలో ఒకరికి 100 శాతం పర్సంటైల్

17 మంది అభ్యర్థులకు మూడు సబ్జెక్టుల్లో వంద శాతం స్కోర్



**న్యూఢిల్లీ :** కామన్ ఎంట్రన్స్ యూనివర్సిటీ టెస్ట్–అండర్ గ్రాడ్యుయేట్ (క్యూట్ యుజి) ఫలితాలు విడుదలయ్యాయి. ఒక అభ్యర్థి నాలుగు సబ్జెక్టులలో 100 పర్సంటైల్ సాధించగా, దేశవ్యాప్తంగా 17 మంది అభ్యర్థులు మూడు సబ్జెక్టులలో టాప్ స్కోర్ సాధించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) శుక్రవారం ప్రకటించింది. 13,54,699 మంది అభ్యర్థులకు ఎన్‌టిఎ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) మోడ్‌లో క్యూట్ యుజి నిర్వహించింది. ఈ అభ్యర్థులు 2025–2026 విద్యా సెషన్ కోసం వివిధ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నారు. తాను ఎంచుకున్న ఐదు సబ్జెక్టులలో ఒకే ఒక అభ్యర్థి నాలుగు సబ్జెక్టులలో 100 పర్సంటైల్ సాధించారు. మొత్తం 17 మంది అభ్యర్థులు మూడు సబ్జెక్టులలో 100 పర్సంటైల్ సాధించగా, 150 మంది అభ్యర్థులు రెండు సబ్జెక్టులలో 100 పర్సంటైల్ సాధించారు. మొత్తం 2,679 మంది అభ్యర్థులు ఒక సబ్జెక్టులో 100 పర్సంటైల్ సాధించారని ఎన్‌టిఎ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మొత్తంగా క్యూట్ యుజి 2025 అభ్యర్థులకు 37 సబ్జెక్టులకు (13 భాషలు, 23 డొమైన్–నిర్దిష్ట సబ్జెక్టులు, జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్) అవకాశం కల్పించారు. అభ్యర్థులు భాషలు, జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌తో సహా గరిష్టంగా ఐదు సబ్జెక్టులను ఎంచుకోవచ్చు. 35 షిఫ్టులలో 19 రోజుల వ్యవధిలో 13 భాషలు (మొత్తం 57,940 ప్రశ్నలు) సహా 322 ప్రత్యేక ప్రశ్నాపత్రాలు, మొత్తంగా 1,059 ప్రశ్నాపత్రాలను రూపొందించారు. ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూతో సహా 13 భాషలలో ప్రశ్నాపత్రాలను తయారు చేశారు. క్యూట్ యుజి 2025ను అబుదాబి, దోహా, దుబాయ్, మ్యూనిచ్, ఖాట్మాండు, కౌలాలంపూర్, కువైట్ సిటీ, లాగోస్, మనామా, మస్కట్, రియాద్, షార్జా, సింగపూర్, వెస్ట్ జావా, వాషింగ్టన్‌లోని దేశం వెలుపల 15 నగరాలతో సహా భారత్‌లోని 300 నగరాల్లో నిర్వహించారు. దేశంలో అండర్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్లకు ప్రవేశం కోసం క్యూట్ యుజికి ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 13.5 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గరిష్టంగా అభ్యర్థులు ఇంగ్లీష్ (8.14 లక్షలు), తరువాత కెమిస్ట్రీ (5.70 లక్షలు), జనరల్ టెస్ట్ (6.59 లక్షలు)కు హాజరయ్యారు. గత సంవత్సరం నుండి నమూనా మార్పులో, పరీక్ష కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) మోడ్‌లో మాత్రమే నిర్వహించారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

# దుష్ట కసరత్తు



లక్షలాది మంది్ని ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయేలా చేయడానికి ఒక 'దుష్టమైన కసరత్తు' అని కాంగ్రెస్ మండిపడింది. రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థను నాశనం చేయడానికి ఒక స్పష్టమైన ప్రయత్నం అని ఆరోపించింది. బుధవారం ఇండియా కూటమి పార్టీల నాయకులు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమస్యపై ఎన్నికల సంఘాన్ని కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ భారీ కసరత్తు ద్వారా రాష్ట్రంలోని రెండు కోట్లకు పైగా ఓటర్లు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల భయాలను తగ్గించడానికి మొత్తం కసరత్తును డీకోడ్ చేసినట్లు ఎన్నికల కమిషన్ గురువారం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ ప్రభుత్వం ప్రజలకు నరకం చూపించడంలో ప్రత్యేకతను చాటుకుంటుందని, లక్షలాది మంది ఓటర్లకు వారి ఓటు హక్కును కోల్పోయేలా చేయడానికి ఎస్ఆఆర్ ఒక దుష్ట కసరత్తు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అనవసరమైన తొందరపాటు అని ప్రతిపక్షాలు లేవనెత్తిన నిజమైన ఆందోళనలను పరిష్కరించడానికి వారు పూర్తిగా నిరాకరించడం, బిహార్‌లోని ఎన్నికల వ్యవస్థను నాశనం చేయడానికి స్పష్టమైన ప్రయత్నం అని అన్నారు. దీని తాము కొనసాగించనివ్వమన్నారు. ఈ హాస్యాస్పదమైన కసరత్తును వెంటనే ఆపాలని వేణుగోపాల్ డిమాండ్ చేశారు. కాగా, ఇసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కలిసి, వారు లేవనెత్తిన ఆందోళనలు, సమస్యలు, ప్రశ్నలను విని మొత్తం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను వారికి డీకోడ్ చేసింది. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్), జార్ఖండ్ ముక్తి మోర్చా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్, శివసేన (ఉద్ధవ్ థాక్రే) ప్రతినిధులు పోల్ ప్యానెల్‌ను కలిశారు. అర్హులైన పౌరులందరినీ చేర్చడానికి వీలుగా ప్రణాళికాబద్ధంగా, నిర్మాణాత్మకంగా, దశలవారీగా ఈ కసరత్తు జరుగుతోందని ఇసి పార్టీలకు తెలిపింది.

# ప్రయత్నాలు విఫలం కావచ్చు... ప్రార్థనలు కాదు

అందరూ కలిసికట్టుగా పనిచేయాలని : డికె శివకుమార్ పిలుపు



**మైసూర్ :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇచ్చిన సలహా, సూచనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ శుక్రవారం పిలుపునిచ్చారు. అయితే ముఖ్యమంత్రి అయ్యే రేసులో తాను ఇంకా ఉన్నానా లేదా అనే దానిపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. మైసూర్‌లోని చాముండి కొండలపై ఉన్న చాముండేశ్వరి దేవతకు ప్రార్థనలు చేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రయత్నాలు విఫలం కావచ్చు, కానీ ప్రార్థనలు కాదు' అని అన్నారు. సిద్ధరామయ్య,శివకుమార్ మధ్య అధికార భాగస్వామ్య ఒప్పందాన్ని ఉటంకిస్తూ, ఈ సంవత్సరం చివర్లో ముఖ్యమంత్రిలో మార్పు సాధ్యమవుతుందని రాజకీయ వర్గాలలో, ముఖ్యంగా అధికార కాంగ్రెస్‌లో కొంతకాలంగా ఊహాగానాలు ఊపందుకున్నాయి. కాగా, ఇప్పుడు ఎలాంటి చర్చలు వద్దని, రాజకీయాల గురించి మాట్లాడటానికి తాను ఇక్కడికి రాలేదన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకుంటున్నానని, మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ కాంగ్రెస్ అధ్యక్షుజని, ఆయన తమకు, సందేశం, సలహా ఇచ్చారని, ఆయన మాటలను పాటిస్తూ అందరం కలిసి పనిచేద్దామని శివకుమార్ అన్నారు. సిద్ధరామయ్య ఐదేళ్ల పూర్తి కాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని చేసిన ప్రకటన తర్వాత శివకుమార్ ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకున్నారా అనే ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర సంక్షేమం, తన కుటుంబం, అందరి సంక్షేమం కోసం తాను తన కుటుంబంతో కలిసి చాముండేశ్వరి దేవికి ప్రార్థనలు చేశానని శివకుమార్ అన్నారు. తనను ఆశీర్వదించే సమయం వచ్చిందా అని అడిగినప్పుడు, 'ప్రయత్నాలు విఫలం కావచ్చు, కానీ ప్రార్థనలు కాదు. నేను దీనిని నమ్ముతాను. నేను దేవతను ప్రార్థించాను మరియు నాకు కావలసినది కోరుకున్నాను' అని ఆయన అన్నారు. అయితే, తాను పూర్తి ఐదేళ్ల పదవీకాలం ముఖ్యమంత్రి అవుతానని సిద్ధరామయ్య చెప్పడంతో తనకు ఎటువంటి అభ్యంతరం లేదని, తాను సిద్ధరామయ్యకు మద్దతు ఇస్తానని శివకుమార్ అన్నారు. హైకమాండ్ ఆదేశాలకు కట్టుబడి ఉండడం తప్ప తనకు వేరే ప్రత్యామ్నాయం లేదన్నారు. మే 2023లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సిఎం పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య గట్టి పోటీ నెలకొంది. కాంగ్రెస్ శివకుమార్‌ను ఒప్పించి డిప్యూటీ సిఎంగా చేసింది. రెండున్నర సంవత్సరాల తర్వాత శివకుమార్ సిఎం అవుతారని 'రొటేషనల్ ముఖ్యమంత్రి ఫార్ములా' ఆధారంగా రాజీ కుదిరిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే, దీనిని పార్టీ అధికారికంగా ధృవీకరించలేదు.

**ANNOUNCEMENT NAME CHANGE**

I CHITYALA RAJAMANI W/O GODURI NARENDER, R/O. H NO 1-46, VILAGE & MANDAL PEMBI, DIST NIRMAL TS. Has Declare that CHANGE MY NAME After Marriage "CHITYALA RAJAMANI" TO "GODURI LAVANYA" My name Mentioned in SSC MEMO bearing No. DD601548, "CHITYALA RAJAMANI Hence Forth Hereafter I Would Be Known As GODURI LAVANYA, W/O. GODURI NARENDER

**ANNOUNCEMENT NAME CHANGE**

I KAKALA RAJENDHAR S/O KAKALA LINGANNA, R/o. H NO 2-84/1, VILAGE BAVAPUR K MANDAL KHANAPUR, DIST NIRMAL TS, Has Declare that CHANGE MY NAME "KAKALA RAJENDHAR" TO "KAKALLA RAJESHWER" My name Mentioned in Passport BEARING NO. K6872551, "KAKALA RAJENDHAR Hence Forth Hereafter I Would Be Known As KAKALLA RAJESHWER, S/O. KAKALLA LINGANNA



# జనరల్

STATE & REGIONAL NEWS

## అసెంబ్లీ మీడియా సలహా కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా సలహా కమిటీని (2025–27 సంవత్సరం) ఏర్పాటు చేశారు. సలహా కమిటీకి చైర్మన్‌గా ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోచైర్మన్‌గా పోలోజు పరిపూర్ణాచారితో పాటు మరో 13మందిని సభ్యులుగా నియమించారు. ఈ మేరకు సలహా కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర శాసనసభ సంయుక్త కార్యదర్శి సిహెచ్. ఉపేందర్ రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సలహా కమిటీ సభ్యులుగా ఐతరాజు రంగరావు, బొడ్లపాటి పూర్ణచంద్రరావు, లక్కడి వెంకట్ రామ్‌రెడ్డి, పోలంపల్లి ఆంజనేయులు, ఎం.పవన్ కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజనేయులుగౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీం వజాహత్, బసవ పున్నయ్య, ప్రమోద్ కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బి.హెచ్ ఎం.కె గాంధీ నియమించారు.

## ల్యాండ్ సీలింగ్ చట్టం అమలు లేదు

### పిటిషన్‌ను విచారించిన హైకోర్టు
### రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ భూముల సీలింగ్ చట్టం అమలు తీరుతెన్నులను వివరిస్తూ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్, న్యాయశాఖ కార్యదర్శులకు నోటీసులిచ్చింది. తెలంగాణలో 1973 నాటి భూసంస్కరణల (వ్యవసాయ భూముల సీలింగ్) చట్టం అమలు చేయడంలేదంటూ సింగూరు జలసాధన కమిటీ చైర్మన్ కంచరి బ్రహ్మం హైకోర్టుకు లేఖ రాశారు. చట్టంలోని మినహాయింపులను ఆసరాగా తీసుకుని కంపెనీల పేరుతో భూములను కొనుగోలు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఆర్థిక స్థితిమంతులు కొంత మంది కంపెనీల పేరుతో భూములను తమ అధీనంలో తెచ్చుకుంటున్నారు. దీని వల్ల భూముల ధరలు పెరిగిపోతున్నాయి. సాగు కోసం రైతులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండవు. సాగుకు భూమి లేక రైతు కూలీలుగా మారిపోతారు. భవిష్యత్తులో ఆహార ధాన్యాల కొరత ఏర్పడే అవకాశం కూడా ఉంటుంది. సీలింగ్ చట్టాన్ని అమలు చేయని అధికారులపై తగిన చర్యలు చేపట్టాలి.. అని రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా పరిగణించి విచారించింది. చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను 4వారాలకు వాయిదా వేసింది.

## హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాల పేరుతో నోటీసులు జారీ చేయకుండా హైడ్రా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడంపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. చెరువులు, కుంటల సరిహద్దులు నిర్ణయించకుండా, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను ఖరారు చేయకుండా అక్రమ నిర్మాణాలను కూల్చరాదని చెప్పింది. బాధితులకు నోటీసులు ఇవ్వకుండా, ఎఫ్‌టీఎల్‌ను ఖరారు చేయకుండా కూల్చరాదని చెప్పింది. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సున్నం చెరువు వద్ద హైడ్రా కూల్చివేత చర్యలను సవాల్ చేస్తూ ఎస్ఐఈటీ మారుతి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మరో ఆరుగురు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను జస్టిస్ సి.వి.భాస్కర్ రెడ్డి విచారించారు. అక్రమ నిర్మాణాలైనా తొలగించడానికి ఓ విధానం ఉంది. విలేజ్ మ్యాప్ ఆధారంగా చెరువుల హద్దులను నిర్ణయంచాలి. ఆ తర్వాత ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను నిర్ధారించాలి. ఇవేమీ చేయకుండా హైడ్రా ముందుకు వెళ్లరాదు. గతంలో ఇచ్చిన యథాతథస్థితి కొనసాగించాలి. ఆ ప్రాంతంలో బోర్ల నుంచి పిటిషనర్లు నీటిని తరలిస్తుంటే చర్యలు తీసుకోండి. ట్యాంకర్లను సీజ్ చేయండి. గుట్టలబేగంపేటలోని సర్వే నెం.12, 13, అల్లాపూర్ గ్రామంలోని సర్వే నెం.31కి సంబంధించి పిటిషనర్లు సమర్పించిన అన్ని పత్రాలను పరిశీలించాక చర్యలు తీసుకోవాలి.. అని ఆదేశించింది విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది

## బోర్డులు పెడితేనే ఉపయోగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ నిర్మాణాలు చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణాల ముందు ఇవి అక్రమ నిర్మాణాలంటూ బోర్డు పెడితే ఉపయోగకరంగా ఉంటుందని శుక్రవారం హైకోర్టు వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణదారులు అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తూనే ఉంటారని, ఆ విషయం తెలియక ప్రజలు కొనుగోలు చేసి నష్టపోతుంటారంది. అందువల్ల నిర్మాణాలు జరిగే ప్రాంతంలో ఇలా పెద్ద బోర్డులు ఏర్పాటు చేసినట్లయితే ప్రజలు కొనుగోలు చేయకపోవడంతోపాటు నిర్మాణదారులు కూడా సంస్థ ప్రతిష్ఠ దెబ్బతింటుందని నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నాకే కొనసాగించే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ మహరాజ్‌గంజ్ తోటగూడలోని అనధికారిక నిర్మాణాలపై ఉత్తర్వులు జారీ చేసినా కూల్చివేత చర్యలు చేపట్టకపోవడాన్ని సవాలు చేస్తూ జి.శ్రీనివాస్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టి జీహెచ్‌ఎంసీ వాదనల నిమిత్తం విచారణను ఈనెల 11కు వాయిదా వేశారు.

## దరఖాస్తు పెండింగ్ వయసు 25ఏళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జనగాం జిల్లాలోని కాందిశీకుల భూముల వారసులమంటూ అప్లికేషన్ పెట్టుకుని పాతికేళ్లు అయినప్పటికీ దానికి మోక్షం కల్పించని అధికారికి హైకోర్టు రూ.50 వేలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సైనిక సంక్షేమ నిధికి చెల్లించాలని ఆదేశించింది. రద్దయిన ఎవాక్యూ ఇంటరెస్ట్ విభజన చట్టం–1951 కింద అప్లికేషన్ పెట్టుకుంటే అధీకృత అధికారి పరిష్కరించలేదు. దీంతో బాధితురాలు హైకోర్టులో పిటిషన్ వేయడంతో జస్టిస్ సివి భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారించారు. అప్లికేషన్‌ను 3 నెలల్లోగా పరిష్కరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. జనగాం ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఫాతిమా బేగం వారసులు సేల్ సర్టిఫికెట్ కోసం అప్లికేషన్ పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో అబుల్ ఖైర్ నసీరుద్దీన్ కమ్రాన్ హైకోర్టును ఆశ్రయించారు. భూయజమానులు పాకిస్థాన్ వెళ్లిపోయినప్పుడు వాళ్ల ఆస్తులను కాందిశీకుల చట్టం కింద అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. వారి సోదరి సలేహా ఫాతిమా బేగం మన దేశంలో ఉండటంతో భూములకు సేల్ సర్టిఫికెట్ పొందారు. అయితే దీనిని1962లో రద్దు చేయడంతో హైకోర్టుకు వచ్చారు. అధీకృత అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్న ఉత్తర్వుల మేరకు 2000లో ఆమె అప్లికేషన్ పెట్టుకున్నారు. ఇది ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో మళ్లీ హైకోర్టుకు రావడంతో పైవిధంగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

## అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో..
## ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న ప్రభుత్వంపై పోరాడాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరావు స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడాలని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకొని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ అల్లూరి సీతారామారాజు ఆశయాలకు అనుగుణంగా నేటి యువత పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని సాయిబాబా కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, భాను ప్రకాష్, రవి పాల్గొన్నారు.

## 'బనకచర్ల ప్రాజెక్ట్'ను ముందుకు తీసుకెళ్తే
# తెలంగాణ ప్రజలు ఊరుకోరు

### ప్రొఫెసర్ కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి వ్యతిరేకంగా బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాన్ని తెలంగాణ ప్రజలు ఊరుకోబోరని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా టిజెఎస్ పోరాటం చేస్తుందన్నారు. ''గోదావరి జలాలు బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ కోణం'' అనే అంశంపై హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంజనీర్ దొంతుల లక్ష్మీ నారాయణ బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలను,కేంద్ర ప్రభుత్వ వైఖరి, విభజన చట్టం ఉల్లంఘనలు, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని విశ్లేషణాత్మకంగా వివరించారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నీటి అన్యాయం నుంచి తెలంగాణ ఇప్పటికీ విముక్తి పొందలేదని, పోలవరం, బనకచర్ల లింక్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను పెన్నా బేసిన్ వైపు మళ్లించేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర హక్కులకు హానికరమన్నారు. విభజన చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రతి తెలంగాణ బిడ్డ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో టిజెఎస్ నాయకులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వరరావు, సయ్యద్ బద్రుద్దీన్, అంబటి శ్రీనివాస్, ధర్మజన్, బైరి రమేష్, గొప్పగాని శంకర్‌రావు, పల్లె వినయ్ కుమార్, నిజ్జెన రమేష్ ముదిరాజ్ , ఆశప్ప, ఎం.నరసయ్యగౌడ్, కంది మోహన్‌రెడ్డి, లక్ష్మి , ప్రకాష్ గౌడ్, సలీం పాషా, అరుణ్ కుమార్, ఆంజనేయులు, దారా సత్యం, శ్యామ్‌సుందర్, ప్రశాంత్, రామ్‌చందర్, కొత్త రవి తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ఔట్‌సోర్సింగ్
# ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి నూతన కమిటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ఔట్ సోర్సింగ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి నూతన కమిటీని ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ జన సమితి అనుబంధ కార్మిక విభాగం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలిసభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం వెల్లడించారు. నాంపల్లి టిజెఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌పోర్ట్ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జహీర్ అధ్యక్షుడిగా కె. బాలరాజును ప్రధాన కార్యదర్శిగా జగదీష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ జిహెచ్‌ఎంసిలో కార్మికులందరూ సామాజిక బాధ్యతను కుటుంబ బాధ్యతగా స్వీకరిస్తున్నారని, వారి పనికి సరైన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జిహెచ్‌ఎంసిలో కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడానికి మన యూనియన్ పని చేయాలని సూచించారు. తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య మాట్లాడుతూ రానున్న కాలంలో నగరవ్యాప్తంగా యూనియన్ బలోపేతం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జన సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇప్పించడంలో కోదండరాం కృషి చేశారన్నారు. ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కరించామని మరికొన్ని సమస్యలను కోదండరాం సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీకి ఉపాధ్యక్షులుగా బి. యాదగిరి, సయ్యద్ ఫయాజ్, జె.డి. కుమార్, బి. రాజు భూపతి, బి. అశోక్‌లను ఎన్నుకోగా అదనపు కార్యదర్శిగా టి. మురళి, కార్యనిర్వాహక సి.హెచ్. కృష్ణ, కోశాధికారిగా భగవతి రెడ్డి, మహిళా కార్యదర్శిగా వరలక్ష్మి లను ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 15 మంది కమిటీ సభ్యులను వివిధ జోన్ అధ్యక్షులను నూతనంగా ఎన్నుకున్నారు.

# చేప పిల్లల పంపిణీ మత్స్య సొసైటీలకే అప్పగించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మత్స్య పరిశ్రమలో మధ్య దళారీలకు తావులేకుండా మత్స్య సొసైటీలు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్నఉచిత చేప పిల్లలు పంపిణీ పథకాన్ని టెండర్ల ద్వారా మళ్ళీ దళారీలను అప్పగించడం సరైంది కాదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఈ పథకాన్ని టెండర్ల ద్వారా కాకుండా నేరుగా మత్స్య సొసైటీల ఖాతాలో నగదు జమ చేసి మత్సకారులు లబ్దిపొందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి గురువారం జాన్ వెస్లీ లేఖ రాశారు. మధ్యదళారీ విధానం పోవాలనే లక్ష్యం కోసం అమలు చేస్తున్న ఈ పథకం టెండర్ల బోగస్ వ్యక్తులు, సంస్థలు టెండర్లు దక్కించుకుంటుండడంతో దాదాపు 70శాతం వరకు అవినీతి జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. టెండర్లు దక్కించుకున్న దళారీలు తక్కువ సైజులో నాసిరకం చేప,రొయ్య పిల్లలను వదులుతుండడంతో సరైన సైజు పెరగకపోగా జూన్,జూలై మాసాలలో వదలాల్సిన చేప,రొయ్య పిల్లలను సెప్టెంబర్ నుండి నవంబర్ నెల వరకు ఆలస్యంగా వదులుతున్నారని తెలిపారు. దీంతో మార్చి నెల నాటికే చెరువులు, కుంటలు ఎండిపోయి పక్షులు తినటం వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతుని ఆయన పేర్కొన్నారు . ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురువగడంతో 80శాతం జలాశయాలు చేపల పెంపకానికి సిద్దంగా ఉన్నాయని,తక్షణమే చేప పిల్లలను వదిలేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఉద్యోగాలు అడిగితే నిర్బంధిస్తారా : సిపిఐ(ఎం)**
ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలండర్ విడుదల చేయడంతో పాటు ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనా కార్యక్రమంలో ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ ఖండించింది. తక్షణమే అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఉద్యోగాలు అడిగితే నిర్బంధిస్తారా అని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రశ్నించారు. .పెండింగ్ లో వున్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు.. నేడు నిరుద్యోగ జెఎసి ఇచ్చిన నిరసన కార్యక్రమాలకు సిపిఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.



## డిజిపి కార్యాలయంలో మాజీ గవర్నర్ రోశయ్య జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర డిజిపి కార్యాలయంలో మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ ఎం. భగవత్, కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవ వందనం సమర్పించారు. కొణిజేటి రోశయ్య రాజనీతిజ్ఞత, సరళత, అంకితభావంతో కూడిన ప్రజా సేవను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సుదీర్ఘమైన, విశిష్టమైన కెరీర్‌లో పాలన, ప్రజా పరిపాలనకు ఆయన చేసిన అమూల్యమైన కృషిని సిబ్బంది చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఐడి, కోఆర్డినేషన్ ఐజిపి ఎం శ్రీనివాసులు, సివిఎస్ఓ సి హెచ్ యోగేశ్వర్ రావు,డీఎస్పీలు ఉదయ భాస్కర్, ఏ .వేణుగోపాల్ , డిజిపి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాత్రి 9 వరకే 'స్పా' సెంటర్లు

### ఆదేశాలు జారీ చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్పా సెంటర్లలో అక్రమాలను అరికట్టేందుకు పోలీసులు కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మదాపూర్ జోన్‌లోని స్పా కేంద్రాల యజమానులతో పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఎహెచ్‌టియు), లా అండ్ ఆర్డర్ విభాగం, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్(ఎస్‌ఒటి) అధికారులు కలిసి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల భద్రత, ట్రాఫికింగ్ నివారణ, చట్టబద్ధ కార్యకలాపాలపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే స్పా కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలోనే స్పా సెంటర్ల నిర్వాహకులకు పోలీసులు పలు నిబంధనలు సూచించారు. అందులో భాగంగా స్పా కేంద్రాల్లో లైంగిక కార్యకలాపాలు నిర్వహించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని తెలిపారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 లోపు స్పా నిర్వహించుకునేలా అధికారుల సూచనలు చేశారు. నివాస ప్రాంతాల్లో స్పా సెంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. స్పా ఉద్యోగులకు ఫిజియోథెరపీ, అక్యుప్రెషర్ లాంటి వాటిపై అర్హత ఉండాలన్నారు. ఉద్యోగుల వివరాల రిజిస్టర్, పనిచేసే ఉద్యోగుల వయస్సు కనీసం 18 ఏళ్లు ఉండాలి. కస్టమర్ల పేర్లు, అడ్రస్ పొందుపరిచే రిజిస్టర్ సైతం ఉండాలి. పని సమయాల్లో ప్రవేశ ద్వారం ఓపెన్గానే ఉండాలి. లైసెన్స్ నెంబర్, సెంటర్ పేరు, ఫీజుల వివరాలు స్పష్టంగా చూపించాలి. ప్రవేశద్వారం వద్ద సిసిటివి, రిసెప్షన్, కామన్ ఏరియా వంటి సౌకర్యాలు ఉండాలని అధికారులు స్పా యజమానులకు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో మాదాపూర్ డిసిపి వినీత్, మహిళా శిశు భద్రతా విభాగం డిసిపి సృజన, ఎస్‌ఒటి డిసిపి శోభన్ తదితర అధికారులు, స్పా యజమానులు హాజరయ్యారు.

## జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో..
# దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర వినగానే మొదటగా గుర్తొచ్చేది తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి, విముక్తి కోసం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని, ఆయన పోరాటం మరువలేనిది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు అనురాగ్ జయంతి, సి.ఎన్. రఘు ప్రసాద్, గీతా రాధిక, వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, చీఫ్ అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

**శంషాబాద్ కురుమ సంఘం ఆధ్వర్యంలో..**
శంషాబాద్ కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ తొలి పోరాట యోధుడు అమరుడు దొడ్డి కొమరయ్య



79వ వర్ధంతి సందర్భంగా మామిడిపల్లి జంగయ్య ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ నాయకులు కర్రె మధుసూదన్ కుర్మ , శీలం కృష్ణ, కడల అనిల్ కుమార్, విజయ్ కుమార్, బుడుగు మహేందర్, శంషాబాద్ మున్సిపాలిటీ కురుమ సంఘం నాయకులు, మండల నాయకులు నివాళి అర్పించారు.

# గ్రూపు–1పై విచారణ 7కి వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రూప్–1 పరీక్షలపై దాఖలైన పిటిషన్‌లు విచారణార్హం కావని, వాటిని కొట్టివేయాలని అర్హత సాధించిన సుమారు 260కి పైగా అభ్యర్థులు హైకోర్టుకు నివేదించారు. పిటిషన్‌లు వేసిన వారు అర్హత సాధించలేదని, అందువల్ల వారికి ఏ రకంగా నష్టం వాటిల్లిందో చెప్పనందున ఈ పిటిషన్ వేసే అర్హత వారికి లేదన్నారు. గ్రూప్–1 పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు శుక్రవారమూ విచారణను కొనసాగించారు. ఈ పిటిషన్‌లలో ప్రతివాదులుగా చేరిన ఎంపికైన అభ్యర్థుల తరపు సీనియర్ న్యాయవాది కె.లక్ష్మీనరసింహ తదితరులు వాదనలు వినిపిస్తూ ఇవి ప్రజాప్రయోజనాలకు విరుద్ధమన్నారు. 2022లో పరీక్షలు కాపీయింగ్ జరిగిందని ప్రభుత్వం రద్దు చేయగా, అనంతరం బయోమెట్రిక్ నమోదు చేయలేదన్న కారణంగా హైకోర్టు మరోసారి రద్దు చేసిందన్నారు. గత 14 ఏళ్లుగా నియామకాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. గ్రూపు–1 అధికారులు లేక మరోవైపు రాష్ట్ర పాలన కుంటుపడుతోందన్నారు. రెండు హాల్ టిక్కెట్‌ల జారీ వల్ల పిటిషనర్లకు ఏం నష్టం వాటిల్లిందో చెప్పలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేసి నియామకాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రస్తుతం ఈ ఉద్యోగం రాకపోతే రోడ్డు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. నియామక ప్రక్రియ తుది దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించారు. దీనిపై సోమవారం వాదనలు కొనసాగనున్నాయి.

# అనుభవం సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది

### ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టెక్నాలజీపై అవగహన లేకున్నా.. అనువభంతో ఎక్సైజ్ శాఖకు నిత్యం ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాన్ని పదవీ విరమణ పొందిన జాయింట్ కమిషనర్ కెఎబి శాస్త్రి చూపించేవారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరి కిరణ్ అన్నారు. సిఐ నుంచి జాయింట్ కమిషనర్‌గా స్థాయికి ఎదిగి రిటైర్డ్ అయిన కెఎబి శాస్త్రికి ఎక్సైజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో పదవీ విరమణ వీడ్కోల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..తొమ్మిది నెలల నుంచి శాస్త్రి పనితీరును పరిశీలించినపుడు ఎప్పుడు కోపం, విసుగు తెచ్చుకున్న సంఘటనలు నాకు కనిపించ లేదని అన్నారు. ఆయన అనుభవం సంస్థకు దూరం అవుతుందనే విషయం ఇబ్బందిగా ఉన్నా.. రిటైర్డ్‌మెంట్ అనేది తప్పనిసరికావడంతో ఏమి చేయలేక పోతున్నామని అన్నారు. 36 సంవత్సరాల అనుభవం ఎక్సైజ్‌శాఖ ఎక్సైజ్‌శాఖకు ఎంతో ఉపయోగ పడిందని అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సురేష్ రాథోడ్‌తో పాటు రిటైర్డ్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు హజరయ్యారు.

# రెండు కేసుల్లో 4కిలోల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీంలు దూల్‌పేట్, సరూర్‌నగర్‌లో దాడులు నిర్వహించి4.126 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్‌టిఎఫ్ సి టీం సిఐ వెంకశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హల్మాస్‌గూడకు చెందిన సాబావత్ హనుమా గంజాయి విక్రయిస్తుండగా ఎస్‌టిఎఫ్ సి టీం ఎస్ఐ శోభారాణి దాడి చేసి పట్టుకున్నారు. అతని నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు అప్పటించారు. అలాగే దూల్‌పేట్‌లోని గంజాయి విక్రయిస్తున్న ఓ ఇంటిపై దాడి చేయగా 1.126 గంజాయినిన స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌టిఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో మాయభాయ్ అనే మహిళను అరెస్టు చేశారు.

# చంచల్‌గూడ జైలులో డి-అడిక్షన్ సెంటర్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మత్తు పదార్థాలకు బానిసైన ఖైదీలలో పరివర్తన కల్పించేందుకు చంచల్‌గూడ సెంట్రల్ జైలులో నివృత్తి (డిఅడిక్షన్) సెంటర్ ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివృత్తి సెంటర్‌ను ప్రారంభించడం జైళ్ల సంస్కరణల చరిత్రలో ఒక మైలురాయి అని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన ఖైదీలు ఈ సెంటర్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. జైలు నుంచి విడుదలైన తరువాత సమాజం వారిని చూసి ఘర్వపడేలా కావాలని సూచించారు. వారిని తమ జీవితాలను నాశనంచేసుకోకుండా కాపాడవచ్చునిచెప్పారు.మత్తు పదార్థాలు సమాజంలో అనేక మార్గాల ద్వారా వస్తున్నందున వాటి సరఫరాపై గట్టి నిఘా చర్యలు తీసుకోవాలనిఅన్నిశాఖలకూ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనితారామచంద్రన్, టిజిన్యాబ్ డైరెక్టర్ సందీప్‌శాండిల్యా, జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్యమిశ్రా తదితర అధికారులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పంపిణీ



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొడంగల్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండల కేంద్రంతో పాటు పెద్దపూర్, మన్నపూర్, నీటిగంత, భూనీడ్‌లలో ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు శుక్రవారం రోజు కొత్తపల్లి ఎంపీడీవో కృష్ణారావు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 66 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ ముస్లిం మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, షేక్ మీరాన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం.. కాడెద్దుల మృతి



**ఉట్కూరు మండలం/ప్రజాపక్షం:** ఉట్కూరు మండలం పెద్దపోర్ల గ్రామానికి చెందిన పాపలి లచ్చప్ప ఎద్దులు వర్షభావ పరిస్థితుల దృష్ట్యా తన సొంత గుడిసెలో తాత్కాలికంగా కట్టేయడం జరిగింది. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకుని రెండు కాడెద్దులు, దాదాపు 100 పైగా నాటు కోళ్ళు, ఒక బైక్, గడ్డి వాములు, ఇతర సామాగ్రి లక్ష రూపాయలు విలువ చేసే రసాయనిక పొలాల ఎరువులు మొత్తం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఎద్దులు చనిపోయాయి. ఈ ప్రమాద స్థలాన్ని అధికార యంత్రాంగం, ప్రభుత్వ పెద్దలు సందర్శించి నష్టపోయినటువంటి, రైతుకు ప్రభుత్వం నుండి పరిహారం చెల్లించి ఆ కుటుంబానికి అండగా నిలబడి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/ కొత్తపల్లి :** కొత్తపల్లి మండలం కొత్తపల్లి తాండ పరిధిలోని సర్వే నంబర్ 58లో గల తెల్ల పలుగు, నిమలికుచ్చ అని పిలువబడే ప్రభుత్వ భూములు (పొరంబోకు) అక్రమాలకు గురవుతున్నాయని కొత్తపల్లి తాండ, భోజంద తండాకు చెందిన ప్రజలు శుక్రవారం కొత్తపల్లి ఎంపీడీవో కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమికి చుట్టుపక్కల ఉన్న రైతులు ఆక్రమించుకుంటున్నారని, అట్టి భూమిలో అధికారులు సరిహద్దులు ఏర్పాటు చేసి మొక్కలు నాటితే ప్రభుత్వ భూమిని కాపాడుతుందని పాటు, వృక్ష సంపదను పెంచినట్టు అవుతుంది అన్నారు. భూమిని ఆక్రమించిన రైతులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు



**ప్రజాపక్షం/నర్వ:** నర్వ మండలంలోని పాతర్చేడ్ గ్రామ శివారులో గల శుక్రవారం మధ్యాహ్నం ముష్టి శేఖర్ వ్యవసాయ పొలంలో చెట్టు కింద జంగంరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దుప్పల్లి సాయి, మెట్ల గోపాల్, మెట్ల బాబు, మెట్ల భగవంతు, జట్రం నందు డబ్బులు బెట్టింగ్ పెట్టి పేకాట ఆడుతుండగా నర్వ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 5280 రూపాయలు బెట్టింగ్ పెట్టి ఆడుతున్న నగదును స్వాధీనపరుచుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై పి.రమేష్ తెలిపారు.

## పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



చైర్‌పర్సన్ పుష్పలత

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పురపాలిక పరిధిలోని 27వ వార్డు ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలోని అంగన్వాడి కేంద్రాన్ని పుర చైర్ పర్సన్ కోనేటి పుష్పలత సందర్శించారు. శుక్రవారం నాడు ఆమె పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరైన స్థలంలో బాత్రూం నిర్మాణం చేపట్టాలని సూచించారు. అలాగే పాఠశాలలోని బోరు మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను పరిశీలించారు. కౌన్సిలర్ కుమ్మరి రాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పైప్‌లైన్ కాలువ తీస్తుండగా మట్టి దిబ్బ కూలి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** బీమా ప్రధాన కాలువ నుంచి వ్యవసాయ బావికి పైపులను తీస్తుండగా బీమా కాలువ వద్ద మట్టి దిబ్బ కూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కె. రాణి కథన ప్రకారం వీపనగండ్ల గ్రామానికి చెందిన బాపూజీ గౌడ అనే వ్యవసాయరైతు గ్రామానికి సమీపంలోని బీమా ప్రధాన కాలువ నుండి తన వ్యవసాయ బావికి పైపు లైన్ వేయడానికి జేసిబితో పైపులైన్ కాలువను తవ్విస్తున్నాడు. రైతు బాపూజీ గౌడ్ వద్ద గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయ పనుల నిమిత్తం కూలీగా పని చేస్తున్న నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భోగమోని పల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (40) బీమా కాలువ వద్ద పైప్ లైన్ కోసం తవ్విన కాలువ వద్ద పైప్‌లైన్ కోసం తవ్విన కాలువలో దిగి పారతో మట్టిని పైకి తీస్తుండగా ఒక్కసారిగా మట్టి దిబ్బలు వెంకటేష్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. జేసిబి సహాయంతో మట్టిని తవ్వి మృతి చెందిన వెంకటేష్‌ను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య గోవిందమ్మ, కూతురు, ఇద్దరు కూమారులు ఉన్నారు.

## ముగిసిన వారాహి గుప్త నవరాత్రులు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ దేవి సన్నిదానంలో శ్రీ వారాహి గుప్త నవరాత్రులు చివరి రోజు సందర్భంగా ఆలయంలో కాశిరెడ్డి, నాగిరెడ్డి సౌజన్యంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారు ఎనిమిది రోజుల పాటు అభిషేకాలతో ప్రత్యేక అలంకరణలతో, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చింది. చివరి రోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి పంచవస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రీ వారాహి దేవి అమ్మవారికి నోట్ల కట్టలతో అలంకరించి , శ్వేతా వారాహి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. సాయంత్రం మహిళలచే దీపాలంకరణతో, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తరాలు కుంకుమార్చన , లలిత సహస్రనామ పారాయణం ప్రత్యేక మంగళహారతులు, భజన సంకీర్తనలతో మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అల్పార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రె స్వామి, టిటిడి సేవకులు సితార వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎల్లయ్య, ప్రదీప్ గౌడ్, బాలవర్ధన్, నారాయణ, శాంతన్న, అనిల్, కుమార్ గౌడ్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెంచుగ్రామాల్లో పారదర్శకంగా ఇండ్ల నిర్మాణాలు

కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** చెంచుగ్రామాల్లో ఇండ్లనిర్మాణాన్ని పారదర్శకంగా చేపట్టాలని, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య వసతుల కోసం ప్రత్యేకచర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని, చెంచుపెంటల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల నిర్మాణాలను వేగవంతంచేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో చెంచుల ఇండ్ల నిర్మాణాలు, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల విద్య సదుపాయాలపై ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ గోపిడితోకలిసి ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్లు, ఎంపిడిఓలు, ఎంపివోలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏనిమిది మండలాల పరిధిలో ఉన్న చెంచుగ్రామాల చెంచుప్రజలకు శాశ్వతగృహాలు మంజూరు నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెంచుపెంటల్లో ఇదివరకే గుర్తించిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల నిర్మాణాల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా అమలుచేయాలన్నారు. చెంచులు ఎవరూకూడా శాశ్వతగృహాలు లేకుండా ఉండరాదని, రాష్ట్రప్రభుత్వం సంకల్పంగా ఇండ్ల నిర్మాణ ప్రక్రియలను చేపట్టిందని, అదేస్ఫూర్తితో జిల్లాలో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అప్పాపూర్ చెంచుపెంటలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలలో 30మంది విద్యార్థుల నుండి 110మంది విద్యార్థుల నమోదుకు కృషిచేశారని అన్నారు.

**విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక ఆదేశాలు :**

తెలకపల్లి మండలకేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బిసి బాలుర, బాలికల సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలను శుక్రవారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు గురుకులాల్లో అందించే వసతులు, ఉపాధ్యాయుల హాజరు, భోజనసౌకర్యం తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ నేరుగా విద్యార్థులతోనే ఆరాతీశారు. బియ్యాన్ని పరిశీలించి, ఇతర సరఫరా స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కలెక్టర్‌వెంట ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

**కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం :**

పశువులను మేపుతూ కూడా చదువుపై చూపిన అతని అంకితభావం అమోఘమని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బాలకార్మికుడిగా ఉంటూ



పిహెచ్‌డి పట్టా సాధించిన పరమేష్‌ను అభినందించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన పరమేష్ కార్మికుడిగా ఉంటూ 14 ఏళ్లకు పాఠశాలలో ఏడోతరగతిలోచేరి బ్రిడ్జికోర్సు పద్దతిలో విద్యనభ్యసించి పిహెచ్‌డి సాధించిన సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పరమేష్‌ను అభినందించి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువులకాపరిగా ఉంటూ 14 ఏళ్ల తర్వాత నేరుగా ఏడో తరగతిలో పాఠశాలలో చేరి నేడు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటిలో పిహెచ్‌డి పూర్తి చేశారన్నారు. నేడు డాక్టరేట్ సాధించి ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు.

# జ్యోతిబాపూలే, గురుకుల పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీలు

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని (కోటకొండకు సంబంధించిన) పీఎం మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్సియల్ పాఠశాల, సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. ముందుగా కోటకొండ రెసిడెన్సియల్ పాఠశాలకు వెళ్లిన కలెక్టర్ ఆ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల సంఖ్య విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేవని, అద్దె భవనం కావడంతో యజమానిని అదనపు గదులను నిర్మించాలని కోరినట్లు ప్రిన్సిపల్ కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థినిల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అదనపు గదులను నిర్మించాలని యజమానికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు వస్తాయని అంతలోపు మీరు అదనపు గదులను నిర్మించాలని యజమానికి చెప్పారు. అనంతరం స్థానికంగా గల సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి మాలతో పాఠశాల/కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినుల సంఖ్య వివరాలను తెలుసుకున్నారు. ఇంటర్ తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ ఎలా చదువుతున్నారని, మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. డిజిటల్ తరగతి గదిని, పాఠశాల ఆవరణలోని కిచెన్ గార్డెన్‌ను ఆమె పరిశీలించారు. పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తు ఎక్కువ లేకపోవడం కొంత సమస్యగా మారుతోందని ఎత్తు పెంచి నిర్మింపచేస్తే సమస్య ఉండదని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు తెలిపారు. తర్వాత డైనింగ్ హాల్‌కు వెళ్లి మెస్ రికార్డులను, మెనూ చార్ట్‌ను



కలెక్టర్ పరిశీలించారు. మెనును క్రమం తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు.

**ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు**

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడి జిల్లా కలెక్టర్‌లోని ప్రజావాణి హాల్‌లో దివంగత రోశయ్య 92వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో జయసుధ, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, ఎస్సీ కార్పోరేషన్ ఈడి అబ్దుల్, ఖలీల్, డీపీఆర్ఓ, రషీద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై పనిగట్టుకొని దుష్ప్రచారం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గం ప్రజల గుండెల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కొలువై ఉన్నారని, ఫేక్ సర్వేల పేరిట టిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై దుష్ప్రచారం ఎంతవరకు సమంజసమని తెలంగాణ యూత్ కాంగ్రెస్‌రాష్ట్ర నాయకులు సొంటం శశికుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యావేత్త అయిన ఎమ్మెల్యే గత 9ఏళ్లుగా ఎమ్మెల్సీగా ప్రస్తుతం ఎమ్మెల్యేగా కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా రాత్రి, పగలు ప్రజలకోసం శ్రమిస్తున్న నాయకుడని కొనియాడారు. బిఆర్ఎస్ నాయకులు కుట్రపూరితగా ఎమ్మెల్యేపై పనిగట్టుకొని దుష్ప్రచారానికి దిగుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికసంస్థల ఎన్నికలలో ప్రజలు క్షేత్రస్థాయిలో ఓటుద్వారానే బిఆర్ఎస్‌కి తగిన బుద్ధిచెబుతారని అన్నారు.

## శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల



**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని నిజాంబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 40 సంవత్సరాలక్రితం నిర్మించిన పాఠశాల స్లాబ్‌పై పెచ్చులు ఊడిపోయి వర్షపు నీరు రావడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదోతరగతి వరకు ఉన్న పాఠశాలలో తరగతి గదులు లేక 30మంది విద్యార్థులను వరండాలోనే ఒకేదగ్గర ఉపాధ్యాయులతో విద్యాబోధన నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్థానిక ఎమ్మెల్యే స్పందించి నూతన పాఠశాలభవనంతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్




**ప్రజాపక్షం/మక్తల్:** ప్రభుత్వం నిర్వహించిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 33వ రోజు మక్తల్ పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ ఆఫీసర్ హెల్త్ క్యాంప్ నిర్వహించి పారిశుద్ధ్య కార్మికులకు ఇతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మూడవ వార్డులో యస్‌సి కమ్యూనిటి హాల్, కేంచ్చమ్మ గుడి తదితర ప్రాంతాలలో కార్మికులు యాన్తి లార్వా స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు, మహిళా సంఘం సభ్యులు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భయంకరంగా హైమాస్ట్ లైట్లు

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని నారాయణపేట క్రాస్ రోడ్డులో హైమాస్ట్ లైట్లు గాలికి ఊగుతూ ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం కావడంతో వాహనదారులు బాటసారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులపై పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సరిగ్గా బిగించకపోవడంతో గాలికి ఊగుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే ఊగుతున్న హైమాస్ట్ లైట్లను సరిచేయాలని ప్రజలు కోరారు.

# టాస్క్ సెంటర్ స్కిల్ వర్సిటీకే అనుసంధానం చేస్తాం



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** మహబూబ్ నగర్ టాస్క్ సెంటర్‌ను హైదరాబాద్ లోని స్కిల్ విశ్వవిద్యాలయానికి అనుసంధానం చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ శిక్షణా కేంద్రాన్ని (ఐఎఎస్‌కే) ఆయన ముఖ్య అతిథిగా హాజరైఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్దపల్లి తర్వాత రెండవది మన మహబూబ్‌నగర్ టాస్క్ సెంటర్ అని, ఆయన గుర్తు చేశారు. మహబూబ్ నగర్‌లోని టాస్క్ సెంటర్‌లో అన్ని రకాల కోర్సులకు అడ్వాన్స్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని, ఇంటర్మీడియట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులు ఎవరైనా టాస్క్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందవచ్చు అని ఆయన చెప్పారు. టాస్క్ శిక్షణా కేంద్రంలో మొదటి బ్యాచ్ లో 50 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారని ఆయన చెప్పారు. మొట్టుగడ్డ ప్రాంతంలోని వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌కు కేటాయించిన స్థానంలో టాస్క్ సెంటర్ కోసం శాశ్వత భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే సంవత్సరంలోగా టాస్క్ నూతన భవనం అందుబాటులోకి వస్తుందన్నారు. అంతకుముందు పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేసే ఎమ్మెల్యే మహబూబ్‌నగర్‌కు దొరకడం వల్లనే మహబూబ్‌నగర్‌కు అనేక విద్యాసంస్థలు వస్తున్నాయన్నారు. టాస్క్ సిఇవో శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషి ఫలితం గానే శుక్రవారం మహబూబ్ నగర్ కు టాస్క్ సెంటర్ వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, మున్సిపల్ కార్పొరేసన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్, డిఐఇఓ కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో అక్రమాలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి మండల కేంద్రంలోని మన్నాపూర్ వాగులో 10 కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి వాగులో ఉన్న ఇసుక వాడుకోవడానికి అనుమతులు ఉన్నాయని నిర్మాణం జరుగుతున్న ప్రదేశం నుండి అర కిలోమీటర్ దూరం వరకు ఇసుకను తవ్వుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్ సిబ్బంది ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పక్కదారి పట్టిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థానిక తహసిల్దార్ అనుమతులు ఇస్తున్నా. బ్రిడ్జి నిర్మాణం చేసే కాంట్రాక్టర్ పక్కదారిలో ఇసుకను విక్రయిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పేరుతో అక్రమ వ్యాపారం చేసే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పంచముఖి వారాహి మాత నవరాత్రి ఉత్సవాలు ముగింపు

**ప్రజాపక్షం/నారాయణపేట:** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలోని బిజ్వార్‌లో గ్రామంలోని అంబాత్రయ క్షేత్రంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన పంచముఖి వారాహి మాత నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. అంబాత్రాయ క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి ఆధ్వర్యంలో మొదటిసారి పంచముఖి వారాహి మాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ పూజలు యజ్ఞాలు అభిషేక కార్యక్రమాలు 18 మంది ఆచార్యుల చేతుల మీదుగా జపము, దర్పణం, 18వేల వారాహి మాత మూల మంత్రం అవనం కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ నవరాత్రులలో అమ్మవారిని దర్శించుకున్న వారికి సర్వ శత్రు నివారణ సర్వ భాదలు నివారణ సర్వరోగ నివారణలతో పాటు సర్వసం పదలు కూడా సిద్దిస్తాయని తెలిపారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

# తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి/నాగర్ కర్నూల్ ప్రతినిధి/బిజినేపల్లి:** తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతి సందర్భంగా సురవరం వెంకట్రాం రెడ్డి భవన్ సిపిఐ ఆఫీస్‌లో వారి చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాల్‌కిషన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, ఏఐవైఎఫ్ కో కన్వీనర్ మహేష్, పట్టణ నాయకులు ఆనంద్ నరహరి శ్రావణ్ కుమార్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.



**కలెక్టర్ కార్యాలయంలో మాజీ సిఎం కె.రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్‌గా వ్యవహరించిన కోణిజేటి రోశయ్య జయంతిని, తెలంగాణ సాయుధ పోరనాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను జరిపారు. రోశయ్య, దొడ్డి కొమురయ్య చిత్రపటాలకు స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మ న్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శంకరా చారి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జి.శ్రీనివాస్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పి.డి. వైద్యం భాస్కర్, కలెక్టరేట్ ఏఓ సువ ర్ణ రాజ్ ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.




తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డికొమురయ్య వర్ధంతి వేడుకలను నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవనంలో బిసిహక్కులసాధన సమితిసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొట్ర శేఖర్, సుధాకర్, సునిల్ పాల్గొన్నారు.



తెలంగాణ రైతాంగసాయుధ పోరాటం ఒక మహత్తర పోరాటంలో నైజాం సైన్యానికి దొరలు దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో నేలకొరిగిన విప్లవవీరుడు దొడ్డి కొమరయ్య అని సిపిఎం జిల్లాకార్యవర్గసభ్యులు గుంపల్లి అశోక్ అన్నారు. శుక్రవారం దొడ్డికొమురయ్య వర్ధంతి సందర్భంగా బిజినేపల్లి మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి హన్మంతు, రాములు, వెంకటేష్, మహేష్, చంద్రశేఖర్, మహమూద్ పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణానికి బడ్జెట్ పెంచాలి



**ప్రజాపక్షం/ మునుగోడు:** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ బడ్జెట్ ఇవ్వడం కారణంగా సిమెంట్, కంకర, స్టీల్, మేస్త్ర రేట్లు విపరీతంగా పెరిగి ఇల్లు పూర్తయ్యే పరిస్థితి లేదని,మరికొంత బడ్జెట్ పెంచి ఇందిరమ్మ ఇల్లు పూర్తి అయ్యేటట్లు చూడాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు, ఎలగలగూడెం గ్రామమాజీ సర్పంచ్ సురిగి చలపతి గౌడ్ ప్రభుత్వానికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎలగలగూడెం గ్రామంలో ఈదులకంటి మంజుల శేఖర్ ఇందిరమ్మ ఇంటికి ముగ్గ పోసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇల్లు మంజూరు చేయాలని గతంలో బేస్మెంట్ స్లాబ్ నిర్మాణం చేసుకున్న వారికి కల్పించి ఇండ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్లు కట్కూరి లింగస్వామి, మంజుల, సైదులు, ఉదయ్, శేఖర్, యాదయ్య, మేస్త్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## డార్మెటరీ బ్లాక్ పనుల తనిఖీ



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలోని గిరిజన బాలికల మిని గురుకులాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మిని గురుకులంలో విద్యార్థులకు ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించి సౌకర్యాలపై గిరిజన సంక్షేమ రిజినల్ కో ఆర్డినేటర్ బలరాంనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గురుకులానికి డార్మెటరీ బ్లాక్ కావాలని, తాగునీటి సమస్యఉందని ఆర్‌సివో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న డార్మెటరీ బ్లాక్ పనులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్డివో రమణారెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మి , నవీన్, అనిల్, మమత, ఇంచార్జీ హెడ్మాస్టర్ కవిత, చందంపేట ఎంపిడివో తదితరులు ఉన్నారు.



## సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ చీఫ్ఇంజనీర్ ఆదేశానుసారం ప్రాజెక్టు అధికారులు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకునాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు మొదటి దఫాగా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఆ తర్వాత దానిని క్రమంగా పెంచుకుంటూ సాయంత్రం వరకు 3000 క్యూసెక్కుల నీటిని నాలుగు రోజులపాటు ఒక టీఎంసీ చొప్పున నీటిని విడుదల చేయడం జరుగుతుందని , ఈ నీటిని పాలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలకు కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం మాత్రమే విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## విద్యార్థులకు మంచి విద్య

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి విద్యను బోధించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో టీచర్స్, లెక్చరర్స్, సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సాయంత్రం అందించే స్నాక్స్‌ని పరిశీలించారు. హాస్టల్ కిచెన్‌ను తనికి చేసి నూతన మెనూ ప్రకారం విద్యార్థులకి భోజనం పెడుతున్నారా లేదా అని హాస్టల్ వార్డెన్‌ని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలన్నారు. కిచెన్‌లో నిల్వ ఉన్న కూరగాయలను వెంటనే తీసివేసి, కూరగాయలు ఎప్పటికపుడు తాజాగా తెచ్చి వండాలని అన్నారు. పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయా లేవా అని సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని చెపుతూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ అడ్మిషన్‌లు పెరిగేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## అత్యాచారం కేసులో నిందితుడికి 22 సంవత్సరాలు జైలు శిక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన కేసులో నిందితునికి 22 సంవత్సరాల జైలు తో పాటు జరిమాన విధించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు . ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన అల్లం మహేష్, మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేసి మోసం చేసిన కేసులో నిందితుడుకి ఏడీజే 2 కమ్ ఎస్సీ,ఎస్టీ కోర్టు,అత్యాచారం, పోక్సో కేసుల ఫాస్ట్ ట్రాక్ కోర్టు యుబైఎస్ 417,420 ఆఫ్ఐపిసిఅండ్ సెక్షన్ 3 అండ్ 4 ఆఫ్ ఫోక్స యాక్ట్ 2012 అండర్ సెక్షన్ .235(2) సి ఆర్ ప్రకారం నిందితునికి 22 సంవత్సరాల జైలు జరిమాన విధించడం జరిగిందని తెలిపారు.2014 వ సంవత్సరంలో నిందితుడు వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన అల్లం మహేష్ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని గర్భవతి చేసి మోసం చేయడంతో బాధితురాలు పిర్యాదు మేరకు వాడపల్లి పోలీస్ స్టేషన్ లో 2014లో పలు శిక్షల కింద కేసు నమోదు చేయడం జరిగిందని కోర్ట్ లో ఛార్జ్ సీట్ దాఖలు సమర్పించగా వాదోపవాదల అనంతరం శుక్రవారం నిందితునికి మొత్తం 22 సంవత్సరాలు జైలు 35 వే ల జరిమాన విధించడం జరిగిందన్నారు.ఈ కేసులో సరిఅయిన ఆధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్,ఎస్ఐ వీర రాఘవులు,సిఐలు ప్రకాశ్,మహేష్,నరసింహ రెడ్డి, రవీందర్,ప్రస్తుతం మిర్యాలగూడ సిఐ పిఎన్‌డి ప్రసాద్,ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి, వాడపల్లి పీఎస్, పిపి వేముల రంజిత్ కుమార్, సిడిఓ యూనస్, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు నరేందర్,.మల్లికార్జున్‌ల ను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## ఐఎల్ బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాబోయే రోజుల్లో జిల్లాలో ఐఎల్ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఐఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆది రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలో జరిగిన ఐఎల్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన భూమిక పోషించబోతున్న తరుణంలో ఆ విషయంపై న్యాయవాదులు అందరికీ అవగాహన కల్పించేందుకు ఐఎల్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలియజేశారు. ఐఎల్ జిల్లా అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మునగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన వెంకన్న, మేడం మోహన్ రెడ్డి, గుర్ర వెంకటరెడ్డి, నజీరుద్దీన్, ఆవుల ప్రేమ్ సుందర్, సంద యాదయ్య, ఐలేష్, వెంకటేష్, కుమార్, నగేష్, పాపయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** మండల కేంద్రంలోని ఎస్సి, బిసి, ఎస్టి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. సాంఘీక సంక్షేమ బాలికల గురుకులలోని విద్యార్థుల సంఖ్య, వసతుల వివరాలను, అక్కడ అవసరమైన అదనపు మంచాలు, బాత్‌రూంలు, తాగునీటి వసతి, అదనపు తరగతి గదులు, డార్మెటరీ అంశాలను ప్రిన్సిపల్‌ని అడిగి వివరంగా తెలుసుకున్నారు. ఎస్టి గురుకులలో ప్రిన్సిపల్ శారద విద్యార్థులకు మంచాలు కావాలని, తాగునీటి సమస్య ఉందని, అదనపు బాత్‌రూంలు కావాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు ఐక్యంగా పోరాటం

### కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండలో బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని జూలై 9 న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమన్న,ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు బి నరసింహ పిలుపునిచ్చారు.శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారాంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తన కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ముందుకు తెచ్చిందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలతో లేబర్ కోడ్ ల అమలు ఐదు సంవత్సరాలు ఆలస్యమైనా వాటిని ఇప్పుడు అమలు చేస్తూ పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫడరేషన్లు అసోసియేషన్లు జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని వాటిని జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేవిఎస్ రెడ్డి,కోశాధికారి డి వెంకన్న,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం,సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య,అద్దంకి నరసింహ,సాయిదాచారి,నగేష్, మల్లయ్య,ఐఎన్‌టియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మైనుద్దీన్,జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సాగర్,అయోధ్య, అశోక్,వివిధ సంఘాల నాయకులు అవుటర్ రవీందర్,అశోక్ రెడ్డి, జానయ్య, ఎండి జానీ, వీరయ్య,నాగరాజు,సంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

### ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/చండూరు :** నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శుక్రవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మ భవనంలో అఖిల భారత యువజన సమాఖ్య చండూరు మండల 15వ మహాసభ ఎఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కొండ్రెడ్డి సాయి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తీర్పారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల ముందు యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగ ఉన్న ఉద్యోగాలను కుదిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ రంగ సంస్థలకు రెడ్ తివాచి పరిచిందని అన్నారు. రైల్వే , విమాన , ఎల్ఐసి వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో పెట్టుబడులను ఉపసంహరించుకొని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. దేశ రక్షణ రంగాన్ని సైతం అగ్నిపథ పేరుతో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి నెట్టిందని విమర్శించారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో ఆదివాసులను ,అమాయక గిరిజనులను మావోయిస్టుల పేరుతో చంపుతున్నారని అన్నారు. మావోయిస్టులతో భేషరత్తుగా చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ,నిరుద్యోగ యువతకు ఉద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి రంగ పరిశ్రమలు ,నెలకొల్పి యువతను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లాలో విచ్చలవిడిగా నెలకొల్పుతున్న కాలుష్య ఫార్మా కంపెనీల అనుమతులు రద్దు కోసం ఉద్యమించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య , బొడ్డు వెంకటేశ్వర్లు , ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేశం , తిప్పర్తి రాములు , దోటి వెంకన్న, బండమీది వెంకటేశం , జెల్ల శ్రీను, సిహెచ్ ఊషయ్య , గంట రమేష్ , ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం నవీన్ , సైదులు , శివర్ల లివగస్వామి , గణేష్ , లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ అగ్నికణం దొడ్డి కొమరయ్య

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య తెలంగాణ అగ్నికణంఅని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో నల్లగొండలో దొడ్డి కొమరయ్య79వ వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ విసునూరు రామచంద్రారెడి, దేశముఖ్‌ల వ్యతిరేకంగా కడి వెండిలో జరుగుతున్న రైతాంగ ప్రదర్శనలో దొడ్డి కొమరయ్య ముందు వరుసలో ఉన్నాడని, విసునూరు దొరలు జరిపిన కాల్పుల్లో తూటాలు తగిలి దొడ్డి కొమరయ్య నేలకొరిగాడన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి డి వెంకన్న జానయ్య శివ మహేష్ నాగరాజు సైదులు యాదగిరి జానీ, సోమయ్య వీరయ్య, రామస్వామి,ఎల్లయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు ముందు నుండే సిద్ధం

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

**ప్రజాపక్షం/నల్లగొండ :** రానున్న ఖరీఫ్ సీజన్ లో దాన్యం కొనుగోలుకు కావలసిన సామగ్రి కై ముందు నుండే సిద్ధం కావాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు.శుక్రవారం అయన తన చాంబర్లో ఖరీఫ్ 2025 సీజన్ కు ఆయా వ్యవసాయ మార్కెట్ యార్డులు,ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు ,కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉండగా, ఇటీవల జిల్లా యంత్రాంగం రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులకు మొబైల్ గ్రైన్ డ్రయ్యర్లు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అలాంటి మొబైల్ గ్రైన్ డ్రయ్యర్లను అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ల లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగింది. రబీలో 2000 మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం వచ్చిన 110 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను ఏర్పాటు చేసే విషయం, తూకం,తేమ కొలిచే యంత్రాలకు మరమ్మతు చేయించి సిద్ధంగా ఉంచుకోవడం ,అలాగే ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మరిన్ని టార్పాలిన్లను ఇచ్చే విషయం సమావేశంలో చర్చించారు.మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిసీఓ పత్యా నాయక్ ,తదితరులు తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ మండల కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని, ఉద్యమించే కమ్యూనిస్టులను ప్రజా ప్రతినిధులకు గెలిపిస్తే ప్రజల పక్షాన నిలబడ్తారని అన్నారు. కులం, మతం, డబ్బు ప్రలోబాలకు లొంగి ఐదు సంవత్సరాల భవితవ్యాన్ని తాకట్టు పెట్టొద్దన్నారు. మండలంలో గతంలో ప్రజాప్రతినిధులుగా గెలుపొంది అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృసి చేశామన్నారు. ప్రజలు సీపీఐ పార్టీపై నమ్మకం ఉంచాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. మండలంలో చిన్న నీటి వనరులైన ధర్మారెడ్డి, బునాదిగానికాల్వ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, సహాయ కార్యదర్శి కల్లెం రాంచందర్, యాదగిరి, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఉట్కూరి భగవంతు, గంగాపురం వెంకటయ్య, శివరాత్రి సమ్మయ్య, కడమంచి జగన్నాథం, ఉట్కూరు కృష్ణ, మల్లేశం, సల్ల సీతారాములు, మల్లయ్య, మీసం గాలయ్య ఉన్నారు.

## లక్కీ డ్రా పేరుతో మోసం: ముగ్గురు అరెస్ట్

### జిల్లా ఎస్‌పి శరత్‌చంద్రపవార్ వెల్లడి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** లక్కీ డ్రా పేరుతో ఆకర్షణీయమైన బహుమతులు ఆశ చూపి మోసం చేసిన ఘరానా మోసగాళ్లు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ శరత్‌చంద్రపవార్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆర్‌కె ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మల్టీ లెవల్ సంస్థను నెలకొల్పి పరిసర ప్రాంతాల సుమారు 2,143 మంది అమాయక ప్రజలను సభ్యులుగా మిర్యాలగూడకు చెందిన కొమ్ము రమేష్, కొమ్ము కోటేశ్వర్‌రావు, బచ్చలకూరు శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులు చేర్పించుకున్నారని అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆర్‌కె ఎంటర్ ప్రైజెస్ పేరిట కార్యాలయం తెరిచి నెలకు రూ.1000 చొప్పున చెల్లిస్తే 15నెలల పాటు డ్రాలో పది మందికి అదృష్టం బాగుంటే లక్కీ డ్రాలో విలువైన కార్లు, బైక్‌లు, బంగారు నగలు ఇచ్చి 15 నెలల తరువాత డ్రాలో బహుమతి రాకున్నా చెల్లించిన మొత్తం ఇస్తామని నమ్మించి వారి నుంచి సుమారు రూ.1,85,79,000ను సేకరించి అందులో రూ.50లక్షల మేరా బహుమతులు ఇచ్చాడన్నారు. 15నెలల కాలపరిమితి బహుమతులు రాని వారు ఫోన్ చేయడంతో ఫోన్ స్విచాఫ్ రావడంతో బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం సాయంత్రం ఈదులగూడ చౌరస్తా వద్ద రమేష్, కోటేశ్వర్ రావు, బచ్చలకూరి శ్రీనివాస్‌ను ఆయన ఇంట్లో పట్టుకోని వారి నుంచి సుమారు రూ.70లక్షల విలువైన నగదు రూ.6.55లక్షలు, రెంపడ ఓపెన్ ప్లాట్ల దస్తాలు, ముదిమాణిక్యంలో ఫంక్షన్‌హాల్ లీజుకు తీసుకున్న పాత్రలు, ఫర్నీచర్, రెండు బైక్‌లు, వాషింగ్‌మిషన్, వాటర్ ప్యూరిఫైడ్, లాప్‌టాప్, కంప్యూటర్ బ్రోచర్లు స్వాదీనం చేసుకున్నారు. లక్కీ డ్రా స్కీంలలో మాయ మాటలను నమ్మి ప్రజలు నష్టపోవద్దని సూచించారు. కేసును చాకచక్యంగా చేధించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజును, సీఐ సీహెచ్.మోతీరాం, ఎస్ఐ సైదిరెడ్డి, కానిస్టేబుల్స్ శ్రీను, నరసింహా, సైదులు, వీరబాబు, తమీజుద్దిన్, ప్రసాద్‌లను అభినందించారు.

## గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురు నిందితులు అరెస్టు




### రూ.3 లక్షల విలువైన 11.780 కేజీల గంజాయి పట్టివేత

### ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు

### జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట పట్టణ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.3 లక్షల విలువైన 11.780 కేజీల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు, ఒక స్కూటిని స్వాదీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 3వ తేదీన సూర్యాపేట పట్టణంలోని నల్లచెరువు గుట్టపై ఆరుగురు వ్యక్తులు గంజాయితో ఉన్నారని నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా సిసిఎస్ పోలీసులు, సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య, ఎస్ఐ ఏడుకొండలు సంయుక్తంగా దాడిచేయగా ఆరుగురు వ్యక్తులు గంజాయితో గుట్ట వద్ద కూర్చోగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా సూర్యాపేట పట్టణంలోని ముత్యాలమ్మ ఏరియాకు సంబంధించిన పిట్టల నాగరాజు, సుందరయ్యనగర్‌కు చెందిన అంగోతు వంశీ, దాసాయిగూడెం గ్రామానికి చెందిన రెడ్డిపల్లి మధుసూదన్, పట్టణంలోని బర్లపెంటకు చెందిన కూతురు అకాశ్, పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శూర శ్రావణ్‌కుమార్, పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన గుండారపు శివ లని తేలింది. వీరితో పాటు పట్టణంలోని చంద్రన్నకుంటకు చెందిన ఆది వంశీ, ఇందిరమ్మ ఆసుపత్రి సమీపానికి చెందిన విశ్వనాధుల సాయికుమార్, మోతె మండలం దోసపాటి వంశీ, పట్టణంలోని కృష్ణటాకిస్ ఏరియాకు చెందిన సారగండ్ల శివ కార్తీక్ వీరితో కలిసి గంజాయి వ్యాపారాన్ని సాగిస్తునట్లు తెలిసింది. ఈ నలుగురు పరారిలో ఉన్నారు. పిట్టల నాగరాజు, ఆది వంశీలు కలిసి విశాఖపట్నం అరుకు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయిని తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలుగా చేసి (5 నుండి 10 గ్రాములు) రూ.500 నుండి రూ.1000 అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నారు. నిందితులు గత నెల 30వ తేదీన సూర్యాపేట నుండి ఖమ్మంకు వెళ్లి, అక్కడ నుండి విశాఖపట్నం చేరుకుని అరుకు ప్రాంతంలో 12 కేజీల గంజాయిని కేజి రూ.2వేల చొప్పున కొనుగోలు చేసి ఈనెల 3న సూర్యాపేటకు తీసుకవచ్చారు. ఈ గంజాయిని అదేరోజు సాయంత్రం నల్లచెరువు గుట్ట వద్దకు అంగోతు వంశీ తన టివిఎస్ మోపెడ్ స్కూటిలో తీసుకవచ్చారు. అదే సమయంలో కొంతమంది వారి వద్ద గంజాయి ఉండటాన్ని పసిగట్టి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.3లక్షల విలువైన 11.780 కిలో గ్రాముల గంజాయిని, మూడు సెల్‌ఫోన్లు, స్కూటిని స్వాధీనం చేసుకున్నా రు. వీరిపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. డ్రగ్స్ రవాణా చేసిన, వినియోగం చేసిన నేరమని, దీనికి కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు. గంజాయి సీజ్ చేసి నిందితులను అరెస్టు చేయడంలో ప్ర ముఖ పాత్ర పోషించిన సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, ఎస్ఐ హరికృష్ణ, సిసిఎస్ సిబ్బంది శ్రీనివాసులు, అనంద్, మల్లేశ్, సతీష్, శివకృష్ణ, ప్రభాకర్, మహిళ హోంగార్డు మంజుల, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రమేష్, పట్టణ సిఐ వెంకటయ్యతో పాటు ఎస్ఐ లను జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అభినందించారు.

# క్రీడ



## దేశం కోసమే 'నీరజ్ క్లాసిక్'

జావెలిన్ త్రోతో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నీరజ్ చోప్రా తన కలను నిజం చేసుకున్నాడు. ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో భారత దేశ కీర్తి, ప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన బడిసె వీరుడు.. అథ్లెటిక్స్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నాడు. మరికొంతమంది జావెలిన్ యోధులను తయారుచేసేందుకు సన్నద్ధమవుతున్నాడు. జూలై 5న బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో నీరజ్ చోప్రా క్లాసిక్ తొలి ఎడిషన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అతడు మీడియాతో మట్లాడుతూ.. అథ్లెటిక్స్‌లో భారత్ గొప్పగా రాణించాలని ఆకాంక్షించాడు. 'ఇదంతా కలలా అనిపిస్తోంది. విశ్వవేదికలపై పతకాలు సాధించడంతోనే సంతృప్తి చెందే రకం కాదు నేను. దేశం కోసం ఏదైనా చేయాలనే తపన కలిగిన మనిషిని. అందుకే భారత అథ్లెట్లకు నా వంతుగా సాయం చేయాలనుకున్నా. మనదేశ అథ్లెటిక్స్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ నా పేరుతో నీరజ్ చోప్రా క్లాసిక్ టోర్నీ ఆరంభిస్తున్నాను. ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ మహా క్రతువులో నాకు ప్రజలు, ప్రభుత్వం మద్దతుగా నిలుస్తున్నారు.కర్నాటక ఒలింపిక్ సంఘం, ప్రపంచంలోని పలువురు అథ్లెట్లు, స్పాన్సర్లు ఈ టోర్నీని విజయవంతం చేసేందుకు అన్ని విధాలా సహకరిస్తున్నారు. మీ అందరి తోడ్పాటుతో తొలి ఎడిషన్‌ను కన్నులపండువగా జరపాలని భావిస్తున్నాం' అని నీరజ్ వెల్లడించాడు. ఈమధ్యే పారిస్ డైమండ్ లీగ్ టైటిల్, గోల్డెన్ స్పైక్స్ అథ్లెటిక్స్‌లో విజేతగా నిలిచిన నీరజ్ మళ్లీ అగ్రస్థానానికి దూసుకెళ్లిన విషయం తెలిసిందే.

### పోటీపడుతున్నది వీళ్లే..

షెడ్యూల్ ప్రకారం మే నెలలోనే నీరజ్ చోప్రా క్లాసిక్ తొలి ఎడిషన్ జరగాల్సింది. కానీ, పహల్గాంలో ఉగ్రదాడి.. 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాల కారణంగా లీగ్‌ను వాయిదా వేశారు. భారత్, పాక్‌లు కాల్పుల విరణమణకు అంగీకరించిన తర్వాత కొత్త షెడ్యూల్ విడుదల చేసిన నిర్వాహకులు.. జూలై 5న టోర్నీ జరపాలని నిర్ణయించారు. ఈ మెగా అథ్లెటిక్స్ ఈవెంట్‌లో చోప్రాతో పాటు కర్టిస్ థాంప్సన్(అమెరికా), మార్టిన్ కొనెస్నీ(చెచియా), జులియస్ యెగో(కెన్యా), సిప్రియన్ రిజ్‌గోల్డ్ పోలాండ్, లూయిజ్ మౌరిసియో డ సిల్వా(బ్రెజిల్), రుమేశ్ పథిరగె(శ్రీలంక), థామస్ రొహెల్లర్(జర్మనీ)లు పాల్గొంటున్నారు.



## 407కే ఇంగ్లాండ్ ఆలౌట్

### ఆరు వికెట్లతో చెలరేగిన సిరాజ్.. టీమిండియాకు స్వల్ప ఆధిక్యం

ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో టీమిండియా మళ్లీ పట్టుబిగించే స్థితిలో నిలిచింది. టీ సెషన్ తర్వాత మహ్మద్ సిరాజ్ (6–74) నిప్పులు చెరిగాడు. కొత్త బంతితో చెలరేగిపోయిన స్పీడ్‌స్టర్ మొత్తంగా ఆరు వికెట్లతో ఇంగ్లాండ్ నడ్డివిరిచాడు. లంచ్ లోపే సగం వికెట్లు కోల్పోయిని ఆతిథ్య జట్టు జేమీ స్మిత్(184), హ్యారీ బ్రూక్(158)ల సెంచరీలతో కోలుకుంది. అయితే.. ఆకాశ్ దీప్ ఓవర్లో బ్రూక్ బౌల్డ్ అయ్యాక టెయిలెండర్ల పని పట్టాడు సిరాజ్. అంతే.. చూస్తుండగానే మూడు వికెట్లు పడడంతో ఇంగ్లాండ్ అనూహ్యంగా 407కే ఆలౌటయ్యింది. దాంతో, భారత జట్టుకు 180 పరుగులస్వల్ప ఆధిక్యం లభించింది. తొలి రెండు రోజులు టీమిండియా ఆధిపత్యం చెలాయించగా.. మూడోరోజు రెండె సెషన్లలో ఇంగ్లండ బ్యాటర్లు బజ్ బాల్ ఆటతో జోరు చూపించారు. మూడో తొలి సెషన్‌లోనే సిరాజ్ వరుస బంతుల్లో జో రూట్(22), కెప్టెన్ బెన్ స్టోక్స్(0) పెవిలియన్ పంపాడు. అంతే.. 85కే సగం వికెట్లు కోల్పోయింది ఆతిథ్య జట్టు. హ్యాట్రిక్ బాల్‌ను ఎదుర్కొన్న జేమీ స్మిత్(184).. క్రీజులో పాతుకుపోయాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో హ్యారీ బ్రూక్(158)తో కలిసి చెలరేగిపోయాడీ వికెట్ కీపర్. ఆరో వికెట్‌కు కేవలం 303 పరుగులతో జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారిద్దరూ. వీరిద్దరి మెరుపులతో వికెట్ల పతనానికి బ్రేక్ పడగా.. లంచ్ సమయానికి ఇంగ్లాండ్ ఐదు వికెట్ల నష్టానికి 249 రన్స్ చేసింది. టీ సెషన్ తర్వాత బ్రూక్ సెంచరీ సాధించగా.. స్మిత్ 150 క్లబ్‌లో చేరాడు.



## మాజీ వరల్డ్ నంబర్ 1కు షాక్..


### తొలిసారి నాలుగో రౌండ్‌లో రష్యన్ స్టార్

వింబుల్డన్‌లో ఫేవరెట్లకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో నవొమి ఒసాకా అనూహ్యంగా మూడో రౌండ్‌లోనే వెనుదిరిగింది. మూడేళ్ల తర్వాత వింబుల్డన్ ఆడుతున్న ఈ మాజీ వరల్డ్ నంబర్ 1కు అనస్టాసియా పవ్లిచెంకోవా(రష్యా) షాకిచ్చింది. మూడు సెట్లపాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఒసాకా తొలి సెట్ గెలుపొందినప్పటికీ అదే జోరు చూపలేకపోయింది. రెండో సెట్‌లో పుంజుకున్న అనస్టాసియా విజేతగా నిలిచింది. దాంతో ఉసూరుమంటూ నిష్క్రమించింది ఆసియా టెన్నిస్ స్టార్.

నాలుగు గ్రాండ్‌స్లామ్స్ విజేత ఒసాకా వింబుల్డన్‌లో మూడో రౌండ్ దాటలేకపోయింది. 53వ ర్యాంకర్ అనస్టాసియా ధాటికి నిలువలేకపోయింది. తొలి సెట్‌ను ఒసాకా 3–6తో సులువుగా గెలుపొందింది. ఆ తర్వాత అనస్టాసియా తన అసలైన గేమ్‌తో విరుచుకుపడి 6–4, 6–4తో రెండు సెట్లలో పైచేయి సాధించింది. తదుపరి రౌండ్‌లోనూ ఇదే ఉత్సాహంతో చెలరేగాలని భావిస్తున్నట్టు చెప్పిందీ 2021లో ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ అయిన రష్యా క్రీడాకారిణి. తొమ్మిదేళ్లలో అనస్టాసియా నాలుగో రౌండ్‌కు చేరడం ఇదే తొలిసారి.

# ఫోకస్ సైన్స్

## అంగారక గ్రహం విశేషాలు..



అంగారకుడు సౌరవ్యవస్థలో నాలుగవ గ్రహం. దీనిని కుజుడు, అరుణ గ్రహం, మార్స్, రెడ్ ప్లానెట్ పేర్లతోనూ పిలుస్తారు. దీని వ్యాసం: సుమారు 6,860 కిలోమీటర్లు. భూమితో పోలిస్తే పరిమాణం 1/9 వంతు మాత్రమే. ఎర్ర రాళ్లతో కూడుకున్నది కావడంతో దీని ఉపరితరం ఎర్రగా ఉంటుంది. ఈ గ్రహం సూర్యుని చుట్టూ తిరగడానికి 687 భూమి రోజులు పడుతుంది. ఈ కాలాన్ని 'మార్స్ ఇయర్' అంటారు. ఇది తన అక్షం చుట్టూ తిరగడానికి సుమారు 24.6 గంటలు పడుతుంది. దీని వాతావరణంలో కార్బన్ డైయాక్సైడ్ 95 శాతం వరకూ ఉంటుంది. ఆక్సిజన్ చాలా తక్కువ. తరచూ ఇసుక తుఫాన్లు వస్తుంటాయి కాబట్టి, ఉపరితలం ఎడారి మాదిరి ఉంటుంది. ఈ గ్రహం ధ్రువ ప్రాంతాల్లో మంచు (ఐస్) ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంగారక గ్రహంపై నాలుగు రకాల సీజన్లు ఉంటాయి. వాటి నిడివి ఎక్కువ. ఒకప్పుడు ఈ గ్రహంపై పర్వతాలు, లోయలు, అగ్నిపర్వతాలు, సరస్సులు ఉన్నాయనడానికి తగిన ఆనవాళ్లను కనుగొన్నారు. గతంలో పెద్ద సముద్రాలు, నదులు ఉండేవని కూడా ఆధారాలు ఉన్నాయి. ప్రస్తుతం నీరు ఎక్కువగా మంచు రూపంలో లేదా భూమిలో లోతుల్లో ఉంది. బలమైన సౌర గాలులు, తుఫాన్ల వల్ల వాతావరణం మారిపోయింది. నీరు అంతరించిపోయింది. స్పేస్ సూట్ లేకుండా వెళితే, అక్కడి వాతావరణం కారణంగా మనిషి బతకడం అసాధ్యం. అయినప్పటికీ, మార్క్‌పై అనేక అంతరిక్ష మిషన్లు జరుగుతున్నాయి. రోవర్లు పరిశోధనలు చేస్తున్నాయి. వాటి ఫలితాలు ఏం చెప్తాయన్నది ప్రస్తుతానికి పెద్ద సస్పెన్స్.



## అంతులేని అన్వేషణ

సైన్స్‌లో సమాధానం లభించని ఎన్నో ప్రశ్నలకు అంతులేని అన్వేషణ కొనసాగుతునే ఉంది. కొన్ని ప్రశ్నలకు సమాధానం లభిస్తుంటే, మరికొన్ని ప్రశ్నలపై పరిశోధనలు జరుగుతున్నాయి. 'జీవం ఎలా పుట్టింది'? అనేది ఎంతోకాలంగా శాస్త్రవేత్తలను వేధిస్తున్న ప్రశ్న. దీనిపై ఎన్నో సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది, ఎక్కువ మంది అంగీకరిస్తున్నది 'బిగ్ బ్యాంగ్' సిద్ధాంతం. కాగా, తాజా అధ్యయనాల ఆధారంగా, భూమిపై జీవం ఎలా పుట్టిందనే ప్రశ్నకు అంతరిక్షం నుండి వచ్చిన సేంద్రియ పదార్థాలను శాస్త్రవేత్తలు కీలకంగా భావిస్తున్నారు. జపాన్ తన హయాబుసా–2 మిషన్ ద్వారా సేకరించిన ర్యుగు గ్రహశకల నమూనాల్లో 23 రకాల అమైనో ఆమ్లాలను గుర్తించారు. ఈ కర్బన సమ్మేళనాలు భూమిపై జీవం ఆవిర్భవించడానికి మూలాధారాలు కావచ్చని పరిశోధకులు నమ్ముతున్నారు. ర్యుగు వంటి కార్బన్‌రిచ్ గ్రహశకలాలు భూమిని ఢీకొట్టినప్పుడు, అవి నీరు మరియు అమైనో ఆమ్లాలను తీసుకువచ్చాయని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ ప్రక్రియ 420 కోట్ల సంవత్సరాల క్రితం ప్రారంభమై ఉండవచ్చని అంచనా. పాన్‌స్పెర్మియా సిద్ధాంతం ప్రకారం, అంగారక గ్రహం నుండి ఉల్కల ద్వారా సూక్ష్మ జీవులు భూమిపైకి చేరి ఉండవచ్చు. ఈ ప్రక్రియకు 'అంతరిక్ష జీవ ప్రసరణ'లేదా 'ఇంటర్‌ప్లానెటరీ ట్రాన్స్‌ఫర్' అని పేరు. భూమి యొక్క ప్రారంభ పరిస్థితులపై జరిగిన అధ్యయనాలను అనుసరించి, హీలియం3 లీకేజీ, భూ అంతర్భాగంలోని రసాయన ప్రక్రియలు జీవోత్పత్తికి అనుకూల వాతావరణాన్ని సృష్టించి ఉండవచ్చు. మొత్తం మీద ప్రస్తుత అంచనాలను అనుసరించి, సుమారు 4.2 బిలియన్ సంవత్సరాల క్రితం సేంద్రియ పదార్థాలు భూమిపైకి చేరుకున్నాయి. 370 కోట్ల సంవత్సరాల క్రితం (చంద్రయాన్3 ల్యాండింగ్ సైట్ వయస్సు ప్రకారం) సూక్ష్మ జీవులు భూమిపై కనిపించాయి. అయితే, మిగతా సిద్ధాంతాల మాదిరిగానే, దీనిపైన కూడా పరిశోధనలు కొనసాగుతున్నాయి.



## మార్స్‌పైనే ఆశలు!

భూమిపై జీవం ఎలా పుట్టిందనే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవడానికి అంగారక గ్రహంపై జరుగుతున్న పరిశోధనలే సరైన సమాధానం ఇస్తాయని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. ఈ గ్రహంపై జీవనం సాధ్యమా అనే ప్రశ్నపై శాస్త్రవేత్తల పరిశోధనలు ఎంతోకాలంగా జరుగుతున్నాయి. మార్స్ ఉపరితలం కింద 10 నుంచి 20 కిలోమీటర్ల లోతులో ద్రవ రూపంలో నీటి నిల్వలు ఉండొచ్చని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి, ఇది జీవానికి అవసరమైన ప్రాథమిక పరిస్థితుల్లో ఒకటి. కోట్లాది సంవత్సరాల క్రితం అంగారకుడిపై జీవానికి అనుకూలమైన వాతావరణం ఉండి ఉండొచ్చని ఖనిజాల ఆధారంగా భావిస్తున్నారు. కానీ, ప్రస్తుతం అక్కడి ప్రస్తుత వాతావరణం అత్యంత సమస్యాత్మకంగా ఉంది. అతి తక్కువ ఉష్ణోగ్రతలు, అధిక రేడియేషన్, తక్కువ వాయు పీడనం, ఆక్సిజన్ లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. అయితే, భవిష్యత్తులో మార్స్‌పై మానవ నివాసం సాధ్యమవుతుందా? అనే విషయంపై శాస్త్రవేత్తలు ప్రయోగాలు, సిమ్యులేషన్లు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో అక్కడ జీవితం చాలా కష్టం. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, అంగారక గ్రహంపై జీవితం ఉంటే అది భూమిపై కనిపించే జీవరూపాలతో పోలికలు ఉండకపోవచ్చు. ముఖ్యంగా, అక్కడి కఠినతరమైన వాతావరణం కారణంగా, జీవం భూమిలోని లోతుల్లో ఉండే సూక్ష్మ జీవుల లాంటి రూపంలో ఉండవచ్చనే అభిప్రాయం కొంత మంది శాస్త్రవేత్తల్లో ఉంది. భూమిలోని లోతుల్లో వెలుతురు లేకుండా, రాళ్లు, నీటి రసాయన చర్యల ద్వారా శక్తిని పొందే జీవాల్లా ఉండొచ్చు. రేడియోలిసిస్ అనే ప్రక్రియ ద్వారా రాళ్లలోని రేడియోధార్మిక మూలకాలతో నీరు చర్యకు వచ్చి హైడ్రోజన్, ఆక్సిజన్ లను విడుదల చేస్తుంది. ఈ హైడ్రోజన్‌ను సూక్ష్మ జీవులు ఇంధనంగా ఉపయోగించుకుంటాయి. ఇవి సూర్యకాంతి అవసరం లేకుండా, రసాయన శక్తిని ఆధారంగా జీవించగలవు. కాబట్టి, అంగారక గ్రహంపై జీవితం ఉంటే, అది భూమిలో లోతుల్లో కనిపించే సూక్ష్మ జీవుల్లా, చాలా చిన్నదిగా, రసాయన శక్తిని ఆధారంగా జీవించేలా ఉండే అవకాశం శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేస్తే, భవిష్యత్తులో మార్స్‌పై జీవనం సాధ్యమవుతుందనే ఆశలు ఉన్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

### సిపిఐ శ్రేణులకు చాడ వెంకటరెడ్డి పిలుపు





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాలను కైవసం చేసుకోవడానికి సిపిఐ కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజల మధ్య ఉండి ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. సిపిఐ నుంచి ప్రజాప్రతినిధులు ఉంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా అందరికీ సంక్షేమ పథకాలు అందాలని, స్థానిక సంస్థలకు విధులు, నిధులు చెందాలంటే క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు ఉంటేనే గ్రామీణ, పట్టణ పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో అభివృద్ధి కుంటుపడిపోయిందని, కేంద్రం నుంచి నిధులు రావడం లేదన్నారు. తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి వెంకటరెడ్డి సూచించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పరిపాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతో మంది అమాయకమైన ఆదివాసీలను, ప్రజల కోసం పనిచేసే మావోయిస్టులను హతమారుస్తుందన్నారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని వామపక్షాలు అనేకమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోకుండా క్రూరంగా వ్యవహరిస్తుందన్నారు. మేధావులను, ప్రశ్నించే గొంతులను నొక్కి పెడుతోందని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని, ప్రజాసంఘాలను బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ సభ్యుల వరకు, పట్టణ, నగర ప్రాంతాల్లో కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేయాలని, అందుకు తగిన కార్యచరణ ఇప్పటి నుంచే రూపొందించుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు. పిలుపునిచ్చారు. ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని వెంకటస్వామి కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, కిన్నెర మల్లవ్వతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## అణగారినవర్గాల అభివృద్ధే ఎర్రజెండా ఆశయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



ప్రజాపక్షం/ఉండవెల్లి : అణగారిన వర్గాల అభివృద్ధే ఎర్రజెండా ఆశయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం అలంపూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో అలంపూరు తాలుకా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ఆంజనేయులు మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, రైతు సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. భవిష్యత్ ఉద్యమాలకు బాటలు వేయడానికి మహాసభలు దోహదపడతాయన్నారు. ఈ నెల 23న జిల్లా మహాసభలు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరుగుతాయని, సభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిధులుగా హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. సామాన్యులకు సంక్షేమ పథకాలు అందజేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. దున్నే వాడిదే భూమి అనే లక్ష్యంతో సిపిఐ ముందుండి రైతుల పక్షాన పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి కృషితో ఆనాడు సోనియా గాంధీ నాయకత్వంలో కష్టజీవుల కోసం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. అన్నివర్గాల సంక్షేమానికి ఆనాటి నుంచి నేటివరకు సిపిఐ ముందుండి పోరాతుందన్నారు. ప్రతిపేదవాడు కమ్యూనిస్టు భావాలకు అలవాటు పడితే అభివృద్ధి చెందుతారని ఆయన పేర్కొన్నారు. దేశంలో అంబాని, అద్వానీ చేతుల్లో బిజెపి ప్రభుత్వం మోదీ ఉన్నాడని, దేశసంపద 90 శాతం వారి చేతుల్లోనే ఉందన్నారు. పేదలు పేదలుగానే ఉంటున్నారన్నారు. ధనవంతులకు బిజెపి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తూ, పేదలపై అధిక ధరల పేరుతో మరింత భారాన్ని వేస్తుందన్నారు. అన్నివర్గాల సంక్షేమ, అభివృద్ధికి పోరాడుతున్న కమ్యూనిస్టులకు ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. మహాసభలో సిపిఐ తాలుకా ఇన్‌చార్జ్ పెదబాబు, సిపిఐ నాయకులు మద్దిలేటి, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు నాణ్యమైన తునికాకు సరఫరా

### వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్



ప్రజాపక్షం/మెట్‌పల్లి : బీడీ కార్మికులకు నాణ్యతమైన తునికాకు సరఫరా చేయాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎండి మౌలానా, సుతారి రాములు డిమాండ్ చేశారు. నెలకు సరిపడా ముడి సరుకు ఇచ్చి చేతి నిండా పని ఇవ్వాలని వారు కోరారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం శివాజీ సర్కిల్‌లో బీడీ 32 బ్రాంచ్ వద్ద బీడీ కార్మిక మహిళలు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎండి మౌలానా, సుతారి రాములు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా బీడీ ఫ్యాక్టరీ నుండి నాసిరకం తునికాకు సరఫరా చేస్తున్నారని, 1000 బీడీలకు వచ్చే ఆకు 500 బీడీలకు సరిపోతుందని, మిగతాది కొనుగోలు చేసే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాసిరికం తునికాకు సరఫరా నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. బీడీ కార్మికులను ప్రభుత్వాలు చేతినిండా పని కల్పించి వారిని ఆదుకోవాలని వారు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. వారి సంక్షేమానికి ఆర్థిక పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇండ్లు, పెన్షన్ తదితర సంక్షేమ పథకాలు అందజేయాలని వారు కోరారు కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ , బీడీ కార్మిక సంఘం నేతలు రాజన్న. లత తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఐక్యత, రాజ్యాంగాన్ని కాపాడటానికి ఐక్య పోరాటాలు ఉధృతం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ





ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి : దేశ ప్రజల ఐక్యతను, రాజ్యాంగాన్ని కాపాడటానికి ఐక్య ఉద్యమాలు, పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండల సిపిఐ మహాసభను శుక్రవారం తాడెం గ్రామంలో నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికంగా సిపిఐ జెండాను రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు అడ్డికే రాజేశ్వర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిధిగా హాజరై పశ్య పద్మ మాట్లాడారు. కేంద్ర పాలకుల అవలంభిస్తునన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్పోరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో నిరుపేద ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. దేశంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి నిరంకుశంగా పాలన కొనసాగిస్తూ, ప్రజల అవసరాలు పట్టించుకోకుండా దేశ సంపదను కార్పోరేట్, ధనవంతుల పరం చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర పాలకుల ఫాసిస్టు విధానాలను వ్యతిరేకంగా భవిష్యత్తు ఉద్యమాలలో, పోరాటాలలో వేలాదిగా ప్రజలను సమీకరించాలన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలతో దేశ రైతాంగం, వ్యవసాయం కుదేలయ్యే పరిస్థితి ప్రమాదం ఏర్పడిందన్నారు. అమెరికాలో పండే మొక్కజొన్న, సోయా, గోధుమ, పాల ఉత్పత్తులను దేశంలో ఫ్రీగా మార్కెట్ చేసుకోవటానికి వీలుగా ఒప్పందాలుండాలని అమెరికా కార్పోరేట్ కంపెనీల నిర్ణయాలకనుకూలంగా ట్రంప్ వాణిజ్య ఒప్పందాలకు తయారయ్యాడని, వీటిని కేంద్ర పాలకులు వ్యతిరేకించాలన్నారు. దేశ సార్వభౌమాధికారం, పోషక ఆహార భద్రతకు ఎలాంటి విఘాతం కలగటానికి వీల్లేదని, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ సిపిఐ ఏర్పాటై 100 సంవత్సరాల సుధీర్ఘకాలంలో ప్రజా కార్మిక సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలపై ప్రస్తుతం జరుగుతున్న మండల మహాసభలలో చర్చించి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సిపిఐ జిల్లా నాయకులు కమలాపురం రాజన్న మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలో సిపిఐ మండల కార్యదర్శిగా సాయిలుతో పాటు మరో 9 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గౌస్ డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షుడు ఎం.ఎ.గౌస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సివిల్ డిపార్ట్మెంట్ వద్ద జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేయడం కోసం ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా వంద సంవత్సరాల లలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా ముందుకు తెచ్చిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు జూలై 9న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. సమావేశంలో ఎఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు హరి, రామాంజనేయ, బడికల పోచం, నర్సయ్య, శ్రీనివాస్ తో పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎల్‌బి స్టేడియానికి కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** జై బాబు జై భీమ్ జై సంవిధాన్ భారీ బహిరంగ సభకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే విచ్చేస్తున్న సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున బస్సులలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు విలేకరులు

### ఫీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి లాంటి వారు పత్రికా విలేకరులని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రెస్‌క్లబ్ ఆవరణలో కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించడం జరిగింది.

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రజలకు మంచి వార్తలను అందించే విధంగా విలేకరులు పనిచేయాలని తమ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా వారి మన్ననలు పొందాలని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, మేడిపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ముఖ్య సలహాదారులు వి.సూర్యనారాయణ రెడ్డి, మాజీ అధ్యక్షుడు కల్మారి ఎల్లయ్య, వడ్డేమాను సుందర్, ఉపాధ్యక్షులు సైరెడ్డి సాగర్ రెడ్డి, చింత రమేష్, కోఆర్డినేటర్ రావు నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు, నీరుడు అంజన్‌కుమార్, దాసరి దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా చింత రమేష్, కార్యవర్గ సభ్యులుగా మరాటి మత్స్యగిరి ఎన్నిక

మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడుగా చింత రమేష్, కార్యవర్గ సభ్యుడిగా మరాటి మత్స్యగిరిలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. గురువారం మేడిపల్లి మండల ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో ఎన్నికైన సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక జర్నలిస్టుల సంక్షేమం కోసం, జర్నలిస్టుల వృత్తి నైపుణ్యం పెంపుదల గురించి తన వంతుగా కృషి చేస్తామని అన్నారు. మేడిపల్లి మండల జర్నలిస్టుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.





## బహిరంగ సభకు భారీ వాహనాలతో వెళ్లిన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ, పట్టణ స్థాయి కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళన భారీ బహిరంగ సభకు ఎఐసిసి అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చెయ్యడానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి 40 బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై 3వేల మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్, బ్లాక్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు,అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు.

## మత్తుతో యువత చిత్తుకావద్దు : డిజిపి

**ప్రజాపక్షం/కొడంగల్:** యువత మత్తుకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)జితేందర్ హితవు పలికారు. శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నియోజకవర్గంలో రూ.10కోట్లతో నూతన నిర్మించే పలు పోలీస్ స్టేషన్‌లకు పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ఆర్.గురునాథరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఐజీ తాఫ్సీర్ ఎక్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజీపీ రమేశ్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేసి భూమిపూజ గావించారు. కొడంగల్ పోలీస్ స్టేషన్‌కు రూ.2.96కోట్లు, సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు రూ.84.50లక్షలు, దుద్యాల పీఎస్‌కు రూ.3కోట్లు, బొంరాస్‌పేట పీఎస్‌కు రూ.2.96కోట్లు నిధులతో పనులు జరుగనున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఆధునిక సౌకర్యాలతో కూడిన పోలీస్ స్టేషన్‌లను నిర్మంచనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దారు విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు యూసూఫ్, మార్కెట్ ఛైర్మన్ పట్నం అంబయ్యగౌడ్, శంకర్‌నాయక్, ఆయాగ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా వారాహి అమ్మవారి పూజలు

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన వారాహి అమ్మవారి ఆలయంలో నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపి, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిలను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, కౌకుట్ల చంద్రారెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మి , జ్యోతిపాండే, తదితరులు పాల్గొన్నారు.

# నాలాల్లో చెత్తను తొలగిస్తున్న హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైడ్రా వర్షాకాల అత్యవసర బృందాలు (ఎంఈటి)లు, హైడ్రా టిఆర్ఎఫ్ బృందాలు కలసి నాలాలు, కల్వర్టుల వద్ద పూడికతీత పనులు చేపట్టాయి. కొన్ని చోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త బయట పడుతోంది. యూసుఫ్‌గూడ పరసరాల్లోని మధురానగరం, కృష్ణానగర్ వద్ద వరద కాలువలో పేరుకుపోయిన చెత్తను హైడ్రా బృందాలు తొలగించాయి. గచ్చిబౌలిలోని జనార్ధన్‌రెడ్డి నగర్‌లోని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను హైడ్రా తొలగించింది. కాప్రా సర్కిల్ వార్డు నెంబర్ 2 మార్కండేయ కాలనీలో నాలా క్యాచ్‌పిట్ ఏరియాలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎల్.బి.నగర్ సర్కిల్ పరిధిలో ఆర్‌సిఐ రోడ్డు, మిథిలానగర్ దగ్గర మంత్రాల చెరువు నుంచి జిల్లెలగూడ చెరువు కు వెళ్లే నాలాలో ఉన్న పూడికను హైడ్రా డిఆర్ఎఫ్, ఎంఈటి బృందాలు జెసిబి ద్వారా తొలగించాయి.





**నల్లగండ్ల నాలా పనులకు తొలగిన ఆటంకాలు**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో వరద నీరు సాఫీగా సాగేందుకు ఉన్న ఆటంకాలను హైడ్రా తొలగించింది. నల్లగండ్ల చెరువు నుంచి వచ్చే వరద నీటి కాలువ పనులు ఇక జోరందుకోనున్నాయి. వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డిపి) ద్వారా 2 కిలోమీటర్ల మేర ఈ వరద నీటి కాలువను నిర్మిస్తున్నారు. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురయ్యింది.

కొన్ని చోట్ల ఇంటి యజమానులు ముందుకొచ్చి ఆక్రమణలను తొలగించ గా, మరి కొంత మంది అభ్యంతరాలు తెలిపారు. దీంతో నాలా పనులు ముందుకు సాగడం కష్టంగా మారింది. ఈ తరుణంలో ఎస్ఎన్‌డిపి ప్రాజెక్టు నిర్వాహకులు హైడ్రాను ఆశ్రయించారు. ఇదే సమయంలో నీటి ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి కూడా స్థానికులు హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేశారు. రెండు కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉన్న నాలా కేవలం, 230 మీటర్ల మేర పూర్తయ్యింది. నల్లగండ్ల హుడా కాలనీలో సమస్య తలెత్తిం ది.

ఒక అపార్టుమెంట్ ప్రహరీతో పాటు కొంత నిర్మాణం నాలాపైనే ఉంది. ఇదే మాదిరి మరి కొన్ని చోట్ల కూడా సమస్య తలెత్తడంతో ఎస్ఎన్‌డిపి అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. శుక్రవారం హైడ్రా రంగంలోకి దిగింది. నాలా పరిధిలో ఉన్న నిర్మాణాన్ని హైడ్రా తొలగించింది. నాలాకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి పనులు జరిగేందుకు అవకాశం కల్పించింది. నల్లగండ్ల చెరువు నుంచి మొదలై, డాక్టర్స్ కాలనీ, రైల్ విహార్, నల్లగండ్ల హుడా కాలనీ, ఓల్డ్ శేరిలింగంపల్లి విలేజ్, నేతాజీనగర్ మీదుగా, బిహెచ్ఈఎల్ చౌరస్తా వద్ద ఉన్న ప్రధా న నాలాలో ఈ నాలా కలుస్తుంది.

నాలా ఆక్రమణలకు గురవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో నీట మునిగే ముప్పు ఈ కాలనీలకు తప్పుతోందని స్థానికులు సంతోషం వ్యక్తంచేశారు. ఆటంకాలు తొలగాయి కనుక, ఎస్ఎన్‌డిపి నిర్వాహకులు ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

## కలెక్టర్ గారూ...ఇకనైనా మా సమస్యలు పరిష్కరించండి

### కిష్టాపూర్‌లో రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల మొర



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ మండలంలోని కిష్టాపూర్‌లోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను ఇకనైనా పరిష్కరిస్తారా అని విద్యార్థులు జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరారు. డ్రైనేజి వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని, ప్రస్తుతం ఉన్న టాయిలెట్లు సరిపడక పోవటం వల్ల నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తరగతులకు సరిపడే విధంగా లేవని, సైన్స్ ల్యాబ్ కావాలని, భోజనశాలలో తగిన సంఖ్యలో, కుర్చీలు లేవని పాఠశాలకు శుక్రవారం తనిఖీ కోసం వచ్చిన కలెక్టర్‌కు సమస్యలను ఏకరువు పెట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, జోనల్ అధికారి రజితలు సైతం పాఠశాలలో అవసరమైన చిన్న, పెద్ద మరమ్మతులకు నిధులు లేకపోవటం వల్ల తాము ఏమీ చేయలేక పోతున్నామని, నిధులు మంజూరు చేయాలంటూ కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. దీనికి కలెక్టర్ సమాధానమిస్తూ కొత్త డ్రైనేజి పైప్‌లైన్, టాయిలెట్ల మరమ్మత్తులు, అదనపు టాయిలెట్లు, దోమల నివారణకోసం మెష్, ఫ్లోరింగ్ వంటి పనులకు అవసరమైన వ్యయ అంచనాల ప్రతిపాదనలు తనకు పంపాలని సూచించారు.

భోజనశాలలో విద్యార్థులకు సరిపడే విధంగా, కుర్చీలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకొనే దిశగా పోటీతత్వంతో చదవాలని, విద్య ద్వారానే మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలుగుతారని హితబోధ చేసారు. వంట గదిలోకి వెళ్లిన కలెక్టర్ పరిశీలించి స్టోర్‌లో వంట సామగ్రి నాణ్యతగా ఉండేలా చూడాలని, ఎక్స్‌పైర్ అయిన పదార్థాలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రెండవ అంతస్తులో నిర్మాణంలో ఉన్న హాలును ఆయన పరిశీలించారు.

## అన్ని సౌకర్యాలతో ఇళ్ల స్థలాలు ఉండాలి

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం, కొడంగల్:** దేవాలయ అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న బాధిత కుటుబాలకు అన్ని సౌకర్యాలతో కూడిన ఇళ్ల స్థలాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలో శ్రీవేంటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిలో భాగంగా పట్టణంలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసిత కుటుంబాలకు కేటాయిం చే ఇళ్ల స్థలాన్ని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ మేరకు కుటుంబాలకు కేటాయించిన స్థలాన్ని రోడ్డు లెవల్‌కు తగిన చదును చేయాలని సూచించారు. అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా, సౌకర్యవంతమైన రోడ్లను ఏర్పాటు చేయాలని సూచలిచ్చారు.

ఇందులో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు విజయకుమార్‌లున్నారు.

**మంజురైన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించాలి**

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబర్ 18లో గల ఇందిరమ్మ బుడగ జంగం కాలనీలో మంజురైన 13 ఇండ్లకు సంబంధించిన పనుల ను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరిలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు అందజేసిన వారి వివరాలను మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహమ్మద్‌ను కలెక్టలనడిగి తెలుసుకున్నా రు. ఇందిరమ్మ ఇండ్లు మంజురైన ప్రతి ఒక్కరూ ఇండ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల మంజురు కలెక్టర్ ను అడుగగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు అవుతుందని కలెక్టర్ తెలిపారు.

## దొడ్డి కొమరయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలి

### 79వ వర్ధంతి కార్యక్రమంలో పలువురు పిలుపు





**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** భూమి, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన దొడ్డి కొమరయ్య విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. న్యూనాగోల్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితతి ఆధ్వర్యంలో ఉడుతల మల్లేష్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో గెరిల్లా సాయుధ వీరుడిగా ప్రాణాలను అర్పించిన కొమరయ్య ఆదర్శనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి హమీ ద్, జగన్ యాదవ్, నాగభూషణం, దండు నిరంజన్, సంఘ సైదారావు, సిహెచ్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో** ఇందిరా నగర్ కాలనీ చౌరస్తా లో మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడుగా బిసి సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజు జరిగిన కార్యక్రమానికి రచ్చ కిషన్ దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్, బాపిరాజులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడై స్ఫూర్తినిచ్చిన వ్యక్తి దొడ్డి కొమరయ్య అని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని, తెలంగాణలో భూస్వామ్యపాలన కు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి జె.లక్ష్మి, బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.ప్రమీల, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, జి.నాగరాజు ఎఐటియు సి మండల కార్యదర్శి దండు రమేష్, బికెఎంయు మండల కార్యదర్శి, అధ్యక్షులు కె. మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**దేవేందర్ నగర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ బీరప్ప దేవాలయం వద్ద బోడుప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడై స్ఫూర్తినిచ్చిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని తెలిపారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని, తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు జెన్నె దర్మయ్య కురుమ, ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్ కురుమ, కోశాధికారి బండ బీరప్ప కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ మైల్ల నర్సింహ్మా కురుమ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వారాహి నవరాత్రుల సందర్భంగా అన్నదానం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని సైలెంట్ ఎవెన్యూ,ఎల్ఎన్ఆర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గా దేవి దేవస్థానం వారాహి దేవి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని 9వ రోజు వారాహి దేవికి పంచామృత హోమం ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంపనబోలు స్వప్నహరిగౌడ్,నాయకులు సంపనబోలు హరిగౌడ్, రేగళ్ల సతీష్‌రెడ్డి,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 4కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యతను చాటుదాం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యాక్షులు గోపాల్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌మహిపాల్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గీత, ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక పోరాటాలతో, త్యాగాలతో సాధించిన కార్మిక చట్టాలను సాధించుకుంటే కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అనుకులంగా మార్చే కుట్రలకు ఒడిగట్టిందన్నారు. మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా సమయంలో పార్లమెంటులో 29 కార్మిక చట్టాలను 4కోడ్స్‌గా బిల్లు ఆమోదం తెలపబడిందని ఇప్పటి వరకు కూడా అమలు చేయకుండా కేంద్రప్రభుత్వం వెనుకడుగు వేస్తుంది. అంటే అది కేవలం కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్యతతో ఉన్నారనే భవనతో మాత్రమేనని ఇట్టి కార్మిక వ్యతిరేక విధానాలైన 4కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యతను చాటడానికి జులై9న జరగబోయే ఒక్కరోజు సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని లేక పోతే 12గంటల పనిదినంతోపాటు కార్మికులు బానిసత్వంలోకి నెట్టివేయబడతారని ఈ 4 కోడ్స్ వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని పాత కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి కార్మిక వర్గం సమ్మె విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్, నవీన్‌కుమార్,లక్ష్మి య్య, లక్ష్మి , ఎల్లమ్మ, అనిల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




## మొక్కలు మానవ మనుగడకు దోహదం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మొక్కలు మానవ మనుగడకు దోహదపడతాయని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి ప్రాథమికొన్నత పాఠశాలలో ఎక్సలెన్షియా కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని పిలునిచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఎక్సలెన్షియా కళాశాల ప్రిన్సిపల్ నీరజ, ఎఒ రాంచందర్‌రావు, క్యాంపస్ హెడ్ భానుప్రసాద్, సిఐ శ్రీనాథ్, ఎస్ఐ దశరథ, ఎంఇఒ కమలాకర్, మాజి సర్పంచ్ కట్టెల రవీందర్, మెనేజర్ శ్రవన్‌కుమార్, హెచ్‌ఎం సుభ్రమణ్యస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



## అశోక్‌గౌడ్‌ను కలిసిన పారిశ్రామికవేత్తలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉప్పల్‌లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు కన్వీనర్ కె. అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం కుషాయిగూడ పారిశ్రామికవేత్తలు అశోక్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసి జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ అడ్‌హక్ కమిటీ సభ్యులు నీరుగొండ సతీష్‌బాబు, పారిశ్రామిక వేత్తలు వాసిరెడ్డి శివప్రసాద్, కొండలరావు, నాగభూషణం, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## భారీగా చెట్ల నరికివేత



**ప్రజాపక్షం/చర్లపల్లి:** శివసాయి నగర్ కాలనీలో భారీ మర్రిచెట్టు, తాటి చెట్టు నరకడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివసాయి నగర్2 డిమార్ట్ వద్ద మర్రి చెట్టు, తాటి చెట్లను స్థానికులు అడ్డుకుంటున్నా వినకుండా అనుమతులు ఉన్నాయంటూ బెదిరించి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసే ప్రయత్నం చేశారు. స్థానికులు ప్రతిఘటించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలుపడం తో రంపంతో కోసిన కొమ్మలు సగానికి వదిలివేసి రంపం యంత్రాలతో పారిపోయారని స్థానికులు తెలిపారు. చెట్లను నరికివేస్తున్నవారిపట్ల చర్యలు తీసుకోవాలనికోరారు.

## విద్యార్థులకు నోట్స్‌బుక్స్ అందజేత

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** హైదరాబాద్ ప్రాంతానికి చెందిన కాశీ అన్నపూర్ణేశ్వరి సేవాసమితి అధ్వర్యంలో వికారాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నపాఠశాల మదన్‌పల్లి, కోట్‌పల్లి మండలపరిధిలోని మోత్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యాసంవత్సరానికి అవసరమైన బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు, వస్తుసామాగ్రిని అందజేశారు. అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం గొప్పదని, విద్యవల్ల పొందే లాభం జీవితాంతం ఉంటుందని,పేద విద్యార్థులకు చదువుకు ఇబ్బం ది ఉండకూడదని చేస్తున్న సేవాకార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మదన్‌పల్లి ప్రధానోపాధ్యాయులు యుదయ్య తెలియజేశారు. యోగ్యుడికి ఇచ్చిన దానమే నిజమైనదానమని, మొత్కుపల్లి ప్రధానోపాధ్యాయులు అరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట :** రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం, రైతు భరోసా, క్రిస్టియన్ మైనార్టీ వర్గానికి చెందిన 20 మంది మహిళా లబ్దిదారులకు కుట్టు మిషన్లు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బొమ్మ రాములు, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు : డిసిపి



**ప్రజాపక్షం/కొత్తూరు :** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని శంషాబాద్ డిసిపి రాజేష్ తెలిపారు. శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటిలో శంషాబాద్ డిసిపి రాజేష్ ఆధ్వర్యంలో కార్డెన్ చర్చ్ నిర్వహించారు. కిరాణ షాపుల నుండి మొదలుకొని పాన్ షాపులు, బెల్టు షాపులతోపాటు వివిధ రాష్ట్రాల కార్మికులు నివాసాలు ఉండే ప్రాంతాలను తనిఖీలు చేశారు. వాహనాలను తనిఖీ చేసి వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా..లేదా అనే వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డిసిపి రాజేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే కార్మికులకు ఇళ్ళు అద్దెకు ఇచ్చే సమయంలో తగిన గుర్తింపు పత్రాలను చూసుకోవాలని సూచించారు. తనిఖీల్లో అదనపు డిసిపి పూర్ణచందరావు, శంషాబాద్ ఏసిపి శ్రీకాంత్ గౌడ్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## యువశక్తిని వెలుగులోకి తీసుకొచ్చిన మేధావి స్వామి వివేకానంద

గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** భారత సంస్కృతి, ధర్మం, యువత శక్తిని అంతర్జాతీయ స్థాయిలో వెలుగులోకి తీసుకొచ్చిన మేధావి స్వామి వివేకానంద అని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వివినగర్ బస్‌స్టాండ్‌లో స్వామి వివేకానంద వర్ధంతిని నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలుకూరి రాంరెడ్డి, ఆనంద్‌కుమార్, ఓంకార్, వెంకటేష్‌చారి, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, కేశవ్‌నాయక్, సుజాత, రూపుల, శివరామ్, శ్రీకాంత్, సిరిరెడ్డి, వినయ్, గిరీష్, వంశీ, టింకు పాల్గొన్నారు.

## రోహింగ్యాలపై పోరాటం ఆగదు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** రోహింగ్యాలపై పోరాటం ఆగదని, నియోజకవర్గంలోని హిందువులంతా ఏకతాటిపైకి రావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. శుక్రవారం తన నివాసంపై రెక్కి నిర్వహించిన రోహింగులపై చర్యలు తీసుకోవాలని మీర్‌పేట పోలీసులకు అందెల శ్రీరాములుయాదవ్ పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ బాలాపూర్‌లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాల స్థావరాలను గుర్తించి సాక్షాదారాలతో ప్రభుత్వ అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. దీంతో శుక్రవారం కొందరు రోహింగ్యాలు తన నివాసం వద్ద రెక్కీ నిర్వహించగా వారిని మా వర్కర్ ప్రశ్నించడంతో ఓ వ్యక్తి తన వాహనాన్ని అక్కడ వదిలేసి పారిపోయాడని, వాహనంలో పెట్రోల్ బాటిల్, సుత్తి, కట్టర్, రాడ్స్ కనిపించగా మీర్‌పేట పోలీసులకు పిర్యాధు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్‌బిస్టేడియంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభకు ఆర్‌కెపురం డివిజన్ నుండి కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా తరలి వెళ్లారు. ర్యాలీకి దేప భాస్కర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్‌ల అధ్యక్షులు బోయిన శంకర్‌యాదవ్, పున్న గణేష్, చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మదుసూదన్, సురేష్, తలాటి రమేష్‌నేత, ధన్‌రాజ్ గౌడ్, యం.ఐ.గుల్షాని, చిక్కుళ్ల శివప్రసాద్, సైదులు, శేఖర్ పాల్గొన్నారు.

## విద్యలో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు




**ప్రజాపక్షం/షాబాద్ :** విద్యార్థులు విద్యారంగంలో రాణించినప్పుడే బంగారు భవిష్యత్తు సాధ్యం అవుతుందని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామానికి చెందిన బొంతపల్లి విద్యాసాగర్‌గుప్త తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం హైతాబాద్, చందనవెల్లి, రుద్రారం, ఏట్ల ఎర్రవల్లి, తదితర గ్రామాల్లో వివిధ పాఠశాలలోని 1500మంది విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. కుమ్మరిగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పెద్ద గొల్ల లక్ష్మణ్ ఉచితంగా బూట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న విద్యసాగర్ గుప్త, గొల్ల లక్ష్మణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, వీరేష్ గుప్త, వీరయ్యగుప్త, పూర్ణచందర్‌గుప్త, శ్రీనివాస్‌గుప్త, కుమ్మరి గూడ ప్రధానోపాధ్యాయులు రామగణేష్ నర్సింలు, ఉపాధ్యాయులు కీర్తన, లింగం పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో సీజనల్ వ్యాధులు, వెక్టార్ బోర్న్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మెడికల్ అండ్ హెల్త్, అనుబంధ శాఖల అధికారులతో కమిషనర్ ఒక్కరోజు వర్క్ షాప్ నిర్వహించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, అదనపు కమిషనర్లు సిఎన్.రఘుప్రసాద్, సుభద్ర, చీఫ్ మెడికల్ హెల్త్ అధికారి డాక్టర్ పద్మజ, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ ఉమా, ఉస్మానియా యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ జె.వెంకటేశ్వరరావు, ఐఐసిటి సైంటిస్ట్ కె.లక్ష్మి నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, వెక్టార్ బోర్న్ వ్యాధుల పట్ల తీసుకున్న చర్యలు వివరించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు ముఖ్యమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు ప్రజలు పాటించాలన్నారు. ఇప్పటి వరకు వెక్టార్ బర్న్ వ్యాధులు డెంగీ, మలేరియాతో పాటుగా సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో డెంగీ, మలేరియా వ్యాధి బారిన పడకుండా ఫాగింగ్, ఏఎల్‌ఓ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టినట్టు కమిషనర్ వివరించారు. తీసుకున్న చర్యలపై మరిన్ని చర్యలు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. వెక్టార్ బర్న్ వ్యాధి కట్టడికి ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు ఇంటర్ డిపార్ట్‌మెంట్ సహకారం అవసరమన్నారు. సహాయ మెడికల్ అధికారులు నోడల్ అధికారిగా వ్యవహరించాలన్నారు.

వ్యాధుల నివారణకు పటిష్టమైన చర్యలు : డాక్టర్ పద్మజ

డాక్టర్ పద్మజ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో వెక్టార్ బర్న్, సీజనల్ వ్యాధులపై జిహెచ్‌ఎంసిలో చేపట్టిన చర్యలు వివరించారు. అర్బన్ మలేరియా ద్వారా ఫీవర్ సర్వే, ఏఎల్‌ఓ, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. పారిశుద్ధ్యం రోజుకొక వార్డు, వారంలో వార్డులో పూర్తి చేస్తామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ రోజుకు ఒక వార్డు చొప్పున 150 వార్డులలో చేస్తున్నట్లు, ఈ ఫాగింగ్ ప్రక్రియను వారం రోజుల్లో వార్డ్ వార్డులో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఏఎల్‌ఓ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టామని, కళాశాల, హై స్కూల్ విద్యార్థులకు ఐఇసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జాతీయ వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడారు. డెంగీ, మలేరియా వ్యాధి నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో వివరించారు. ఇంటిగ్రేటెడ్ డిసీజెస్ సర్వేలెన్స్ ప్రోగ్రామ్ పై డాక్టర్ బాలాజీ జాయింట్ డైరెక్టర్ సీజనల్ వ్యాధులపై వివరించారు. విక్టర్ బర్న్ డిసీజెస్, ప్రివెన్షన్ ట్రీట్‌మెంట్, కంట్రోల్ చేసే పద్ధతులపై ఉస్మానియా యూనివర్సిటీ ఎంటమాలజి విభాగం ప్రొఫెసర్ జె. వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. టెక్నాలజీ ప్రకారంగా దోమల బెడద, వ్యాధులు ప్రబలిన ప్రాంతాలను గుర్తించి నివారించవచ్చునన్నారు. లేక్స్ హై చిన్ నివారణపై పద్దతులు ఐఐసిటి సైంటిస్ట్ కె. లక్ష్మి నారాయణ రాజు లేక్స్ రెస్టోరేషన్, వాటర్ హ్యాచిన్‌పై దోమల నివారణ పద్దతులను వివరించారు. గుర్రపు డెక్కను తొలగించి బయటకు తొలగించకుండా అక్కడే వెయ్యి గజల్లో ఎరువుగా మార్చుకోవచ్చునని అన్నారు.

### సెప్టెంబర్‌లో ఎక్కువ డెంగీ కేసులు

డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకన్న

హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ హైదరాబాద్‌లో సెప్టెంబర్ మాసంలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని, యాంటీ లార్వా కార్యక్రమాలు ఎక్కువ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మెడికల్, జిహెచ్‌ఎంసి సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి యాంటీ లార్వా కార్యక్రమాలను చేస్తున్నట్టు, హైదరాబాద్ జిల్లాలో కేసులు నమోదు అవుతుందని, ఐఇసి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని, ప్రతి స్కూల్ డెంగీ వ్యాధి నివారణకు ఆవాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఏటాకేసులు పెరుగుతున్నాయని ఒక్కొక ఏరియా ఒక్కొక్క సంవత్సరం కేసులు నమోదు కావడంతో సినిమా థియేటర్లు, మార్కెట్‌లలో జిహెచ్‌ఎంసితో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంటమలాజి సిబ్బంది కలిసికట్టుగా నివారణ కార్యక్రమంలో చేపడుతున్నట్లు వివరించారు. మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా మాట్లాడుతూ జిహెచ్‌ఎంసితో కలిసి యాక్టర్ బోర్న్ వ్యాధులను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని, అందుకోసం క్రియేటివ్ టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వడం జరిగిందన్నారు.

## అర్హత కలిగిన ప్రతీ మహిళనై స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలి

అర్హత కలిగిన ప్రతి మహిళను స్వయంసహాయక సంఘాలలో చేర్పించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో స్వయం సహాయక సంఘాల ప్రగతిపై జిహెచ్‌ఎంసి పరిధిలోని 30 సర్కిళ్ల ప్రాజెక్ట్ ఆఫీసర్లతో శుక్రవారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ఇప్పటికే చేరని మహిళలను ఇంటింటి తిరిగి చేర్చే చర్యలు తీసుకోవాలని సూచించారు. విడతలవారీగా అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని సూచించారు. ఆత్మ నిర్భరత కోసం జిహెచ్‌ఎంసి పరిధిలోని మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు క్యాటరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, స్ట్రీట్ వెండర్ కలెక్టివ్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మీ సేవా సెంటర్లు, మహిళ శక్తి క్యాంటీన్లు వంటి విభాగాల్లో శిక్షణ, ఆర్థిక సాయంపై దృష్టి సారించాలని సూచించారు. సర్కిళ్ల వారీగా ఉత్సాహం ఉన్న మహిళా సంఘాలను గుర్తించి వారికి శిక్షణ, ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. ప్రతి సర్కిల్‌లో కమ్యూనిటీ హాల్‌ను షెల్టర్ హోమ్‌గా ఏర్పాటు చేసి, నిరాశ్రయులను ఎన్‌జిఓల సహకారంతో పునరావాసం కల్పించాలన్నారు. వీరు తిరిగి రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగులు, ట్రాన్స్‌జెండర్‌లు, వృద్ధుల కోసం కూడా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్ ఎస్.పంకజ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం. దేవేందర్‌రెడ్డి, పి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై చర్యలు




### రౌండ్‌టేబుల్‌లో పలువురు వక్తల డిమాండ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య–ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ'పై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర నేత బుర్ర రాముగౌడ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎంవి ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.వెంకట్‌రెడ్డి, టీచర్స్ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ అధ్యక్షుడు జనార్ధన్, తల్లిదండ్రుల సంఘం అధ్యక్షురాలు జి.భాగ్యమ్మ, ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తోపాటు పలువురు మేధావులు, విద్యావంతులు హాజరయ్యారు. ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై 10 నుంచి 15శాతం బడ్జెట్ కేటాయిస్తే, విద్యార్థులకు నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. జనార్ధన్ మాట్లాడుతూ 6నుంచి 14ఏళ్ల వయసు పిల్లలకు ఉచిత నిర్బంధవిద్య అమలు చేయాలని కోరారు. భాగ్యమ్మ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యఅందించాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, చైల్డ్ రైట్స్ ఫోరం ప్రతినిధి డి.ప్రకాశ్, మదర్ లవ్ సంస్థ ప్రతినిధి డా.ఎ.శ్రీనివాస్, స్కూల్ పేరెంట్ అసోసియేషన్ ప్రతినిధి కె.వెంకట్ సాయినాథ్, అక్షర ఫౌండేషన్ ప్రతినిధి ఆంజనేయులు, ఆప్‌నేతలు డా.సొలోమన్ రాజ్, సుధారాణి, నర్సింగ్, యమునాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## రోశయ్య ఆశయాలు నేటితరానికి ఆదర్శం

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో కొణిజేటి రోశయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సంగీత పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్ హయాంలలో ఆర్థిక శాఖతోపాటు రోడ్లు భవనాలు, రవాణా, హౌసింగ్, విద్యుత్‌శాఖ, హోమ్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు విద్యాశాఖ మంత్రిగా తన సేవలు అందించారని తెలిపారు. ఆర్థికశాఖ మంత్రిగా 16సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రిగా కొంతకాలం సేవలు అందించారని, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా పనిచేశారని వివరించారు. అలాంటి మహనీయుడు రోశయ్య ఆశయాలను నేటియువత ఆదర్శంగా తీసుకొవాలని డిఆర్ఓ సంగీత చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వరావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరు రోశయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరు కొణిజెటి రోశయ్య అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం రోశయ్య జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయం సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాసులు గుప్తా ఆధ్వర్యంలో రోశయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, ఆర్యవైశ్య నేతలు కల్వ యాదగిరి, సరాపు రమేష్ కుమార్, నాగిళ్ల గోపాల్ గుప్తా,రవికుమార్ గుప్తా పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్





**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ ప్రజలకు సామాజికి న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందనే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సమ్మేళన బహిరంగ సభకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సారధ్యంలో కాంగ్రెస్ దండు కదలివెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటిల నుంచి 600వాహనాల ద్వారా 3వేల మందికి పైగా కాంగ్రెస్ సమ్మేళన సభకు తరలివెళ్ళినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, చల్లా శ్రీకాంత్ రెడ్డి, వీరేష్, కృష్ణారెడ్డి, రాజు, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్‌రెడ్డి, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, విశ్వం, బస్వం, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, జమృద్‌ఖాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్, లింగారెడ్డిగూడ అశోక్‌తోపాటు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# పకడ్బందీ ప్రణాళికతో వన మహోత్సవం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవంలో తీసుకున్న లక్ష్యాలను వంద శాతం పూర్తయ్యేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్లాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులు, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన మహోత్సవాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని, గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు ప్రభుత్వ అనుబంధ సంస్థలు పారిశ్రామికవాడల్లో, అదే విధంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలను అధిగమించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మొక్కలకు ఫెన్సింగ్, నీటి సదుపాయంతో పాటు సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వారానికి 25 శాతం లక్ష్యాన్ని చేరుకుంటే నెల రోజుల్లో వంద శాతం లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అవకాశం ఉన్న చోట లేబర్లను నియమించుకోవాలని, వనమహోత్సవం విషయంలో ముందుగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

**తనిఖీలు చేయాలి...** వర్షాకాలం దృష్ట్యా జిల్లాలోని హాస్టళ్లు, పాఠశాలల్లో శానిటేషన్‌పై వారంలో మంగళ, బుధ, గురువారాల్లో తనిఖీలు చేయాలని, ముఖ్యంగా పురుగుపట్టిన బియ్యం ఉంటే వెంటనే తిరిగి ఇచ్చేయాలని, మధ్యాహ్నం భోజనం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, దీంతో పాటు కిచెన్, స్టోరేజ్ గదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సంబంధింత అధికారులకు సూచించారు. అంతే కాకుండా హాస్టల్స్, పాఠశాల భవనాల పైకప్పులను శుభ్రం చేసుకోవడం ద్వారా లీకేజీలకు చెక్ పెట్టవచ్చన్నారు. వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి శుభ్ర చేసుకోవాలని తెలిపారు. హాస్టల్స్, పాఠశాలల్లో ఎక్కడ ఏసమస్య ఉన్నా సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కలెక్టర్ అన్నారు. బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు 10వ తరగతి తరువాత ఏ ఒక్క విద్యార్థి కూడా డ్రాఫ్ అవుట్ వుండకూడదని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఒ సురేష్ మోహన్, డిఆర్ డిఏ శ్రీలత, వ్యవసాయశాఖ అధికారి నరసింహారావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి పద్మావతి, హౌసింగ్ పిడి నాయక్, మైనార్టీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

# రీల్

## నాగ చైతన్య రెండవ షెడ్యూల్ షురూ




యువ సామ్రాట్ నాగ చైతన్య హీరోగా ఎస్‌విసిసి బ్యానర్ పై నిర్మిస్తున్న సినిమా షూటింగ్ రెండవ షెడ్యూల్ ప్రారంభమైంది. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలలోని పలు లొకేషన్లలో ఈ షూటింగ్ జరుగుతుంది. అక్కినేని నాగచైతన్యకు ఇది ఇరవైనాలుగవ సినిమా. యాక్షన్ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇంతవరకు నాగ చైతన్య చేయనటువంటి పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తుండగా, బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా, నవీన్ నూలి ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## తండ్రి, తనయుల దరహాసం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ పెద్ద కుమారుడు అకీరా నందన్, చిన్న కుమారుడు మార్క్ శంకర్ తో శుక్రవారం ఉదయం మంగళగిరిలోని తన నివాసానికి చేరుకున్నారు. త్వరలోనే అకిరా తెలుగు తెరపై హీరోగా దర్శనమివ్వనున్నారు. అకిరా కథలు కూడా వింటున్నట్టు ఫిలిం నగర్ టాక్. మరి ఈ తండ్రి కొడుకులు కలిసి ఎప్పుడు సినిమా చేస్తారో వేచి చూడాల్సిందే. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విడుదల అవుతున్న మొదటి సినిమా హరి హర వీర మల్లు. ఈనెలలోనే హరిహరవీరమల్లు ప్రేక్షకుల ముందుకు రానుంది.



## తానా సభలకు నిఖిల్




తెలుగు తెరపై తన కంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న హీరో నిఖిల్ సిద్ధార్థ్. కార్తికేయ వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నిఖిల్ ఇప్పుడు తానా సభలకు అతిధిగా హాజరవుతున్నారు. తానా సభల కోసం ఆయన అమెరికా వెళ్లారు. స్వయంభు, ది ఇండియా హౌస్ వంటి సినిమాల్లో నటిస్తున్న నిఖిల్ ప్రస్తుతం తానా సభల కోసం కొన్ని రోజుల పాటు షూటింగ్‌కు విరామం ప్రకటించారు. తానా సభల ఉత్సవాల అనంతరం నిఖిల్ తిరిగి షూటింగ్‌లో పాల్గొంటారు.

## సస్పెన్స్ జానర్‌లో 'మిస్టీరియస్'



అలనాటి రక్త కన్నీరు నాగ భూషణం మనవడు అబిద్ భూషణ్, బిగ్ బాస్ ఫేమ్ రోహిత్ సహాని హీరోలుగా జంటగా వస్తున్న చిత్రం మిస్టీరియస్. ఆష్లీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా, శివాని నిర్మించిన ఈ చిత్రానికి మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు.రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ హీరోయిన్లుగా తెరకెక్కిన ఈ చిత్రం టీజర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ జానర్‌లో వస్తున్న ఈ సినిమా ఆడియన్స్‌కి సరికొత్త అనుభవం కలిగిస్తుందని అన్నారు. నిర్మాతలు ఉషా, శివాని మాట్లాడుతూ 'సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించామని, టీజర్ అందరికీ నచ్చడం సంతోషమని, ఫ్యూచర్లో మరిన్ని మంచి సినిమాలతో ఆడియన్స్‌ని ఎంటర్ టైన్ చేస్తామని' తెలిపారు. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు పాటలు మంచి టాక్ తెచ్చుకోవడంతో పాటు రిలీజ్ అయిన టీజర్ కి కూడా మంచి అప్లాజ్ రావడం ఆనందంగా ఉందని నిర్మాతలు అన్నారు.

## 'రామాయణ' వచ్చే ఏడాది విడుదల




నితేశ్ తివారీ దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, యాష్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ తో కలిసి నిర్మిస్తున్న రామాయణ చిత్రం ఐమాక్స్ ఫార్మాట్ లో చిత్రీకరిస్తున్నారు. చిత్రం పార్ట్ 1 – దీపావళి 2026లో, పార్ట్ 2 – దీపావళి 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 'రామాయణ: ది ఇంట్రడక్షన్' పేరిట ఈ ఎపిక్ మూవీని గ్లోబల్‌గా ఆవిష్కరించారు. ఇది పురాణాలలోని రెండు అత్యంత ప్రసిద్ధ శక్తులైన రాముడు వర్సెస్ రావణ మధ్య కాలాతీత యుద్ధానికి వేదికగా నిలవనుంది. ఈ ప్రయోగం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది ఈ లాంచ్ భారతదేశంలోని తొమ్మిది ప్రధాన నగరాలలో ఫ్యాన్ స్క్రీనింగ్స్ ద్వారా, అలాగే న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో భారీ బిల్బోర్డ్ ద్వారా వరల్డ్ వైడ్‌గా జరిగింది. దర్శక నిర్మాత నమిత్ మల్హోత్రా నేతృత్వంలో, యాష్ సహనిర్మాతగా రూపొందిస్తున్న ఈ రామాయణ& ఆస్కార్ అవార్డు పొందిన సాంకేతిక నిపుణులు, హాలీవుడ్ నిపుణులు, భారతీయ నటీనటులు, కథా కళాకారులను ఒకే వేదిక పైకి తీసుకొస్తోంది. నాగరికతలోని అత్యంత శక్తివంతమైన ఇతిహాసాన్ని ఆధునిక సాంకేతికతతో, భారతీయ సంస్కృతి మూలాలపై ఆధారపడిన ప్రపంచస్థాయి సినిమాటిక్ యూనివర్స్‌గా రూపొందిస్తున్నారు. భారతీయ సినిమాలో నాలుగో తరం ఐకాన్ రణబీర్ కపూర్ రాముడిగా నటిస్తున్నారు. పాన్ ఇండియా సూపర్‌స్టార్, సహనిర్మాత యష్ రావణుడిగా అందరి మనసులను గెలుచుకున్న అభిమాన నటి సాయి పల్లవి సీతగా హనుమంతుడిగా సన్నీ డియోల్ – లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. నిర్మాత, దర్శకుడు, ప్రైమ్ ఫోకస్ వ్యవస్థాపకుడు, నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ..ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడికీ సంబంధించిన ఒక సాంస్కృతిక ఉద్యమం. రామాయణం ద్వారా మేము కేవలం చరిత్రను తిరిగి చెబుతున్నట్లు కాదు మేము మన వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం. ఈ సినిమా ఈ గ్లింప్స్‌ను ప్రత్యేకంగా మీడియా కోసం హైదరాబాద్ ప్రసాద్ మల్టీప్లెక్స్‌లోని స్క్రీన్‌పై ప్రీమియర్ చేశారు.

## ఒటిటిలోకి 'నరివేట్ట'

మలయాళంలో ఇటీవల విడుదలైన యాక్షన్ డ్రామా 'నరివేట్ట' చిత్రానికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అలాంటి బ్లాక్ బస్టర్ ఇప్పుడు ఓటీటీలోకి రాబోతోంది. జూలై 11 నుంచి 'నరివేట్ట' చిత్రం సోనీ లివ్‌లోకి రాబోతోంది. ఇండియా సినిమా కంపెనీ బ్యానర్‌పై టిప్పుషన్, షియాస్ హసన్ నిర్మించిన ఈ చిత్రానికి అనురాజ్ మనోహర్ దర్శకత్వం వహించారు. ఈ నరివెట్ట చిత్రంలో టొవినో థామస్ ఇప్పటి వరకు పోషించిన ఓ పవర్ ఫుల్ పాత్రను పోషించారు.ఓ యంగ్ అండ హానెస్ట్ పోలీస్ కానిస్టేబుల్‌గా వర్గీస్ (టొవినో థామస్) నటించారు. వయనాడ్ ప్రాంతానికి వర్గీస్ ట్రాన్స్‌ఫర్ అవ్వడం, అక్కడి పరిస్థితులపై పోరాడటం అనే కథను అద్భుతంగా చూపించారు. ఆదివాసీ సంఘాలు తమకు భూమిని కేటాయించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడంపై తీవ్ర నిరసనలు మొదలుపెడతాయి. ఈ పరిస్థితుల్ని ఆ కానిస్టేబుల్ ఎలా చక్కబెట్టాడు అనేది కథ. ఈ





చిత్రంలో టోవినో థామస్‌తో పాటు, సూరజ్ వెంజరమూడు, చేరన్, ఆర్య సలీం, ప్రియంవద కృష్ణన్, ప్రణవ్ టియోఫిన్ తదితరులు నటించారు. ఎన్ఎం బాదుషా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా, జేక్స్ బెజోయ్ సంగీతం దర్శకుడిగా పని చేశారు.

## హరి హర వీరమల్లు రికార్డుల మోత




పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'హరి హర వీరమల్లు' చిత్రం ట్రైలర్ ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొడుతోంది. 'హరి హర వీరమల్లు' ట్రైలర్ తెలుగులో కేవలం 24 గంటల్లోనే 48 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, తెలుగు సినిమాల పరంగా సరికొత్త రికార్డును నెలకొల్పింది. అన్ని భాషల్లో కలిపి దాదాపు 62 మిలియన్ల వ్యూస్ సాధించింది. దర్శకుడు జ్యోతి కృష్ణ ట్రైలర్‌ను రూపొందించిన తీరు అందరినీ మంత్రం ముగ్దుల్ని చేసింది. ట్రైలర్ అందరి అంచనాలకు మించేలా ఉంది. వీరమల్లును ఆయన ఒక పాత్రగా కాకుండా, సినిమాటిక్ శక్తిగా మలిచారు. బలమైన భావోద్వేగాలు, అద్భుతమైన యుద్ధ సన్నివేశాల మేళవింపుతో ట్రైలర్‌ను మలిచిన తీరు మెప్పించింది. దీని ప్రభావం అన్ని వర్గాల ప్రేక్షకులలో ప్రతిధ్వనిస్తోంది.

## 'కూలీ'లో అమీర్ ఖాన్ లుక్



సూపర్ స్టార్ రజనీకాంత్ 'కూలీ' సినిమాలో బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ నటిస్తున్నారు. నాగార్జునతో పాటు అమీర్ ఖాన్ కీలకపాత్ర పోషిస్తున్న నేపథ్యంలో అమీర్ ఖాన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. లోకేష్ కానగరాజ్ ఈసినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. అమీర్‌ఖాన్‌ని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. గోల్డెన్ వాచ్, గోల్డ్ ఫ్రేం వున్న గ్లాసెస్ ధరించి సిగరెట్ తాగుతూ అమీర్‌ఖాన్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## 'ఫోనిక్స్' సినిమా చూసిన తలపతి విజయ్



తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన తమిళ నటుడు విజయ్ సేతుపతి నట వారసుడు సూర్య సేతుపతి నటించిన సినిమా ఫోనిక్స్. ఈ సినిమాను తమిళ తలపతి విజయ్ తిలకించారు. సినిమా చూసిన అనంతరం విజయ్ హీరో సూర్యను అభినందించారు. తొలి ప్రయత్నంలోనే బాగా నటించావని విజయ్ మెచ్చుకున్నారు. అలాగే దర్శకుడు అరసు దర్శకత్వ ప్రతిభ బాగుందని కొనియాడారు. తన అభిమాని అయిన సూర్య సేతుపతి సినిమా చూడడం ఆనందంగా ఉందని విజయ్ ఈ సందర్భంగా చెప్పారు. తాను ఎంతగానో అభిమానించే హీరో విజయ్ వచ్చి నా సినిమా చూడటంతో నా ఆనందానికి అవధులు లేవని సూర్య సేతుపతి చెప్పారు. ఇది నాకు ఓ ప్రత్యేక రోజని, జీవితంలో ఈ రోజును మరచిపోలేనని సూర్య తెలిపారు.

# కెసిఆర్‌కు పలువురు నేతల పరామర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్: సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేరిన బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును పలువురు బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంలో వారితో కెసిఆర్ ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు తదితర ప్రజా సమస్యలు, వర్తమాన అంశాలపై కెసిఆర్ సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ నాయకులు, ఉద్యమకారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇష్టాగోష్టిలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, జి.జగదీష్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డితో పాటు మాజీ ఎంఎల్ఎలు, నాయకులు ఉన్నారు.



## అప్పుల ఊబిలో పేదలు

(మొదటి పేజీ తరువాయి)

ఎపిటిబిఇఎఫ్ పి.అజయ్ కుమార్,పి. ఉదయ్ భాస్కర్, ఎఐబిఒఇ అధ్యక్షులు పిఎస్‌పిఆర్ పణికుమార్, జిఐఇఎఐఎ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.కిషన్‌లు హాజరయ్యారు. ఈ సందర్బంగా రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ తర్వాత 1990 నాటికి 60 శాతం వరకు పెరిగిన ప్రభుత్వ రంగ బ్యాంకుల గ్రామీణ శాఖలు మళ్ళీ 26 శాతానికి పడిపోయేలా చేశారన్నారు.తద్వారా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఇ రంగాలకు బ్యాంక్ రుణాలు రోజురోజుకి తగ్గిపోయ్యేలా చేసి ఎన్‌బిఎఫ్‌సిలు,పేమెంట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలు రంగప్రవేశం చేయించారన్నారు. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రుణాలు అందని పేద మధ్య తరగతి ప్రజలు ఈజీ మనీయాప్ అందుబాటులోకి తీసుకురావడంతో ఫైనాన్స్‌కంపెనీల ఉచ్చులోపడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వరంగ బ్యాంకులను, ఇన్స్యూరెన్స్ కంపెనీలను బలోపేతం చేయాలని, బ్యాంక్, గ్రామీణ బ్యాంక్, ఇన్స్యూరెన్స్ రంగ ప్రైవేటీకరణను ఆపాలని, ఇన్స్యూరెన్స్ వ్యాపారం లో 100 శాతం విదేశీ పెట్టుబడులను నిరోధించడంతోపాటు ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలను విలీనం చెయ్యాలని తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ సమ్మెను జయప్రదం చేయాలని రాంబాబు కోరారు. వి.ఎస్. బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి అనేక రాయితీలను ఇస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తూ ఏకపక్షంగా కార్మిక చట్టాలను 4 కోడ్ల రూపంలో మార్చడం గర్హనీయమన్నారు. ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో దేశ వ్యాప్తంగా 25 కోట్లమంది సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతులు, బ్యాంకింగ్, భీమా రంగం ఉద్యోగులు పాల్గొంటున్న ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యమై విజయంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అల్లు అరవింద్‌ను విచారించిన ఇడి

### రూ.101.48 కోట్ల బ్యాంక్ లోన్ కుంభకోణం కేసులో



ప్రజాపక్షం/హైదరాబాద్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆంధ్రాబ్యాంక్) నుంచి రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ రూ.101.48 కోట్ల రుణం పొందిన కుంభకోణం కేసులో ప్రముఖ నిర్మాత అల్లు అరవిందను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు శుక్రవారం విచారించారు. బ్యాంక్ నుంచి రుణం పొందిన తరువాత ఆ నిధులను ఏఏ అకౌంట్స్‌లోకి, ఎందుకు బదలాయించాల్సి వచ్చిందనే కోణంలో అరవింద్‌ను మూడు గంటల పాటు విచారించారు. కేసు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 2018 19లో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ బ్యాంకు నుంచి రూ.101.48 కోట్లు రుణం పొంది దుర్వినియోగం చేయడంతో బెంగళూరు సిబిఐ ద్వారా కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో మనీల్యాండరింగ్ జరిగిందని.. దీని ఆధారంగా ఇడి కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. గత ఏడాది జూన్ 14న ఇడి అధికారులు హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యాలయాలు, సంస్థ డైరెక్టర్లు వి.రఘువేంద్ర, వి.రవికుమార్‌ల ఇండ్లపై దాడులు నిర్వహించింది. ఈ సమయంలో డైరెక్టర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.1.45 కోట్లు ఫ్రీజ్ చేశారు. అనుమానాస్పద ఆస్తుల పత్రాలు, డిజిటల్ డివైజ్‌లను సోదా సమయంలో స్వాధీనం చేసుకున్నారు .ఇతర దేశాలకు జరిగిన చెల్లింపుల వివరాలు కూడా సేకరించారు.ఆ నిధులను ఇతర ఖాతాలకు మార్పిడి చేయడం, కుటుంబ సభ్యుల ఖాతాలకు మార్పిడి, అసలైన అమ్మకపు ఆదాయాన్ని బ్యాంక్‌కు విడుదల చేయకపోవడం ద్వారా ఫ్రాడ్ చేశారని దర్యాప్తులో తేలింది.



## ఎసిబి వలలో డిప్యూటీ తహసీల్దార్

ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి : రైతు నుండి లంచం తీసుకుంటుండగా డిప్యూటీ తాసిల్దార్ నవీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కోటపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న నవీన్ ఒక రైతు నుండి రూ.10 వేల లంచం తీసుకుంటూ శుక్రవారం ఎసిబి అధికారులకు చిక్కాడు. ఈ మేరకు వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డిఎస్‌పి ఎసిబి అధికారి మధు మాట్లాడుతూ ఒక రైతు తన పట్టాదారు పాసుపుస్తకంలో పేర్లు తప్పుగా ఉండటంతో, పేర్లను సరిచేసి కొత్త పాసుపుస్తకం ఇవ్వాలంటూ డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించాడు. దీనికిగాను డిప్యూటీ తహసీల్దార్ నవీన్ రూ.15 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఈనెల 3వ తేదీన మళ్లీ కార్యాలయానికి వెళ్లి తన సమస్యను వివరించగా రూ.10 వేల ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. అంజి అనే వ్యక్తి ద్వారా డిప్యూటీ తాహసీల్దార్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, త్వరలో కోర్టుకు హాజరుపరుస్తాం అని తెలిపారు. ఈ దాడిలో ఎసిబి అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల పైకప్పు

(మొదటి పేజీ తరువాయి)

చెందుతుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యార్థులు ప్రార్థన చేసేందుకు గాను తరగతి గదుల నుంచి పాఠశాలకు ముందుకు వచ్చి ప్రార్థన చేస్తున్న సమయంలో 6వ తరగతి గది పైకప్పు పెచ్చులూడి పడింది. పెచ్చులూడి పడిన సమయంలో విద్యార్థులు ప్రార్థన చేస్తుండడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. పాఠశాలలో శుక్రవారం జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన చెందారు. సర్కారు బడికి తమ పిల్లలను పంపితే, ఇలా పెచ్చులూడిపడి, ప్రమాదాలు జరిగితే ఎలా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శిథిలావస్థకు చేరిన గదులు కూలే అవకాశాలు ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నైనా ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు స్పందించి పాఠశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలని, శిథిలావస్థకు చేరిన గదులకు మరమ్మత్తులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరాయని, పాఠశాలకు కంపౌండ్ వాల్ లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడం లేదని అన్నారు.

## జల కళ

(మొదటి పేజీ తరువాయి)

94,767 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు 1,00,670 క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 37.646 టిఎంసికు గాను 30.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుండి 99,583 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 99,583 క్యూసెక్కులను వదుతుతున్నారు. జూరాల జలాశయం 9.667 టీఎంసీకు గాను 7.991 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శుక్రవారం సాయంత్రం ఎగువ ప్రాంతం నుండి జురాలకు 1,15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా. ప్రాజెక్టు 14 గేట్లు దిగువకు 95,566 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల కుడి, ఎడమ కాలువలు, బీమా లిఫ్ట్ 1, విద్యుత్ ఉత్పత్తికి, కోయిల్ సాగర్ సమాంతర కాలువలకు అన్నింటికి కలిపి 1,27,659 క్యూసెక్కులకు వదులుతున్నట్టు జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతుండడంతో అక్కడి ప్రాజెక్టుల నుండి వస్తున్న వరద నీటితో జూరాల వద్ద జలకళ సంవతరించుకుంది. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకొని జూరాల ప్రాజెక్టుల పై ఆధారపడి నిర్మించబడ్డ ఎత్తిపోతల పథకాలకు అధికారులు నీటిని విడుదలను కొనసాగిస్తుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జురాల జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో జూనాల జలవిద్యుత్ కేంద్రంలో జెన్ కో అధికారులు నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపట్టారు. జూరాల వరద నీటి నుంచి 29,494 క్యూసెక్కులను వినియోగించుకొని విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నట్లు జెన్కో అధికారులు తెలిపారు. మరో రెండు యూనిట్లను త్వరలోనే ప్రారంభించి ఆరు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూరాలకు వస్తున్న వరద ఉధృతిని ఎప్పటికప్పుడు జెన్‌కో ఉన్నతాధికారులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

## షోకాజ్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు ప్రారంభించింది. సంబంధిత పార్టీలకు నోటీసులు అందించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించింది. ఈ విషయంపై దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా జిల్లా అధికారులను ఆదేశించింది. ఆయా పార్టీల నుంచి వివరణ స్వీకరించిన తర్వాత, వాటి గుర్తింపును రద్దు చేయాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన నివేదికను 10వ తేదీలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. జిల్లాల నుంచి అందిన నివేదికల ఆధారంగా తుది నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

### నోటీసులు అందుకున్న పార్టీల వివరాలు

తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ (హన్మకొండ), ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్), జాగో పార్టీ (హైదరాబాద్), నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్), తెలంగాణ లోక్ సత్తా పార్టీ (హైదరాబాద్), తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం (హైదరాబాద్), యువ పార్టీ (హైదరాబాద్), బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్‌ఫూలే) (మేడ్చల్ మల్కాజిగిరి), తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ (మేడ్చల్ మల్కాజిగిరి), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ (రంగారెడ్డి), జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి), యువ తెలంగాణ పార్టీ (రంగారెడ్డి), తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) (వరంగల్).

## నేటి యువతకు స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ రాజ్యసభ సభ్యులు కె.వి.పి.రామచంద్రరావు, ఎస్.వేణుగోపాలచారి, ఎమ్మెల్సీ బోగారపు దయానంద్, కొణిజేటి శివ సుబ్బారావు, వైశ్య సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తాము తెలంగాణ వాధులుగా రోశయ్యతో చర్చించేవాళ్లమని తెలిపారు. రెండు రాష్ట్రాలు వేరైనా ఒకరినొకరు గౌరవించుకోవాలన్నారు. తెలంగాణ ప్రజలు ప్రేమాభిమానాలకు గొప్ప గౌరవం ఇస్తారన్నారు. రోశయ్య ఎంతో దూరదృష్టితో ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దేవారన్నారు. అధికారంలోకి రావడానికి అనేక పథకాలు ప్రకటిస్తామని, వాటిని అమలు చేయాలంటే ఆర్థిక భారాలు ఇబ్బందులకు గురి చేస్తాయన్నారు. ప్రజలకు ఉచితాలతో ఉట్టిగా కూర్చోపెట్టవద్దని రోశయ్య చెప్పేవారన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషమన్నారు. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవమన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు తెలియచేయడం జరిగిందన్నారు. బహుశా దేశంలో ఒక రాష్ట్ర ఆర్థిక మంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బడ్జెట్‌ను సర్దుబాటు చేయడంలో రోశయ్య అందెవేసిన చెయ్యి అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్యదే అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని కొనియాడారు. ఇక వాక్పటిమ, వాగ్ధాటి, చతురతలో రోశయ్యతో ఇంకొకరిని పోల్చలేమన్నారు. రోశయ్యది తెలంగాణ ప్రాంతం కాకపోయినా ఆయనను గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమే అన్నారు. రోశయ్య శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు అని గుర్తు చేశారు.

### రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే..

దివంగత మాజీ గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com